అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 03-02-2019 సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 5 సంచిక : 36 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు + సోపతి వెల : 8.00

టెన్షన్.. టెన్షన్

29 అసెంబ్లీ స్థానాలపై కేసులు!

మూడు నియోజకవర్గాలపై విచారణకు హైకోర్టు ఆదేశం

- మహబూబ్‌నగర్, కరీంనగర్, జూబ్లీహిల్స్‌పై రెండేసి పిటిషన్లు
- ఈవీఎంలు ఓపెన్ చేయొద్దని ఈసీ స్పష్టీకరణ
- పార్లమెంట్ ఎన్నికలకు కొత్త ఈవీఎంలు, వీవీప్యాట్స్





(ఫైల్)



అసెంబ్లీ ఎన్నికలపై పలువురు హైకోర్టు మెట్లెక్కారు. ఎన్నికల నిర్వహణ సక్రమంగా లేదంటూ 34 పిటిషన్లు దాఖలయ్యాయి. 29 నియోజకవర్గాలపై కోర్టుకు వెళ్లగా అందులో మూడు నియోజకవర్గాలపై డబుల్ పిటిషన్లు వేశారు. దీంతో ఆ నియోజకవర్గాల్లోని ఈవీఎంలను అధికారులు భద్రపరిచారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో డిస్పోజల్ చేయాల్సి ఉండగా ఈసీ ఆదేశాలతో వాటిని అలాగే ఉంచారు. హుస్నాబాద్, మంచిర్యాల, తుంగతుర్తి నియోజకవర్గాల విచారణకు హైకోర్టు ఆదేశించింది.

నవతెలంగాణ-జనగామ ప్రతినిధి

రాష్ట్రంలో 119 నియోజకవర్గాలకు డిసెంబర్ 7న ముందస్తు ఎన్నికలు జరిగాయి. పోలైన ఓట్లకు కౌంటింగ్ సందర్భంగా లెక్కించిన ఓట్లకు తేడాలు రావడం అనేక అనుమానాలకు దారితీసిన దరిమిలా రాజకీయ పార్టీలు ఎన్నికలపై విమర్శనాస్త్రాలు గుప్పించాయి. ఎన్నికల కమిషన్ కూడా పోలైన్ల ఓట్లు కౌంటింగ్ సందర్భంగా లెక్కించిన ఓట్ల తేడాను తేటతెల్లం చేయలేదు. అంతా స్తబ్దంగానే ఉండగా పార్లమెంట్ ఎన్నికల కోసం అసెంబ్లీ ఎన్నికల్లో ఉపయోగించిన ఈవీఎంలను డిస్పోజల్ చేయాల్సి వచ్చింది. సరిగ్గా అదే సమయంలో డిసెంబర్ 30న జిల్లాల కలెక్టర్లకు ఎన్నికల కమిషన్ నుంచి ఆదేశాలు వచ్చాయి. 29 నియోజకవర్గాల ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌ను డిస్పోజల్ చేయొద్దు అంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో అలర్ట్ అయిన కలెక్టర్లు ఎన్నికల కమిషన్ సూచించిన నియోజకవర్గాలను మినహాయించి ఇతర నియోజకవర్గాల ఈవీఎంలను డిస్పోజల్ చేసి యథాస్థానంలోకి తెచ్చారు.

హైకోర్టులో నియోజకవర్గాల పిటిషన్

న్యాయవాదులు పిటిషన్లు వేసిన నియోజకవర్గాల్లో హుస్నాబాద్, మంచిర్యాల, తుంగతుర్తి, గద్వాల, గజ్వేల్, కరీంనగర్, ఆసిఫాబాద్, దేవరకొండ, వేములవాడ, పటాన్‌చెరు, ఖైరతాబాద్, మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, ధర్మపురి, జూబ్లీహిల్స్, జనగామ, నాంపల్లి, వికారాబాద్, పరిగి, హుజురాబాద్, సిరిసిల్లా, కోదాడ, నాగర్‌కర్నూల్, ...9లో

ఈసీ ఆదేశాలతో భద్రపర్చాం

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు హైకోర్టులో పిటిషన్ వేసిన నియోజకవర్గాల్లోని ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌ను భద్రపర్చాం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనగామ, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలపై హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.

టి.వినయ్‌కృష్ణారెడ్డి, జనగామ జిల్లా కలెక్టర్

చిట్‌ఫండ్ బాధితులకు న్యాయం చేయాలి

పాల్, శారదా స్కామ్‌లపై లోతైన విచారణ అవసరం : ఏచూరి



ఢిల్లీ జంతర్ మంతర్ ధర్నాలో మాట్లాడుతున్న ఏచూరి

వివరాలు 2లో



భట్టి ముందే డిష్యుం డిష్యుం

వీహెచ్‌పై దాడికి యత్నం

- నగర ఓబీసీ చైర్మెన్ పదవి నుంచి నూతి శ్రీకాంత్ సస్పెన్షన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ నేతల మధ్య పాత విభేదాలు భగ్గుమన్నాయి. గాంధీభవన్‌లో కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ప్రతిపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క సమక్షంలోనే ఒకరిపై ఒకరు పిడిగుద్దులకు తెగబడ్డారు. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ బాహాబాహీకి దిగారు. కుర్చీలను విరగొట్టారు. శనివారం గాంధీభవన్‌లో ఓబీసీ చైర్మెన్ మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ ఆధ్వర్యంలో ప్రతిపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క సన్మానించారు. భట్టిని సన్మానించే క్రమంలో అంబర్‌పేట్ నియోజకవర్గానికి చెందిన నేతల మధ్య మాట మాట పెరిగి గాంధీభవన్‌లో ఉద్రికత్తకు దారితీసింది. ఏఐసీసీ సభ్యులు నూతి శ్రీకాంత్‌గౌడ్, అతని అనుచరులు భట్టిని సన్మానించేందుకు వేదికపైకి వచ్చారు. భట్టికి పూల మాల వేసే క్రమంలో వీహెచ్‌కు వేయకపోవడంతో అక్కడే ఉన్న అతని అనుచరులు వారిని పరుషపదజాలంతో దుర్భాషలాడారు. ఇరువర్గాల నేతలు బూతులు తిట్టుకున్నారు. ఈనేపథ్యంలోనే వీహెచ్ వ్యతిరేక వర్గీయులు వీహెచ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పై చేయి చేసుకునే ప్రయత్నం చేశారు. వీహెచ్ అనుచరుడు శ్రీకాంత్ ...9లో



హైదరాబాద్ గాంధీభవన్‌లో..

సీబీఐ కొత్త చీఫ్ ఆర్కేశుక్లా

ఆ పదవీకాలం రెండేండ్లు..



న్యూఢిల్లీ: సీబీఐ నూతన డైరెక్టర్‌గా రిషికుమార్ శుక్లాను ఎంపిక చేశారు. రెండేండ్లపాటు ఆయన ఆ పదవిలో ఉండనున్నారు. 1983 బ్యాచ్ ఐపీఎస్ అధికారియైన రిషికుమార్‌శుక్లాను ప్రధాని నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ ఎంపిక చేసింది. కమిటీలో సభ్యుడైన లోక్‌సభలో కాంగ్రెస్ పక్షం నేత మల్లికార్జునఖర్గే అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ శుక్లాను ఎంపిక చేశారు. ప్రధానితో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్‌గొగోయ్ కూడా ఒకరు.

ఈ పదవి కోసం 1984 బ్యాచ్‌కి చెందిన జావీద్ అహ్మద్, రజనీకాంత్‌మిశ్రా, ఎస్ఎస్ దేశ్వాల్ పేర్లు కూడా వినిపించాయి. ఈ నిర్ణయాన్ని క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదించింది. శుక్లా గతంలో మధ్యప్రదేశ్ డీజీపీగా పని చేశారు. సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్‌వర్మ, మాజీ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ ఆస్తానా మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో వారిని ఆ శాఖ నుంచి కేంద్రం బదిలీ చేసిన విషయం తెలిసిందే. కేంద్ర నిర్ణయాన్ని తప్పు పట్టిన అలోక్‌వర్మ పదవీకాలం ముగియకముందే ఉద్యోగ విరమణ ప్రకటించి నిరసన తెలిపారు. ఈ ఏడాది జనవరి 31న ...9లో

హామీలు అమలు చేసే బడ్జెట్..

సమీక్షలో సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసే దిశగా రాష్ట్ర బడ్జెట్‌కు రూపకల్పన చేయలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నతాధికారులను ఆదేశించారు. నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించాలని సూచించారు. మధ్యంతర బడ్జెట్‌పై శనివారం సీఎం ప్రగతి భవన్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఎన్నికల సందర్భంగా టీఆర్ ఎస్ తరపున ప్రజలకు పలు హామీలనిచ్చామని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. వాటన్నిం టినీ అమలు చేసేందుకు తాము నిర్ణయించామని తెలిపారు. వీటితోపాటు ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషీ, ఆర్థిక సలహాదారు జీఆర్ రెడ్డి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



(ఫైల్)



మదురో సర్కారుకే ఐక్యరాజ్య సమితి గుర్తింపు

వెనిజులా ప్రజలపై సంక్షోభప్రభావం

- మానవతాసాయానికి మేం సిద్ధం : యూఎన్ఓ ప్రధాన కార్యదర్శి

ఐక్యరాజ్య సమితి : వెనిజులా విదేశాంగ మంత్రి జార్జి అరెజా నేతృత్వంలోని వెనిజులా ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ గుర్తించారు. తనకు తాను ఏకపక్షంగా తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రకటించుకున్న ప్రతిపక్ష నేత జువాన్ గెయిడోని తిరస్కరించారు. వెనిజులాకు మానవతా సాయాన్ని పంపాలని కోరుతూ జువాన్ గెయిడో పంపిన లేఖకు గుటెరస్ స్పందించారని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ తెలిపారు. ప్రస్తుతం వెనిజులాలో నెలకొన్న ...9లో



ఎస్‌బీఐలో 2.15 కోట్లకు టోపీ

సీబీఐ విచారణతో ఆలస్యంగా వెలుగులోకి..

నవతెలంగాణ-పరకాల

వరంగల్ రూరల్ జిల్లా పరకాల పట్టణంలోని కంఠాత్మకూర్ ఎస్‌బీఐ శాఖలో మూడేండ్ల కిందట రూ.2.15 కోట్లు గోల్‌మాల్ అయినట్టు అధికారులు గుర్తించారు. సీబీఐ విచారణతో ఈ విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌బీహెచ్, ఎస్‌బీఐ విలీనానికి ముందు ముద్ర స్టాండప్ ఇండియా పేరిట రుణాలను స్వాహా చేసినట్టు సమాచారం. బోగస్ సంస్థ పేరిట రుణం మంజూరులో అప్పటి బ్రాంచ్ మేనేజర్ ...9లో

SBI

వన్నెతగ్గిన పసుపు



పంటకు మద్దతు ధర కరువు

5వేల లోపే ఊగిసలాట..

- గతేడాది అత్యధికంగా రూ.8,681
- క్వింటాకు 10వేలు వస్తేనే గిట్టుబాటు
- 'మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీం' అమలులో తాత్సారం

నవతెలంగాణ- నిజామాబాద్ ప్రతినిధి

వర్షాభావం.. అకాల వర్షాలతో ఎన్నో వ్యయ ప్రయాసలతో సాగైన పసుపు పంట చేతికొచ్చింది. కానీ, కాలం కలిసిరాక, దుంప ఊరక ఎకరాకు 20 క్వింటాళ్లు మించి దిగుబడి రాలేదు. సేద్యపు ఖర్చులు పెరిగాయి.. దిగుబడులు తగ్గాయి.. ఈ పరిస్థితుల్లో క్వింటా పసుపు రూ.10వేలు ఉంటేగానీ గిట్టుబాటు కాదు. అలాంటిది ప్రస్తుతం రూ.4వేల నుంచి రూ.5వేల మధ్యనే ధర ఊగిసలాడుతోంది. ఇదే సమయానికి గతేడాది గరిష్టంగా రూ.8,681 ధర పలికింది. ప్రస్తుతం మార్కెట్ ధరలతో రైతులకు పెట్టుబడులూ దక్కేలా లేవు. కేంద్రం అమల్జేస్తానన్న ...9లో

ఓటుకు నోటు కేసులో రేవంత్‌కు నోటీసు?

మరో ఇద్దరికీ..



నవ తెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి

ఓటుకు నోటు కేసులో రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ,మాజీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డితో పాటు మరో ఇద్దరికీ ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ అధికారులు నోటీసులను జారీ చేసినట్టు తెలిసింది. వారం రోజుల్లోగా తమ ముందు హాజరుకావాలని ఈడీ ఆదేశించినట్టు సమాచారం. రేవంత్‌రెడ్డితో పాటు అప్పటి టీడీపీ నాయకులు సెబాస్టియన్, ఉదయ్‌సింహాలకు కూడా నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. నాలుగేండ్ల క్రితం టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వేం నరేందర్‌రెడ్డి గెలుపుకోసం టీఆర్ఎస్ నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ ఓటును కోరి రూ.50 లక్షలు ఇస్తూ.. అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి ఏసీబీకి పట్టుబడ్డ విషయం ...9లో

కీచక ప్రధానోపాధ్యాయుడు

ఖమ్మం జిల్లా కూసుమంచి జెడ్పీ హైస్కూల్‌లో.. వివరాలు 9లో

సిమిపై మరో ఐదేండ్ల నిషేధం

- 'చట్టవ్యతిరేకమైనది'గా ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ: స్టూడెంట్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా(సిమి)పై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ మరో ఐదేండ్ల పాటు నిషేధాన్ని పొడిగించింది. ఈ మేరకు ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దేశంలో పలు ఉగ్రకార్యకలాపాలకు పాల్పడిన సిమిని చట్టవ్యతిరేకమైన సంస్థగా కేంద్రం ప్రకటించింది. ఆ సంస్థ చట్టవ్యతిరేక కార్యకలాపాలను తక్షణమే నియంత్రించకపోతే దేశంలో అనేక చర్యలకు అంతరాయం కలిగిస్తూ, అజ్ఞాతంలో ఉన్న కార్యకర్తలను మళ్లీ ఉగ్రకార్యకలాపాలకు పురిగొల్పుతూ దేశంలో లౌకికవాదానికి భంగం కలిగిస్తుందని పేర్కొన్నది. తన కార్యకలాపాలతో మతతత్వం ద్వారా ప్రజల మెదళ్లను సిమి సంస్థ కలుషితం చేస్తోందని తెలిపింది. అలాగే ఆ సంస్థ సభ్యులు పాల్గొన్న ఉగ్రకార్యకలాపాలకు సంబంధించిన 58 కేసులను కేంద్రం వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు గురువారం నుంచి అమలులోకి రానున్నాయి. కాగా, సిమిపై కేంద్రం విధించిన నిషేధాన్ని ట్రిబ్యునల్ ధ్రువీకరించాల్సి ఉంటుంది. సిమిపై 2014, ఫిబ్రవరి 1న అప్పటి యూపీఏ ప్రభుత్వం ఐదేండ్ల నిషేధాన్ని విధించింది. 2001లో దీనిని నిషేధ సంస్థగా ప్రకటించారు.

ప్రియాంకపై దుష్ప్రచారానికి వ్యతిరేకంగా... రాష్ట్రాల రాజధానుల్లో ఎఫ్ఐఆర్‌ల నమోదు

- మహిళా కాంగ్రెస్

న్యూఢిల్లీ: క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్న ప్రియాంక గాంధీ వాద్రాను లక్ష్యంగా చేసుకుంటూ జరుగుతున్న దుష్ప్రచారానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం సిద్ధమైంది. ప్రియాంకపై బీజేపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలకు వ్యతిరేకంగా రేపు(సోమవారం) దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానుల్లో ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేయనున్నట్టు ఆలిండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుష్మితా దేవ్ తెలిపారు. దీనికి సంబంధించి ఆమె ట్విట్టర్‌లో ఒక వీడియోను పోస్ట్ చేశారు. గత కొన్ని రోజులుగా ప్రియాంకపై బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలు తనకు బాధను కలిగించాయన్నారు. ప్రియాంకపై జరుగుతున్న దుష్ప్రచారానికి వ్యతిరేకంగా తాను ఢిల్లీలో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తానని తెలిపారు. అలాగే రాష్ట్ర అధ్యక్షులు తమతమ రాష్ట్రాల్లోని రాజధానుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని ఆమె కోరారు. ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ తూర్పు యూపీ ఇంచార్జీగా ప్రియాంక పేరు తెరపైకి రావడంతో బీజేపీ నాయకులు ఆమెపై అమర్యాదకరంగా వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది. ప్రియాంకకు అందం తప్ప రాజకీయాల్లోకి రావడానికి వేరే యోగ్యత లేదని బీజేపీ నాయకుడు వినోద్ నరైన్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపిన విషయం తెలిసిందే.

యాభైరోజులైనా దొరకని ఆచూకీ

- కార్మికుల కోసం కొనసాగుతున్న రక్షణ చర్యలు
- మేఘాలయలో ఫలించని నావీ ప్రయత్నాలు

షిల్లాంగ్: గతేడాది డిసెంబర్ 13న మేఘాలయలో తూర్పు జయంతియా జిల్లాలోని అక్రమ కోల్‌మైన్‌లో చిక్కుకున్న 15మంది కార్మికుల కోసం రక్షణచర్యలు చేపట్టి యాభై రోజులు దాటాయి. అయినప్పటికీ చెప్పుకోదగ్గ ఫలితం కనిపించడంలేదు. గనిలో చిక్కుకున్న వారి కోసం నావి, జాతీయ విపత్తు దళాలు తీవ్రంగా శ్రమిస్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితాలను సాధించ లేకపోతున్నారు. అహర్నిశలు శ్రమించి సుమారు 32వ రోజుల అనంతరం(జనవరి24న) ఓ వ్యక్తి మృత దేహాన్ని రక్షక బృందాలు వెలికితీశాయి. కాగా రెండవ మృతదేహాన్ని ఈనెల 26న వెలికితీసిన విషయం తెలిసిందే. వాటిని వెలికితీసి ఇప్పటికి వారం రోజులు గడుస్తున్నా మరో అడుగు ముందుకు వేయలేకపోయారు. అయినప్పటికీ నావి, విపత్తు రక్షణ దళాలు మిగిలిన వారి జాడ కనుగునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. దీని కోసం నీటి అంతర్భాగంలో రిమోట్ తో పనిచేసే మిషన్‌ను ఉపయోగిస్తున్నామని ఓ అధికారి తెలిపారు. ప్రతికూల వాతావరణం ఎదురైనప్పటికీ తమ ప్రయత్నాలను ఆపడం లేదని వారు వెల్లడించారు. కాగా కలుషితమైన నీటిలో వెతికే సమయంలో తాము ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ మైన్ సక్రమంగా లేకపోవడం తమకు సమస్యగా నిలుస్తోందన్నారు. రోజు కొన్ని కోట్ల లీటర్ల నీటిని బయటికి పంప్ చేస్తున్నప్పటికి లోపల ఉన్న నీటి పరిమాణం ఏమాత్రం తగ్గడం లేదని వారు వెల్లడించారు.

బీఫ్ తీసుకెళ్తున్నారన్న అనుమానంతో.. ముగ్గురు చైనీయులు సహా ఐదుగురి అరెస్ట్

ముంబయి: బీఫ్ తీసుకెళ్తున్నారన్న అనుమానంతో ముగ్గురు చైనీయులు సహా ఐదుగురిని నాగ్‌పూర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. గత నెల 18న ఈ ఐదుగురు ఖాపాలోని గుంగావ్ మైన్స్‌కు చెందిన ఒక కారులో మాంసాన్ని తీసుకెళ్తున్నారు. వారు ప్రయాణిస్తున్న కారును పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆ కారులో 10 కేజీల మాంసాన్ని పోలీసులు కనుగొన్నారు. డ్రైవర్ అఫ్రోజ్ షేక్(29), దేవేంద్ర నగ్రాలే(31) సహా ముగ్గురు చైనీయులు లీ చు చుంగ్(55), లు వెంగ్ చుంగ్(51), లు వాంగ్ కాంగ్(53)లను పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా వారి వద్ద నుంచి తగిన సమాధానం రాలేదు. దీనితో మాంసాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు అది ఆవు మాంసామా కాదా అని తెలుసుకోవడానికి పరీక్షల నిమిత్తం శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపారు. ఆ ఐదుగురిపై మహారాష్ట్ర జంతు సంరక్షణ చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ ఐదుగురిని పోలీసులు కోర్టు ముందు ప్రవేశపెట్టగా వారికి ఫిబ్రవరి 14 వరకు జ్యుడీషియల్ కస్టడీని న్యాయస్థానం విధించింది. వైద్య చికిత్సల నిమిత్తం లీ-చు-చుంగ్‌ను ఆస్పత్రిలో అడ్మిట్ చేసిన పోలీసులు మిగతవారిని నాగ్‌పూర్ కేంద్ర కారాగారానికి తరలించారు. ఆ ముగ్గురు చైనీయులు గుంగావ్‌లోని చైనా కోల్ ఇండియాలో ఉద్యోగులుగా పనిచేస్తున్నారు.

అహ్మద్ పటేల్ ఎన్నికను సవాలు చేస్తూ.. దాఖలైన పిటిషన్ కాపీ మిస్సింగ్

- దర్యాప్తునకు ఆదేశించిన హైకోర్టు

అహ్మదాబాద్: కాంగ్రెస్ నాయకుడు అహ్మద్‌పటేల్ రాజ్యసభకు ఎన్నికైన విధానాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌కు సంబంధించిన కాపీ.. కోర్టు రికార్డుల నుంచి మిస్సైంది. దీనితో గుజరాత్ హైకోర్టు.. ఈ ఘటనపై విచారణకు ఆదేశించింది. 2017 ఆగస్టులో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బల్వంత్‌సిన్హా రాజ్‌పూత్‌పై అహ్మద్ పటేల్ గెలిచారు. అయితే కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఓట్లు పొందడానికి అహ్మద్ పటేల్ వారికి లంచం ఎర చూపాడన్నది రాజ్‌పూత్ ఆరోపణ. ఈ విషయంలో ఆయన గుజరాత్ హైకోర్టులో పిటిషన్ వేశారు. అయితే హైకోర్టు జస్టిస్ బేల త్రివేది ముందు రాజ్‌పూత్ క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తున్న సమయంలో పిటిషన్ మిస్ అయినట్టు వెలుగులోకి వచ్చింది. దీనితో ఈ ఘటనపై దర్యాప్తు జరపాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ హెచ్‌డీ సుతార్‌ను త్రివేది ఆదేశించారు. నివేదికను ఫిబ్రవరి 8లోగా సీల్డు కవర్‌లో సమర్పించాలని తెలిపారు. అలాగే రాజ్‌పూత్ క్రాస్ ఎగ్జామినేషన్‌ను కూడా ఆ రోజు వరకు న్యాయస్థానం నిలిపేసింది.

ఏడేండ్ల బాలిక కిడ్నాప్.. సామూహిక లైంగికదాడి

- హర్యానాలో ఘటన
- రైల్వే స్టేషన్ సమీపంలో రక్తపుమడుగులో మైనరు

రోహ్‌తక్ : హర్యానాలోని రోహ్‌తక్‌లో ఏడేండ్ల బాలికను కిడ్నాప్ చేసి రైల్వే స్టేషన్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్ళి దుర్మార్గానికి ఒడిగ ట్టారు ముగ్గురు దుర్మార్గులు. కూతురు కనిపించకపోవడంతో వెతకడం ప్రారంభించిన తండ్రి రైల్వే వాషింగ్ లైన్ సమీపంలో తీవ్ర రక్తస్రావంతో అచే తన స్థితిలో పడివున్న బాలికను గుర్తించి తమకు సమాచారం ఇచ్చారని పోలీ సులు తెలిపారు. గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకున్నట్టు చెప్పారు. ఘటన గురించి రైల్వే పోలీసులకు సమాచారం అందించి బాలికను స్థానిక పీజీఐఎంఎస్ ఆస్పత్రికి తరలించామన్నారు. బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్టు పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటుచేసినట్టు తెలిపారు.

చిట్‌ఫండ్ బాధితులకు న్యాయం చేయాలి

పాల్, శారదా స్కాంలపై లోతైన విచారణ అవసరం : సీతారాం ఏచూరి



నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని చిట్‌ఫండ్ బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి డిమాండ్ చేశారు. పాల్, శారదా చిట్‌ఫండ్ స్కామ్‌లకు సంబంధించిన వ్యక్తులపై కఠినంగా విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు పలు సామాజిక, ప్రజాస్వామ్య సంఘాలు, రాజకీయ పార్టీలు సంయుక్తంగా తలపెట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా శనివారం చిట్‌ఫండ్ స్కాంలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రదర్శిస్తున్న అలసత్వాన్ని నిరసిస్తూ జంతర్‌మంతర్ వద్ద చిట్‌ఫండ్ బాధితులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి సీతారాం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చిట్‌ఫండ్‌ల పేరుతో సామాన్య ప్రజానీకాన్ని మోసం చేసిన సంస్థలు, కంపెనీల ఆస్తులను జప్తు చేయాలని భారత సర్వోన్నత న్యాయం ఇదివరకే ఆదేశించినట్టు గుర్తించారు. ఆ విధంగా జప్తు చేసిన కంపెనీల ఆస్తులతో చిట్‌ఫండ్ బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఈ విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నట్టు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల అలసత్వాల కారణంగా వేలాది సామాన్య కుటుంబాలు రోడ్డుమీద పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా 600 మందికి పైగా చిట్‌ఫండ్ బాధితులు ఆత్మహత్యకు పాల్పడినట్టు వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి చిట్‌ఫండ్ బాధితులను ఆదుకోవాలని అన్నారు. చట్టాల్లో ఉన్న లొసుగులతో దోపిడీదారులు తప్పించుకుంటున్నారని ఆరోపించారు. చట్టబద్ధంగా ఎగవేతదారులు దోపిడీ చేస్తున్నారని అన్నారు. ఇటువంటి దారుణాలను ప్రభుత్వం చూస్తూ ఊరుకోవడంపై ఏచూరి తీవ్రంగా ఆక్షేపణ వ్యక్తం చేశారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే ఎగవేతదారులను నిలువరించేందుకు చట్టం మరింత కఠినతరం చేయాలని సూచించారు. అప్పుడే బాధితులకు నిజమైన న్యాయం చేయవచ్చని అన్నారు. నకిలీ పేర్లతో కంపెనీలు రిజిస్టర్ చేసుకొని ఇటువంటి మోసాలకు పాల్పడుతున్నారని గుర్తు చేశారు. పాల్, శారదా కుంభకోణాలు దేశ చిట్‌ఫండ్ స్కాంలలో అతి పెద్దవని అభివర్ణించారు. వ్యవసాయ కూలీలు, రైతులు, సామాన్య ప్రజానీకం అందులో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారని వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆయా వర్గాల నుంచి డబ్బులు స్వీకరించారని తెలిపారు. 18 సంవత్సరాల పాటు సేకరించిన నిధులను రియల్ ఎస్టేట్‌లో పెట్టి కష్ట జీవుల పొట్టగొట్టారని అన్నారు. ఆలిండియా కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా మాట్లాడుతూ... చిట్‌ఫండ్ కేసులపై ప్రభుత్వాల చర్యలు అనుమానాస్పదంగా ఉంటున్నాయని చెప్పారు. కేంద్రంలో ఏర్పడిన ప్రభుత్వాలు ఢిల్లీలో తమ ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు చిట్‌ఫండ్ బాధితులకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. అందుకే చిట్‌ఫండ్ స్కాంలపై వేగంగా విచారణ చేపట్టలేకపోతున్నాయని తెలిపారు. శారదా స్కాంపై మోడీ సర్కారు అధికారంలో వచ్చిన వెంటనే విచారణ వేగవంతం చేయాల్సి ఉండేదని చెప్పారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న మమత, మోడీ సర్కారుకు వ్యతిరేకంగా తాము దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నట్టు చెప్పారు. జై జవాన్... జై కిసాన్... జై సంవిధాన్ నినాదం పేరుతో తాము పోరాడుతున్నామని వివరించారు. సామాజిక కార్యకర్త జిగ్నేశ్ మేవానీ మాట్లాడుతూ... చిట్‌ఫండ్ బాధితులకు తాము అండగా ఉంటామన్నారు. బాధితులకు న్యాయం జరిగేంతవరకు పోరాడుతామన్నారు. ఈ విషయంపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని దేశ ప్రజానీకం ముందు ఎండగడుతామని వివరించారు. ఈ ధర్నాలో చిట్‌ఫండ్ బాధిత సంఘాలు, దళిత ఉద్యమ నేతలు విక్రమ్ సింగ్, మహిళా సంఘం నాయకురాలు పుణ్యవతి, రిటైర్డ్ మేజర్ సాబ్బీర్ సింగ్, ఎంపీ సంతోష్ రాయ్, దినోష్ అబ్రోయ్, రామ్ నివాస్ యాదవ్, ఆర్‌డీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు (ఫిబ్రవరి 3) పౌర సమాజం కార్యకర్తల నిరసన

ఉన్నత చదువుకు అడిగింది 4200 కోట్లు.. బడ్జెట్‌లో కేటాయింపుల 2100 కోట్లు

- 10శాతం కోటా అమలుకు అరకొర నిధులు

న్యూఢిల్లీ : పార్లమెంట్ సమావేశాల్లో అగ్రవర్ణ పేదలకు 10శాతం కోటా కోసం మోడీ సర్కారు చేసిన హడావుడి.. ఆ రిజర్వేషన్ అమలుకు నిధులు కేటాయించడంలో మాత్రం చేయడం లేదని తెలుస్తున్నది. కేంద్ర విద్యాసంస్థల్లో ఈబీసీలకు 10శాతం రిజర్వేషన్‌ను ప్రకటించిన రోజుల వ్యవధిలోనే ఇందుకు సంబంధించి తాత్కాలిక బడ్జెట్‌లో రూ. 2100 కోట్లను కేటాయించింది. అయితే కేంద్ర విద్యాసంస్థల్లో ఈ కోటాను అమలు చేయాలంటే రూ. 4200 కోట్లు అవసరమవుతాయని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ(హెచ్‌ఆర్డీ) కోరినట్టు సమాచారం. అంటే హెచ్‌ఆర్డీ కోరిన మొత్తానికి బడ్జెట్‌లో కేటాయించింది సగం మేరకేనని తెలుస్తున్నది. కేంద్ర విద్యాసంస్థల్లో ఈ కోటాను అమలు చేసేందుకు అదనంగా 25శాతం లేదా సుమారు రెండు లక్షల సీట్లు అదనంగా పెంచాల్సి ఉంది. ప్రస్తుతం ఈ విద్యాసంస్థల్లో 16.8లక్షల సీట్లకు ప్రవేశాలు జరుగుతుండగా ఈబీసీలకు 10శాతం రిజర్వేషన్ అమలు చేయనుండటంతో అదనంగా 2.32లక్షల సీట్లు పెంచాల్సి ఉంది. దీనికోసం సుమారు రూ. 4200 కోట్ల అదనపు నిధులను హెచ్‌ఆర్డీ కోరింది. దేశవ్యాప్తంగా అన్ని ఉన్నత విద్యాసంస్థల్లో సీట్ల పెంపు, అందుకు కావాల్సిన అదనపు నిధులను బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం గమనార్హం. 2019-2020 విద్యా సంవత్సరంలో జూలై నుంచి అన్ని విద్యాసంస్థల్లో ఈ కోటాను అమలులోకి తీసుకొ చ్చేందుకు హెచ్‌ఆర్డీ సన్నద్ధమవుతోంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వాలతోనూ సంప్రదింపులు జరిపింది. ప్రస్తుతం మొత్తం 84లక్షల సీట్లుండగా ఈ కోటా అమలుకు అద నంగా 21లక్షల సీట్లను పెంచాల్సి ఉండగా, ఇందుకు రూ. 20, 981 కోట్లు అవసరమున్నట్టు హెచ్‌ఆర్డీ అంచనా వేసింది. ఈ పెంపుతో కేంద్రంతోపాటు రాష్ట్రాలు ఈ భారాన్ని మోయాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని విద్యాసంస్థల్లోని మొత్తం 67లక్షల సీట్లకు అద నంగా 18.6లక్షల సీట్లు చేర్చాల్సి ఉంటుంది. దీని కోసం అవసరమయ్యే రూ. 16,781కోట్ల నిధులు రాష్ట్రాలే భరించాలని హెచ్‌ఆర్డీ సూచించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి.

ప్రమాణస్వీకారాలు అడ్డగింత

పలుచోట్ల ఓడిన అభ్యర్థుల నిరసన

- బీక్యాతండాలో ఆత్మహత్యాయత్నం



నవతెలంగాణ- ముస్తాబాద్/ కోదాడరూరల్/ బెజ్జూరు

గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసి నాలుగు రోజులైనా, తమకు అన్యాయం జరిగిందని ఓడిన అభ్యర్థులు చేస్తున్న నిరసనలు ఆగడం లేదు. శనివారం అన్ని గ్రామ పాలకవర్గాల ప్రమాణస్వీకారం జరగాల్సి ఉండగా నిరసనల నేపథ్యంలో రెండు గ్రామపంచాయతీల్లో నిలిచిపోయాయి. రాజన్న సిరిసిల్లా జిల్లా ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ అభ్యర్థి అర గుండు, అర మీసంతో రోడ్డుపై బైటాయించారు. సూర్యాపేట జిల్లా కోదాడరూరల్ మండలం బీక్యాతండాలో టీఆర్ఎస్ అభ్యర్థి ఒంటిపై కిరోసిన్ పోసుకున్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలం కుకుడ పాలకవర్గం నిరసనల మధ్య ప్రమాణస్వీకారం జరిగింది.

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రమాణస్వీకారం ఓడిన సర్పంచ్ అభ్యర్థుల అడ్డగింతతో నిలిచిపోయింది. ఓడిన సర్పంచ్ అభ్యర్థి రంజాన్ రాధా మద్దతుదారులు, ఓడిన సర్పంచ్ అభ్యర్థులు ప్రమాణస్వీకారానికి నిరసనగా ముస్తాబాద్ బంద్‌కు పిలుపునిచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోలేదు. సిరిసిల్ల డీఎస్పీ వెంకటరమణతోపాటు సీఐలు, ఎస్ఐలు, స్పెషల్ పోలీస్ బెటాలియన్ అక్కడి చేరుకుని పంచాయతీ కార్యాలయం వద్ద బందోబస్తు నిర్వహించారు. ప్రమాణస్వీకారానికి నిరసనగా కాంగ్రెస్ నాయకుడు ఉపేందర్ అరగుండు, అరమీసంతో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట బైటాయించి నిరసన తెలిపాడు. సాయంత్రం వరకూ సర్పంచ్‌గా గెలిచిన గాండ్ల సుమతి ప్రమాణస్వీకారానికి రాలేదు. అయినప్పటికీ ఓడిన సర్పంచ్ అభ్యర్థులు, మద్ధతుదారులు రోడ్డుపైనే బైటాయించి నిరసన వ్యక్తం చేశారు.

సూర్యాపేట జిల్లా కోదాడరూరల్ మండలం బీక్యాతండాలో మొదటి విడత ఎన్నికలు నిర్వహించగా కాంగ్రెస్ అభ్యర్థి అంబేద్కర్‌కు, టీఆర్ఎస్ అభ్యర్థి గుగులోతు లక్ష్మీకి సమానంగా (476 ఓట్లు) ఓట్లు వచ్చాయి. దీంతో అధికారులు టాస్ వేస్తే ఫలితం కాంగ్రెస్‌కు అనుకూలంగా వచ్చింది. అయితే కాంగ్రెస్ అభ్యర్థితో అధికారులు ప్రమాణస్వీకారం చేయిస్తుండగా టీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మి తన భర్తతో కలిసి పంచాయతీ కార్యాలయానికి చేరుకొని ఒంటిపై కిరోసిన్ పోసుకుంది. ప్రమాణ స్వీకారం జరిగితే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించింది. దీంతో అధికారులు కార్యక్రమాన్ని వాయిదా వేశారు.

కుకుడలో నిరసనల మధ్య..

బెజ్జూరు మండలం కుకుడలో సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణస్వీకారం నిరసనల మధ్య కొనసాగింది. ఎన్నిక నిబంధనల మేరకు జరగలేదంటూ మూడు రోజుల క్రితం ప్రత్యర్థి వర్గం సభ్యులు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు ఫిర్యాదు చేశారు. శనివారం ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు గ్రామ కార్యదర్శి బాబూరావు పంచాయతీ కార్యాలయానికి రాగా అప్పటికే నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ ఆయనపై దాడికిదిగారు. చికిత్స నిమిత్తం ఆయనను పోలీసులు బెజ్జూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లారు. కౌటాల సీఐ మోహన్, బెజ్జూరు ఎస్ఐ రాజేశ్వర్ అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం బెజ్జూరు ఎంపీడీఓ తోటాజీ సర్పంచ్, వార్డు సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించడంతో గొడవ సద్దుమణిగింది.

విద్యార్థులకు పరిశీలన, జిజ్ఞాస అవసరం

ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ యూబీ దేశాయ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యార్థి జీవితంలో కుతుహలాన్ని, జిజ్ఞాసను వీడరాదని.. పరిశీలనాతత్వాన్ని అలవర్చుకోవాలని ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ యుబి దేశాయ్ అన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక జిజ్ఞాస రాష్ట్ర స్థాయి పోటీల ఆవిష్కరణకు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశాయ్ మాట్లాడుతూ విద్యారంగంలో విద్యార్థి బోధనలో స్టడీ ప్రాజెక్టు విధానం ఎంతో ముఖ్య పాత్ర పోషిస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు తరగతి గది వెలుపల విద్య నేర్చుకోవడానికి అవకాశమిచ్చే విధానం అందుబాటులోకి రావాలని చెప్పారు. ఏ రంగంలోనైనా నూతన ఆవిష్కరణకు పరిశీలన, జిజ్ఞాస ఎంతో అవసరమని సూచించారు. ఉన్నత విద్యాశాఖ మూడేండ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వందల మంది విద్యార్థులకు ప్రేరణనందిస్తున్నదని కొనియాడారు. ఎఫ్ గ్రేడ్ ఎన్ఐఎన్ శాస్త్రవేత్త డాక్టర్ దినేష్ భరద్వాజ మాట్లాడుతూ తాను నిజామాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినని, నేడు ఇలాంటి కార్యక్రమానికి హాజరుకావడం గొప్ప అనుభూతినిస్తున్నదని చెప్పారు. హైదరాబాద్‌లో అత్యుత్తమ పరిశోధనా కేంద్రాలున్నాయని, డిగ్రీ కళాశాలల విద్యార్థులు కోర్సు చేస్తున్న సమయంలోనే తమకు అనువైన పరిశోధక ప్రాజెక్టుల్లో పనిచేయడానికి ప్రయత్నించాలన్నారు. పరిశోధన వివిధ విషయాల్లో వేర్వేరుగాక సైన్సును, సామాజిక శాస్త్రాలను అనుసంధానం చేసినప్పుడు జనానికి ఉపయోగపడే మరింత మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. సభాధ్యక్షులు, కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ మాట్లాడుతూ డిగ్రీ స్థాయిలో నాణ్యమైన విద్యనందించే క్రమంలో భాగంగా తమ శాఖ జిజ్ఞాస కార్యక్రమాన్ని చేపట్టిందని గుర్తుచేశారు. దీనికి విద్యార్థుల నుంచి, అధ్యాపకుల నుంచి అపూర్వమైన స్పందన వస్తున్నదని తెలిపారు. స్టడీ ప్రాజెక్టులో పనిచేసిన సమయం విద్యార్థి జీవితంలో చాలా ముఖ్యమైనది. అది వారి భావి ప్రయత్నాలకు ప్రేరణగా నిలిస్తుందని చెప్పారు. రూసా నిధులను విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాల అభివృద్ధికి ఖర్చు చేస్తున్నామని అన్నారు. రూసా-2 నిధుల్లో ఎక్కువ భాగం విశ్వవిద్యాలయాలకు కేటాయిస్తారని, అందులో భాగంగా కాకతీయ విశ్వవిద్యాలయంలో పరిశోధన - ఆవిష్కరణ ఏర్పాటు కోసం రూ.50 కోట్లు కేటాయింపు జరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పి.బాలభాస్కర్, జిజ్ఞాస సమన్వయ కర్త డాక్టర్ నాన్సీ సెరెనా తదితరులు పాల్గొన్నారు.

ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కు రూ.80వేల లంచం

- ఏసీబీకి చిక్కిన టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్



నవతెలంగాణ- మల్కాజిగిరి

జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు రూ.80 వేలు లంచం తీసుకుంటూ శనివారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ యాప్రాల్ పరిధిలోని స్వర్ణధామ కాలనీలో ప్రదీప్ అనే వ్యక్తి తన 200 గజాల స్థలంలో మున్సిపాలిటీ అనుమతితో ఇల్లు నిర్మించుకున్నాడు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం మల్కాజ్‌గిరి సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ విషయంపై టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌ను సంప్రదించాడు. ఆయన తన అసిస్టెంట్ యోగేశ్వర్‌కు అప్పగించాడు. అయితే, 'నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నిర్మాణం జరిగింది. సర్టిఫికెట్ కావాలంటే రూ.లక్ష చెల్లించాలి' అని శ్రీనివాస్ తన అసిస్టెంట్ యోగేశ్వర్ ద్వారా డిమాండ్ చేయించాడు. ఈ క్రమంలో బాధితుడు ప్రదీప్ జనవరి 29వ తేదీన ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఏసీబీ అధికారుల సలహా మేరకు ప్రదీప్ రూ.80 వేలు ఇస్తానని అధికారికి ఒప్పుకున్నాడు. శనివారం శ్రీనివాస్‌కు డబ్బులు అందజేస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. డబ్బులు స్వాధీనం చేసుకుని, శ్రీనివాస్‌ను విచారణ నిమిత్తం రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ ఉన్నారు.

బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య



నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

బీసీలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. అన్ని రంగాల్లో జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం జంతర్ మంతర్ వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాలు అడగకున్నా 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చిందని వెల్లడించారు. బీసీ కమిషన్‌కు జాతీయ హోదా కల్పించాలని 40 ఏండ్ల నుంచి పోరాడుతున్నా పట్టించుకోవడం లేదని తీవ్రంగా విమర్శించారు. కానీ అగ్రకులాలకు రిజర్వేషన్ బిల్లు మాత్రం హడావిడిగా రెండు రోజుల్లో ఆమోదించుకున్నారని కృష్ణయ్య మండిపడ్డారు. దేశంలోని అందరికీ జనాభా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో 14 శాతం, ఉద్యోగాల్లో 9 శాతం, వ్యాపార, వాణిజ్య రంగాల్లో ఒక శాతం మాత్రమే బీసీలకు ప్రాతినిధ్యం ఉందని తెలిపారు. బీసీలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కావాలని డిమాండ్ చేశారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని, స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లు గడిచినా బీసీలకు తమ వాటా దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

'భూమి' బెంగతో గుండెపోటు

- నిద్రలోనే గౌరవెల్లి నిర్వాసితుని మృతి
- పట్టాపాసుబుక్కు, రైతుబంధు ఇవ్వని అధికారులు

నవతెలంగాణ- హుస్నాబాద్ టౌన్

గౌరవెల్లి ప్రాజెక్టులో భూమి కోల్పోతున్న తనకు పరిహారం రాదేమోననే బెంగతో మనోవేదనకు గురైన రైతు గుండెపోటుతో మృతిచెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్న పేట మండలం గుడాటిపల్లిలో జరిగింది. సర్పంచి బద్దం రాజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బద్దం మల్లారెడ్డి(58) తన పదకొండెకరాల్లో అప్పు చేసి మూడు బావులు తవ్వుకున్నాడు. గౌరవెల్లి ప్రాజెక్టులో మొత్తం భూమి, ఇల్లు పోతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీతో అప్పులు తీరే పరిస్థితి లేదు. ఇద్దరు కొడుకుల పోషణకు భరోసా లేకుండా పోయింది. తనకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలనీ, అప్పటి దాకా భూమి ఇచ్చేదిలేదనీ అధికారులకు తెగేసి చెప్పాడు. ప్రభుత్వం ఆ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వడం లేదు. ఏ విషయమూ తేల్చడంలేదు. భూమి పోతుందనే ఆవేదన, పరిహారం వస్తుందో రాదోనని తెలియక మల్లారెడ్డి మనోవేదన చెందాడు. దీనికి తోడు ఆయనకు కొత్త పట్టాదారు పాస్‌బుక్కు రాలేదు. రైతుబంధు పథకం కింద వచ్చే పెట్టుబడి సాయం ఇవ్వలేదు. అధికారుల చుట్టూ తిరిగినా పట్టాదారు పాస్ బుక్కులివ్వలేదు. దీంతో మల్లారెడ్డి మరింత కుంగిపోయాడు. శుక్రవారం గౌరవెల్లికి చెందిన నిర్వాసిత రైతులు ప్రాజెక్టు పనులను అడ్డుకున్న విషయం తెలుసుకుని ఇక సర్కార్ డబ్బులు ఇవ్వదేమోనని కుమిలిపోయాడు. స్థానికులతో విషయం చెప్పి బాధపడ్డాడు. శుక్రవారం రాత్రి నిద్రలోనే కన్నుమూశాడు. పరిహారం పంపిణీలో జాప్యమే మల్లారెడ్డి ప్రాణం తీసిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.


సంపాదకీయం

ఆచరణ

శ్రీతాకాలం చివరిలో చిక్కని ప్రభాతవేళ.. మంచుతెరల్ని చీల్చుకుంటూ తూరుపు రేఖలు నేలను ముద్దాడుతుంటే, పచ్చని చెట్టుమీద ఓ పక్షి గీతాలాపన. అబ్బ.. ఆ గాత్రం వింటుంటే మనస్సు ఉల్లాసంగా చిందులు వేసివేసి అంతటితో ఆగక రెక్కలు తెచ్చుకుని ఆకాశంలో రివ్వున ఎగరాలనిపించింది. 'అహ.. ఇప్పుడు కాదులే.. నడిరేయి నక్షత్రాలలో ఒకటిగా చేరిపోవచ్చు..! అమ్మో.. అంతపని చేయొద్దు. కిందపడిపోతే ఎలా?! పోనీ, అలా కాసేపు తోటలోకి వెళితేనో..!' ఆ పూలపరిమళం. చిత్రమైన రంగులు, మృదుమధుర సంగతులు చెపుతాయి. 'మెరిసే మేఘమాలికా ఉరుములు చేసి చాలిక.. చెలితో ఊసులాడనీ..' అని మనసు బాసలు వినిపిస్తాయి. మనం కనిపించగానే తెల్లని చల్లని పూబాలలు ముసిముసిగా వికసిస్తాయి. చూసేవారి మనసూ అంతే.. సరిసమానంగా ఆనందం విరబూస్తుంది. సరిగ్గా అప్పుడే నీలిరంగు మేలిముసుగులో ఓ సుందరి అటుగా వెళుతున్నట్లు చిత్రమైన భావన. ఎంతచూసినా మళ్లీ కనిపించదు. అస్సలు అగుపించదు. ఎందుకంటే అది ఒక ఆలాపన..! ఆ కాంతి తెరల వెనుక దృశ్యాదృశ్యంగా ఉన్న ఇంతటి బ్రహ్మానందాన్ని.. ఆ గాఢమైనఅనుభూతినీ ఏకాంతంగా పొందటం ఎంత అబ్బురమో కదా! అంతలోనే నిరాశా మేఘాలు ఆవరించాయి. లోలోన మనసంతా చీకటి. ఒక్కసారిగా ఆకాశంలో నక్షత్రాలు కనిపించలేదు. బాబోయ్.. మనిషికి ఇంత స్వార్థం పనికిరాదు. హృదయం గాయపడింది. విరబూసే ప్రకృతి ఏ ఒక్కరి సొంతం కాదు.. అందరిదీ.. ఇది ఒక విచిత్రమైన విజ్ఞాపన.

'గుండెనిండా నీటిలోకి దిగబడినప్పుడు అర్థమవుతుంది. ఆ నీటి లోతెంతో..' హృదయమెంతగానో తపిస్తేనే కదా కన్నీటి విలువ తెలిసేది. ఆలాపనా.. ఆజ్ఞాపనా.. అనిపిస్తే అనిపించనీ.. వాస్తవాల ఆస్కారంతో అడుగులు వేయడమే మన పని. శ్రీశ్రీ చెప్పినట్టు.. 'ఎవరో మేలు చేస్తారని ఎదురుచూసి మోసపోకుమా..! నిజం మరిచి నిదురపోకుమా..!'

గాలి హోరులో అలలు అలలుగా.. ఎవరిదో పిలుపు. తలుపు తీయగానే ఉషస్సు..! లేలేత కిరణాలతో సులివెచ్చని కాంతి.. ఆ కాంతితో సర్రున వెళ్లడమా? కొద్దిసేపు ఆ కిరణ సుమాలతో దోబూచులాడి అల్లిబిల్లి కబుర్లతో కాలక్షేపం చేయటమా? మనసులో మరో ఆశల హరివిల్లు. ప్రకృతితో మనిషి మమేకమైతే అంతేమరి..! జీవితమంటే స్వచ్ఛమైన సరస్సు వంటిది. నిశ్చలంగా ఉన్న ఆ తటాకంలో నీరసం ఆవహిస్తుంది. అలాంటి సరస్సుకు నీరు తేటగా కనిపించదు. తీయదనం అస్సలే ఉండదు. ఆ చెరువులోని జల పుష్పాలు కూడా ఆరోగ్యంగా ఉండవు. కానీ అదే చెరువులోని నీరు



అలలెత్తి ఆ గట్టును ఈ గట్టును తాకుతుంటే నీటిలోని చేపపిల్లలు దుముకుడే దుముకుడు. చైతన్యం చెకచెకా.. లోకమంతా నిండుపున్నమి జాబిలిలా పరిమళిస్తుంది. మానవ సంబంధాలూ వారి నడుమ అనుబంధాలు కూడా అలా తీరున వికసిస్తాయి. వికసించాలి కూడాను!! నిర్మలమైన ప్రేమకోసం మనుషులం గనుక పరితపిస్తుంటాం! ఇది సహజ గుణం.

కాలం పరిభ్రమిస్తూ ఉంటుంది. ఆలోచనలూ అంతే. ఎదిగే మొక్క కొత్తచివుళ్లు తొడిగినట్టు ఆలోచనలు చిగురిస్తూనే ఉంటాయి. 'చిగురులు వేసిన కలలన్నీ మమతల తీరం చేరాలి..!' అన్నట్టు అవెప్పుడూ వెలుగు దిశలో ప్రసరిస్తూనే ఉంటాయి. ఆ ఆలోచనలకు సరైన ఆచరణ అనుసరణ ఉంటే అది చక్కని సద్వృక్షమే.. ఆ చిత్రం తెల్లని వెండిమబ్బుల ఆహ్లాదంగా కనిపిస్తుంది. అప్పుడే వికసించిన వెన్నెలపువ్వంగా అది విరాజిల్లుతుంది. అందుకే జీవన పురోగమనానికి ఆచరణ కీలకం. ఆలాపన అంటే మనసులోని ఊహ విభావరి. ఈ ఊహలు ఎన్ని ఎత్తులకైనా ఎంతెంతటి లోతులనైనా అలవోకగా అందుకోగలవు. నిజానికి మనిషి తాను కలలు కన్నట్టే జీవించటానికి మించిన సాహసం మరొకటి ఉండదు. అందుకే సరైన ఆలోచనలు రూపొందటానికి కూడా ఆచరణే అవసరం. ఆచరణ లేని ఆలోచన కాగితం పువ్వులాంటిది. అందుకని అన్నిటికీ ఆచరణే గీటురాయి. ఆలాపన ఓ అందమైన ఊహాజగత్తు మాత్రమే..

నిజ జీవితంలో పట్టిందల్లా బంగారం కావాలనుకుంటాం. మనం అనుకున్నట్టే ఆ పని అయిపోవాలని భావిస్తాం. ఒక్కపట్టాన పాతను వదులుకోలేం. కొత్తను తొందరగా స్వీకరించలేం. ఇంకా ఇంకా ఏదో ఏదో కావాలని ఆరాటం. అదేమిటో తెలుసుకునే ప్రయత్నం చేయం. తగిన శ్రమ చేయం. ఊహించినట్టు ఆచరణలో జరగనప్పుడు అసంతృప్తే మిగులుతుంది. అది పెరిగిపోయి గుండె భగ్గున మండిపోతుంది. పర్యవసానం ఆవేదన. ఈ ఆందోళనలో సాధ్యాసాధ్యాలను ఆలోచించం. వాస్తవాన్ని జీర్ణించుకోలేం. అంటే గట్టుమీద నిలబడి 'ఇలా చేస్తే బాగుంటుంది. అలా చేసి ఉంటే బాగుండేది..' అని భావిస్తుంటాం. కానీ, 'గుండెనిండా నీటిలోకి దిగబడినప్పుడు అర్థమవుతుంది. ఆ నీటి లోతెంతో..' హృదయమెంతగానో తపిస్తేనే కదా కన్నీటి విలువ తెలిసేది. ఆలాపనా.. ఆజ్ఞాపనా.. అనిపిస్తే అనిపించనీ.. వాస్తవాల ఆస్కారంతో అడుగులు వేయడమే మన పని. శ్రీశ్రీ చెప్పినట్టు.. 'ఎవరో మేలు చేస్తారని ఎదురుచూసి మోసపోకుమా..! నిజం మరిచి నిదురపోకుమా..!'

పాలకవర్గ పార్టీలు.. ప్రత్యామ్నాయ రాజకీయాలు



కోప్ర

దేశంలో ఎన్నికల రాజకీయాలు ఊపందుకున్నాయి. ఓటర్లను ఆకర్షించేందుకు ఏ అవకాశాన్నీ వొదులుకోని పాలక పార్టీలు అన్ని వైపులనుంచీ కమ్ముకొస్తున్నాయి. 'సంక్షేమం-సెంటిమెంట్' కేంద్రంగా దేశ రాజకీయాలు కొత్తపుంతలు తొక్కుతున్నాయి. నాలుగేండ్ల నరేంద్ర మోడీ పాలన తమ పుట్టి ముంచబోతున్నదని గ్రహించిన సంఘ్ అధినాయకత్వం నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించింది. ఇటీవల ఎన్నికలు జరిగిన రాష్ట్రాలలో బీజేపీ చేదు అనుభవాలను చవిచూడాల్సి రావడంతో మోడీ ఛరిష్మా పార్లమెంటు ఎన్నికలలో తమను గట్టెక్కించలేదని నిర్ధారించుకుని, ఇప్పటివరకూ మోడీ చర్యలను ప్రశ్నించేందుకు సాహసించని కమలనాథులు ఒక్కొక్కరే నోరువిప్పడం మొదలెట్టారు. అవసరమైతే మోడీకి ప్రత్యామ్నాయంగా గడ్కరీని సిద్ధం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇంతలో, దేశంలో హంగ్ పార్లమెంట్ తప్పదంటూ ప్రతిష్టాత్మక సంస్థల సర్వేలు వెలువడటంతో సంఘ్ పరివారంలో దిక్కుతోచని స్థితి ఏర్పడింది. ఇటు మోడీ-షా ద్వయం కూడా తక్షణం మేలుకోకుంటే కొంపలంటుకుపోతాయని కలవరపడి 'అగ్రకుల పేదలకు పది శాతం రిజర్వేషన్లు' అన్న బ్రహ్మాస్త్రాన్ని బయటకు తీశారు. హుటాహుటిన పార్లమెంటు ఉభయసభల్లో బిల్లు పాసయ్యేలా చర్యలు తీసుకుని ఊపిరిపీల్చుకున్నారు. ఇందుకు విరుగుడుగా కాంగ్రెస్ అధినేత రాహుల్ బీసీలకు జనాభా నిష్పత్తికి అనుగుణంగా 52శాతం రిజర్వేషన్ అన్న పాశుపతాస్త్రాన్ని బయటకు తీశారు. దీంతో కంగుతినడం కమలనాథుల వంతయ్యింది.

> **ఒక్క వామపక్షాలు మాత్రమే ప్రత్యామ్నాయ రాజకీయ, ఆర్థిక విధానాలను అందించగలవన్నది సత్యం. అయితే, దేశంలో వామపక్షాల స్థితి ఇప్పుడు బలహీనంగా ఉంది. ఈ పరిస్థితి మారకుండా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలకు పరిష్కారం సాధ్యం కాదు. ఈ పరిస్థితి మారాలంటే ఉద్యమాలలోనే కాకుండా ఓట్ల విషయంలోనూ ప్రజలు వామపక్షాలను అనుసరించాలి. ఉద్యమాలలో తమను అనుసరిస్తున్న ప్రజలు ఓట్ల విషయంలో మాత్రం ఎందుకు ఆదరించడంలేదో వామపక్షాలు కూడా ఆలోచించాలి. ఆత్మపరిశీలన చేసుకోవాలి.**

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ భారత రాజకీయాలలో రిజర్వేషన్లు కీలకాంశంగా ఉన్నాయి. ప్రతి కులమూ తమ కుల రిజర్వేషన్లకు సంబంధించిన ఏదోఒక అంశాన్ని ముందుకుతెచ్చి, ఆ డిమాండ్ సాధనకు వీధులకెక్కుతుండటంతో రిజర్వేషన్ల విషయాన్ని మినహాయించి రాజకీయాలు నడపడం ఏ రాజకీయ పార్టీకైనా అసాధ్యంగా మారింది. దీంతో పాలక పార్టీలు ఆయా కులాలను రిజర్వేషన్ తాయిలాలు చూపి తమకు అనుకూలంగా మలచుకుని ఎన్నికల విజయానికి వాటిని ఒక బలమైన సాధనంగా ఉపయోగించుకుంటున్నాయి. కోట్లాది మంది ప్రజలలో అత్యంత సునాయాసంగా భావోద్వేగాలను రేకెత్తించి, సామాజికంగా సమీకరించి, రాజకీయంగా సంఘటిత పరచగల శక్తి కలిగిన రిజర్వేషన్ల అంశాన్ని ఇప్పటి వరకూ ప్రతి పాలకవర్గ పార్టీ తన రాజకీయ ప్రయోజనానికి వాడుకుంటూనే ఉంది. ఇకపై కూడా వాడుకునేందుకు పదిలంగా కాపాడుకుంటూ వస్తోంది. అలాగే, కులానికి సంబంధించిన రిజర్వేషన్లలాగే మరో భావోద్వేగ అంశమైన మతాన్ని ముందుకు తెచ్చేందుకు ప్రయత్నం జరుగుతున్నది. కమలనాథులు మళ్లీ రామజన్మభూమిని సొమ్ముచేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయోధ్యలో వివాదాస్పదం కాని భూమిని సొంత యజమానులకు అప్పగించేందుకు అనుమతించాలని కేంద్రం సుప్రీం కోర్టును కోరడం ఇందులో భాగమే. మరోవైపు ఆర్డినెన్స్ జారీచేసయినా సరే.. "రామజన్మ భూమి" సమస్యను కోర్టు పరిధి నుంచి తప్పించి కేంద్రమే పరిష్కరించాలని సంఘ్ పరివారం వత్తిడి తెస్తున్నది. రామజన్మభూమికి శబరిమల అంశం కూడా తోడయ్యింది. అయితే, కేరళలో శబరిమల అంశాన్ని రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనం పొందాలన్న సంఘ్‌పరివార్ కుట్రలను కమ్యూనిస్టులు సమర్థవంతంగా తిప్పికొట్టగలిగారు. మరోవైపు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ అధినేత రాహుల్ బీజేపీ హార్డ్ హిందూత్వను ఎదుర్కొనేందుకు సాఫ్ట్ హిందూత్వతో చెలరేగిపోతున్నారు. ఆలయ ప్రదర్శనలు, బాబాల దర్శనాలు, గంగాస్నానాలు, శబరిమలపై సుప్రీం కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా సంప్రదాయవాదులకు కొమ్ముకాయడం, తననుతాను బ్రాహ్మణుడిగా, శివభక్తునిగా ప్రచారం చేసుకోవడం.. సకల మార్గాలలో, సకల విధాలా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మరోవైపు ప్రజల ఆర్థిక సమస్యలు అధికమై, అసంతృప్తి పెరుగుతున్నది. ఈ పరిస్థితుల్లో కేవలం భావోద్వేగాలతోనే పబ్బంగడుపుకోవాలనుకోవడం అత్యాశే కాగలదు. అయినా, రాజకీయ పార్టీలు ఒకదానికొకటి పోటీపడుతూ భావోద్వేగ అంశాలను సొమ్ముచేసుకునేందుకు ఎంతకైనా తెగిస్తున్నాయి. ఇకపై కుల-మతాలను మాత్రమే వాడుకుంటూ ఎన్నికల విజయాలను సాధించడం ఏ రాకీయ పార్టీకైనా అసాధ్యమైన పరిస్థితులు క్రమేపీ నెలకొంటున్నాయి. అయినా తమ వర్గ ప్రయోజనాలకు తూట్లు పొడిచే ఆర్థిక అంశాలు అజెండా మీదకు రాకుండా అన్ని పాలక పార్టీలూ జాగ్రత్త పడుతున్నాయి. నిజానికి కులం-మతం వంటి భావోద్వేగ అంశాలకన్నా ఆర్థిక అంశాలకే అధికశాతం ప్రజలు ప్రాధాన్యమిస్తారు. అయితే, ప్రజల ఆర్థిక పరమైన ఆకాంక్షలకు, ఆందోళనలకు తమ గుప్పిటిలోని మీడియాలో అతి తక్కువ ప్రాధాన్యతనిచ్చి తొక్కిపెట్టడం, అప్పటికీ చల్లారకుంటే బలప్రయోగం ద్వారా అణచివేయడం, మరో వైపునుండి వాటి ప్రాధాన్యతను మరుగు పరుస్తూ భావోద్వేడ అంశాల ప్రచారాన్ని హోరెత్తించడం ద్వారా ప్రజల దృష్టిని మరల్చేందుకు పడరానిపాట్లు పడుతున్నారు.

నిజానికి ఇప్పుడు ప్రజలు ఒక గట్టున ఉంటే, పాలకులు మరో గట్టున ఉన్నారు. దేశ ప్రజలలో మెజారిటీలైన రైతులు, కార్మికులు, ఉద్యోగులు దినదినం తమను దహించి వేస్తోన్న ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం కోట్లాదిగా ఉద్యమబాట పడుతున్నారు. ఎర్రటి ఎండలు, ఎముకలు కొరికే చలిగాలులను సైతం లెక్కచేయకుండా డొక్కలెండిన రైతాంగం లక్షలాదిగా కదలబారి దేశ వ్యాప్తంగా చేపట్టిన పాదయాత్రలు, దేశ రాజధాని ఢిల్లీలో పాలకులు సిగ్గుపడేలా రోజుల తరబడి తమిళనాడు రైతులు సాగించిన వినూత్న నిరసన ప్రదర్శనలు, ఇరవై కోట్ల మంది ఉద్యోగ, కార్మికుల సార్వత్రిక సమ్మె, కనీవినీ ఎరుగని రీతిలో రక్షణ శాఖ సిబ్బంది మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మె దేశ ప్రజల చూపెటువైపో చాటి చెబుతున్నాయి. ఒక వైపు దేశమంతా కుల-మత భావోద్వేగాలలో కొట్టుకుపోతున్నదన్న ప్రచార హోరు సాగుతుండగా, మరోవైపు ఈ పాలకవర్గాల కుట్రలను బద్దలు కొడుతూ బద్ధలవుదతున్న ఆర్థిక కేంద్ర ఉద్యమాలు దేశంలో అసలైన ప్రత్యామ్నాయ రాజకీయాలకు బాటలు వేస్తున్నాయి. ఈ ఉద్యమాలకు వామపక్ష భావజాల సంస్థలూ వ్యక్తులు, శక్తులు, సారథ్యం వహిస్తుండడం, ఆర్థిక ఉద్యమాల ప్రాంగణం నుంచి కుల-మత భావోద్వేగాలను రెచ్చగొట్టే వ్యక్తులు, శక్తులు, సంస్థలూ క్రమంగా వైదొలగుతుండడం యాదృచ్ఛికం కాదు. వారివారి భావజాలమే వారి కార్యక్షేత్రమేమిటో తేల్చేస్తూ ఉంది. ఈ నేపథ్యంలో పాలక పార్టీలన్నీ ఇప్పుడు సంక్షేమం ముసుగులో ఆర్థిక అంశాలను ముందెన్నడూ లేనంతగా నెత్తికెత్తుకుంటున్నాయి. ప్రజల జీవితాలలో మౌలిక మార్పు తేగల అతికీలకమైన ఆర్థిక అంశాలను సంక్షేమ పరిధికి కుదించి తమ తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలకోసం అర్రులు చాస్తున్నాయి. సంక్షేమ పథకాల గురించీ, రైతుల సమస్యల పరిష్కారాల గురించీ, రైతు రుణమాఫీ గురించీ మోడీ ప్రభుత్వం కొత్తగా మాట్లాడడం ఇందుకోసమే. 'ఆకలి, పేదరికం దేశంలో ఉండకూడదు. భారత్‌లో నివసించే ప్రతి పేద పౌరుడికీ కనీస ఆదాయం ఉండాలి' అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ప్రకటించిన 'సార్వత్రిక కనీస ఆదాయ పథకం(యూబీఐ)' ఇందుకు పరాకాష్ఠ. ప్రజలు తమ మౌలిక సమస్యల పరిష్కారానికి ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, తాత్కాలిక ఉపశమనం కలిగించే సంక్షేమ పథకాలపట్ల ఆకర్షితులుకాక తప్పని స్థితి. ఎన్నికల యుద్ధంలో తలపడుతోన్న ప్రధాన రాజకీయ పక్షాలన్నీ ఎన్నికల ఎజెండాలను సంక్షేమ పథకాలతో నింపేసి, మౌలిక పరిష్కారాల ఊసెత్తకపోవడం కూడా ప్రజలను సంక్షేమ పథకాల ఆధారంగా ఎవరో ఒకరిని ఎన్నుకోక తప్పని స్థితిలోకి నెట్టివేస్తున్నాయి.



ఒక్క వామపక్షాలు మాత్రమే ప్రత్యామ్నాయ రాజకీయ, ఆర్థిక విధానాలను అందించగలవన్నది సత్యం. అయితే, దేశంలో వామపక్షాల స్థితి ఇప్పుడు బలహీనంగా ఉంది. ఈ పరిస్థితి మారకుండా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలకు పరిష్కారం సాధ్యం కాదు. ఈ పరిస్థితి మారాలంటే ఉద్యమాలలోనే కాకుండా ఓట్ల విషయంలోనూ ప్రజలు వామపక్షాలను అనుసరించాలి. ఉద్యమాలలో తమను అనుసరిస్తున్న ప్రజలు ఓట్ల విషయంలో మాత్రం ఎందుకు ఆదరించడంలేదో వామపక్షాలు కూడా ఆలోచించాలి. ఆత్మపరిశీలన చేసుకోవాలి. కోల్పోతున్న తమ పునాదిని తిరిగి పటిష్టం చేసుకోవడంపై దృష్టి కేంద్రీకరించాలి. రెండు దశాబ్దాల క్రితం వరకూ ఎన్ని రాజకీయ దాడులు ఎదురైనా చెక్కుచెరని వామపక్ష ప్రజా పునాది ఇప్పుడెందుకు బీటలు వారుతోంది? పాలకవర్గ పార్టీలతో పొత్తుల ద్వారా వచ్చే సీట్లు వామపక్షాల పునాదిని కాపాడలేవని తేలిపోయింది. తమ స్వంత ప్రజా పునాదిని బలోపేతం చేసుకోవడమే కాక, ఎన్నికల రంగంలో ప్రజలు తమను ఆదరించేందుకు తగిన కార్యాచరణను రూపొందించుకోవాలి.

సెల్: 6301289321



డాక్టర్ సోమేశ్వర్ బోనకుర్తి

ఆరు నెలల జీతాలు అర్ధాకలి బతుకులు

ఈ ప్రపంచంలో 12 నెలలు పనిచేసి కేవలం ఆరు నెలలు మాత్రమే జీతం తీసుకుని అనుక్షణం అభద్రతలో బతికేది యూనివర్సిటీలో పనిచేస్తున్న పార్ట్‌టైం టీచర్స్ మాత్రమే అనిపిస్తోంది. ఒకవైపు ప్రపంచమంతా "సమాన పనికి సమాన వేతనం" కోసం పోరాటం చేస్తుంటే తెలంగాణ రాష్ట్రంలోని పార్ట్ టైం టీచర్స్ మాత్రం కనీస వేతనం కోసమే పోరాటాలు చేయాల్సిన పరిస్థితిలో ఉండడం శోచనీయం.

హైదరాబాద్ నగరంలో ఉస్మానియా యూనివర్శిటీని ఈ దేశంలో ఐదవ యూనివర్శిటీగా స్థాపించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఉస్మానియా యూనివర్శిటీ (1917-2017) ఇటీవలే శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంది. వందేమాతర ఉద్యమం నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు అన్యాయాన్ని ప్రతిఘటించే పెక్కు ఉద్యమాలకు వేదికయ్యింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. సుసంపన్నమైన సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, మేధో వారసత్వ సంపదను దేశ విదేశాలకు అందించగలిగింది. అలాంటి యూనివర్శిటీలో వరుసగా ప్రొఫెసర్లు పదవీ విరమణ చేస్తుండడం, భర్తీలు లేకపోవడం కారణంగా ఉన్న టీచింగ్ పోస్టుల స్థానంలో విద్యార్థులకు బోధించేందుకు పార్ట్ టైం టీచర్స్‌ను నియమిస్తూ వచ్చారు.

ఆ తర్వాత పార్ట్ టైం అని చెప్పి పూర్తి స్థాయిలో పని తీసుకోలేమని, ఫుల్ వర్క్‌లోడ్ (అంటే వారానికి 16 క్లాసుల బోధన) ఉన్న వారిని అకాడమిక్ కన్సల్‌టెంట్‌గా మార్చి 10 నెలలు జీతాలు ఇచ్చారు. గత 22 ఏండ్లుగా జరిగిన మార్పులలో అకాడమిక్ కన్సల్‌టెంట్‌గా ఉన్న వారిని అసిస్టెంట్ ప్రొఫెసర్-సి (కాంట్రాక్టు అధ్యాపకులు)గా మార్చి, 11 నెలలు, తర్వాత 11 నెలల 24 రోజులు, ప్రస్తుతం 12 నెలలుగా జీతాలు ఇస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే పార్ట్‌టైం లెక్చరర్స్‌కు ఫుల్ వర్క్‌లోడ్ రాగానే వారిని అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్ట్స్‌గా మార్చే విధానం కొనసాగేది. దీనితోపాటు కొత్తగా కాంట్రాక్టు, పార్టుటైం లెక్చరర్స్ నియామకం జరుగుతుండేది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ విధానంతో యూనివర్శిటీలో ప్రభుత్వ అనుమతి లేకుండా నియామకాలు నిర్వహించారని ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు జారీ చేసింది. 2014 జూన్ రెండో తేదీ తరువాత కాంట్రాక్టు అసిస్టెంటు ప్రొఫెసర్లు, కాంట్రాక్టు ఉద్యోగుల నియామకం చెల్లదని ఆదేశించింది. ఇక ముందు కూడా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు అధ్యాపకులు, కాంట్రాక్టు ఉద్యోగులను అవసరమున్నప్పుడు ప్రభుత్వ అనుమతితో తీసుకోవాలని ఒక లెటరు ద్వారా తెలియజేశారు. దీనితో ఓయూలో వివిధ డిపార్టుమెంట్లలో నియమితులైన 36మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 150మంది కాంట్రాక్టు ఉద్యోగుల నియామకాలను యూనివర్శిటీ అధికారులు రద్దు చేశారు. అధ్యాపకుల అవసరం తప్పనిసరిగా ఉండడంతో పార్ట్‌టైం లెక్చరర్స్‌ను మాత్రమే తీసుకుంటున్నారు. అవసరం ఉన్నా, అర్హతలున్నా, ఆయా డిపార్టుమెంట్‌లలో వర్క్‌లోడ్ ఉన్నా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అప్‌గ్రేడ్ చేయడం 2014-15 విద్యా సంవత్సరం నుంచి చేపట్టడం లేదు.

సుదీర్ఘ ఘన చరిత్ర కలిగి శతాబ్ది ఉత్సవాలను పూర్తి చేసుకున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం, వందేమాతర ఉద్యమం నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకూ అన్యాయాన్ని ప్రతిఘటించే పెక్కు ఉద్యమాలకు వేదికై, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయాలలో 300మంది పార్ట్‌టైం టీచర్స్, కాకతీయ విశ్వవిద్యాలయంలో 250మంది మిగతా యూనివర్శిటీలన్నిటిలో అన్ని కలిపి మరో 100మంది ఆరు నెలల జీతాలతో అర్ధాకలితో బతుకులు వెళ్లదీస్తున్నారు.


1991 నుంచి యూనివర్శిటీల యందు పదవీ విరమణ చేస్తున్న ప్రొఫెసర్ల ఖాళీలో నూతన అధ్యాపకుల కొరకు నోటిఫికేషన్స్‌ను జారీ చేయకుండా అడహక్, పార్ట్‌టైమ్ టీచర్స్‌ను నియమించుకుంటూ ఒక రెగ్యులర్ ప్రొఫెసర్‌కు ఒక నెలకు ఇస్తున్న వేతనాన్ని పార్ట్‌టైం టీచర్‌కు ఒక ఏడాది మొత్తానికి (వేతనంలా) ఇస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. యూనివర్శిటీలలో టీచర్‌గా నియమించబడాలంటే ఉండాల్సిన పీజీలో 55శాతం మార్కులు కలిగి ఉండి డాక్టరేట్ పట్టా (పీహెచ్‌డీ) ఉండి, అదనంగా యూజీసీ, ఎన్ఈటీ, జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్‌లు, ఎస్ఈటీ పరీక్షలలో క్వాలీఫై అయి ఉండి కూడా ఆరు నెలల జీతాలతో వెట్టిచాకిరి చేస్తున్నారు పార్ట్ టైం టీచర్స్.

అంతేకాక యూజీసీ నిబంధనల ప్రకారం రెగ్యులర్ ప్రొఫెసర్ వారానికి 12గంటలు బోధన చేయాలి. రెగ్యులర్ అసోసియేట్ ప్రొఫెసర్ వారానికి 14గంటలు, రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ వారానికి 16గంటలు బోధించాలి. వారితో సమానంగా పార్ట్‌టైమ్ టీచర్లు వారానికి 16గంటలు విధులు నిర్వహిస్తూ, క్వశ్చన్ పేపర్ తయారీలో, ఇన్విజిలేషన్ డ్యూటీలో, స్పాట్ వాల్యుయేషన్ డ్యూటీలో, ఎగ్జామ్ జరుగుతున్నప్పుడు అబ్జర్వర్, స్క్వాడ్ డ్యూటీలలో రెగ్యులర్ టీచర్లతో పాటు సమానంగా, పి.జి. అడ్మిషన్ కౌన్సిలింగ్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆఫీసర్స్‌గా, హాస్టల్ వార్డెన్స్‌గా జాతీయ - అంతర్జాతీయ సదస్సులకు కో- ఆర్డినేటర్స్, కో-కన్వీనర్‌లుగా, ఆర్గనైజింగ్ కమిటీ మెంబర్‌లుగా సేవలను అందిస్తూ యూనివర్శిటీ విద్యా ప్రమాణాలను పెంచే క్రమంలో భాగస్వాములు అవుతున్నారు. అయినా అనుక్షణం జీవన్మరణ పోరాటాలు చేస్తున్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో పోరాడిన వారు ఈ రోజు రోడ్డున పడే పరిస్థితి ఎదురైంది. తెలంగాణ వచ్చిన తర్వాత రెండేండ్లు వైస్ ఛాన్సలర్‌లు లేరని దాటవేసిన అధికారులు, వైస్ ఛాన్సలర్‌లు వచ్చి 30నెలలు పూర్తయినాకూడా వీరిని పట్టించుకోవడం లేదు. ఈ విషయంలో ఉన్నత విద్యాశాఖ, ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ చూపాలి.

యూనివర్శిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల స్థానంలోనే పార్ట్‌టైమ్ అధ్యాపకులు పనిచేస్తున్నారు. వర్క్‌లోడ్ ఉన్న డిపార్టుమెంట్లలో పార్ట్‌టైం లెక్చరర్స్‌ను కాంట్రాక్టు అసిస్టెంటు ప్రొఫెసర్స్‌గా నియమించాలి. అప్పుడే కనీసం ఏడాది పొడువున వేతనంతో బతికే పరిస్థితి ఉంటుంది. లేకపోతే ఇదే వెట్టిచాకిరి కొనసాగాల్సిన పరిస్థితి ఉంటుంది.

సెల్: 9293762428

ఓం తిట్ల పురాణ పురుషాయ నమః



తెలిదేవర భానుమూర్తి

నారదుడు కొప్పేసుకుండు. మొకానికి పోడర్ బూస్కుండు. బొట్టు బెట్టుకుండు. తంబూర దీస్కుండు. ఒకపారి టింగ్ టింగ్ మన్నడు. చిర్తలు దీస్కుండు. ఒకపారి గవ్విటిని కొట్టి జూస్కుండు. యాడ్కి బోవాలె. యాడికి బోతె బాగుంటదని జెరసేపు సోంచాయించిండు. యాడికో ఎందుకు ఎప్పటి తీర్గ యాద్గిరి గుట్టకు బోతె బాగుంటది. నర్సిమ్మసామితోని ముచ్చట బెడ్తె తెలంగానల ఏమైతున్నదో ఎర్కైతది అని అనుకున్నడు. అనుకోని మొగులు మీదికెల్లి ఎల్లిండు. గాయిన యాద్గిరి గుట్ట దిక్కు రాబట్టిండు.

నడిరాత్రి. అందరు పండుకున్నరు. యాడ సప్పుడు లేదు. నారదుడు యాద్గిరి గుట్ట మీద దిగిండు. గుల్లెకు బోయిండు.

"నారాయన, నారాయన" అని అన్నడు.

నర్సిమ్మసామి నిద్రలేసిండు. ఎదురుంగ నిలబడ్డ నారదుడు గాయినకు గండ్ల బడ్డడు.

"యాదగిరేంద్రా నమో నమః"

"ఏం నారదా! శానొద్దులకు వొచ్చినవు"

"మీ దగ్గరకు వొస్తుంటె నడ్మల యమునిదున్నపోతు గలుస్తున్నది. తెలంగానల ఏమైతున్నదో జెప్పున్నది"


"ఇయ్యాల గల్వలేదా?"

"లేదు సామీ"

"తెలంగానల ఏమైతున్నదో జెప్పాలె. గంతేనా" అని నర్సిమ్మసామి అడిగిండు.

"గంతే సామీ!"

"తెలంగానల గీ నడ్మనే పంచాయతి ఎలచ్చన్లు అయినయి. గీ ఎలచ్చన్ల సర్పంచి కుర్సికి పోటీ జేసినోలల్ల కొందరు కోటి; రొండు కోట్ల రూపాలు కర్సు జేసింద్రు. ఊరోల్లకు దావత్లు ఇచ్చింద్రు. మందు సీసలు బంచింద్రు. ఓటుకు ఐదు వేల రూపాల కాడి నుంచి పదివేల రూపాల దాంక ఇచ్చింద్రు. కొందరు ఇంటికి మాంసం బంచితె కొందరు ఇంటికొక కోడి ఇచ్చింద్రు. వార్డు మెంబర్లుగ పోటి జేసినోల్లు గూడ ఎన్కకు బోలేదు. గాల్లు గుడ్క ఓటుకు ఐదునూర్ల రూపాల కాన్నుంచి పదిహేను నూర్ల దాంక ఇచ్చింద్రు. మేమేం తక్వదిన్నమా అని మందు సీసలు బంచింద్రు. మాకే ఓటేయుమని ఒక్క తీర్గ జెప్పింద్రు. సూర్యాపేట జిల్లల జాజిరెడ్డి గూడెం అనే ఒక ఊరు ఉన్నది. గా ఊరి పంచాయతి ఎలచ్చన్ల హైమవతి అనే ఆమె వార్డు మెంబర్గ పోటి జేసింది. గామె గుర్తు జగ్గు. గామె మొగడు ప్రబాకర్. ఇంతకు ముందు గాయిన కాంగ్రెస్ల ఉండెటోడు. ఎదురుదిర్గె బట్కె గా పార్టి గాయినను సస్పెండ్ జేసింది. ఇగ దాంతోని గాయిన పెండ్లాం హైమవతిని వార్డు మెంబర్ కుర్సికి ఇండిపెండెంట్‌గ నిలబెట్టిండు. నిలబెట్టుడే గాకుంట గాయినే ప్రచారం జేసిండు. పిలాస్టిక్ జగ్గుల కోటర్ మందు సీస బెట్టిండు. మందు సీసలు బెట్టిన జగ్గులను వార్డుల తలా ఒకటి బంచిండు. పెండ్లాం నామినేషన్ ఏసిన కాన్నుంచి పోలింగ్ దాంక గిసువంటి జగ్గులు బంచి జగ్గు గుర్తుకే ఓటు ఎయ్యిమన్నడు. కోటర్ మందు సీసలు ఉంచిన పిలాస్టిక్ జగ్గులే గాకుంట వార్డుల తలా ఎన్మిది నూర్ల రూపాల బంచిండు. గింత జేసినా పంచాయతి ఎలచ్చన్ల గాయిన పెండ్లాం ఓడిపోయింది. వార్డుల మొత్తం 229 ఓట్లు ఉంటె గాయిన పెండ్లాంకు 24 ఓట్లే వొచ్చినయి. ఇగ దాంతోని గాయిన చటాకు బియ్యం దీస్కుండు. గా బియ్యంకు పస్పు గల్పిండు. గవ్విటిని దీస్కుండు. వార్డుల ఇల్లిల్లు దిరుక్కుంట 'గివి మంత్రం బియ్యం' నా పెండ్లాంకే ఓటు ఏస్తె ఏసినమని గీ మంత్రం బియ్యం మీద ఒట్టేసి జెప్పుండ్రి. ఓటు ఎయ్యకుంటె నేను ఇచ్చిన ఎన్మిది నూర్లు వాపస్ ఇయ్యుండ్రి. అని అన్నడు. మంత్రం బియ్యం అనంగనే బుగులు బడి గాయిన పెండ్లాంకు ఓటు ఎయ్యనోల్లు తలా ఎన్మిది నూర్ల రూపాలను గాయినకు వాపస్ ఇచ్చింద్రు. అసెంబ్లి ఎలచ్చన్ల మేము బంచిన రూపాలను గిదే తీర్గ జెనం వాపస్ ఇస్తె మంచి గుండు గదా అని ఓడిపోయినోల్లు అనుకోబట్టింద్రు. ఇగ గెల్సిన ఎమ్మెల్యేలు మంత్రి కుర్సిల కోసం కోషిస్ జెయ్యబట్టింద్రు. పంచాయతి ఎలచ్చన్ల అర్వై శాతం మంది టిఆర్ఎస్ మదద్ ఇచ్చినోల్లు సర్పంచిలుగ గెల్సింద్రు. అపొజిసన్ పార్టిలు మదద్ ఇచ్చినోల్లే గాకుంట ఇండిపెండెంట్లు సర్పంచి కుర్సికి పోటి జేసినోల్లు నల్భై శాతం మంది గెల్సింద్రు. గాల్లందరిని టిఆర్ఎస్లకు గుంజెతందుక్కు ఆ పార్టి ఎమ్మెల్యేలు ఒక్క తీర్గ కోసిస్ జేస్తున్నరు" అన్కుంట నర్సిమ్మ సామి ఆవలిచ్చిండు.



"అపొజిసన్ ఎమ్మెల్యేలను టిఆర్ఎస్లకు గుంజెతందుకు ఆ పార్టి లీడర్లు కోషిస్ జేస్తున్నరు. ఇగ సర్పంచిలను గూడ ఆ పార్టిలకు గుంజుడెందుకు?" అని నారదుడు అడిగిండు.

"లోక్‌సబ ఎలచ్చన్లు దగ్గర్ల ఉన్నయి. తెలంగానల మొత్త పదిహేడు ఎంపి సీట్లు ఉన్నయి. గవ్విట్ల ఎట్లన్న జేసి పదారు సీట్లు గెలుస్తమని కెసిఆర్ అన్నడు. పదారు ఎంపి సీట్లు గెల్సి సెంటర్ల గిర్ర దిప్పుతమని గాయిన జెప్పిండు. ఒక్క ఓటు గూడ అపొజిసనోల్లకు బడకుంట జేసెతందుకే సర్పంచిలను గూడ టిఆర్ఎస్లకు గుంజాలని జూస్తున్నరు. నన్ను టిఆర్ఎస్లకు దుంకుమని గా పార్టి లీడర్లు ఒక్క తీర్గ బత్మిలాడుతున్నరు అని యాదాద్రి జిల్ల కెల్లి గెల్సిన ఒక ఇంటిపెండెంట్ సర్పంచి జెప్పిండు. టిఆర్ఎస్ సర్కారొచ్చి యాబై దినాలైంది. సర్కార్ల ముక్యమంత్రి హోం మంత్రి దప్పిడ్సి కడ్మ మంత్రులెవ్వరు లేరు. మంచి మూర్తం లేదని కెసిఆర్ మంత్రి కుర్సిలను ఎక్వ జెయ్యలేదు. దగ్గర్ల బెహత్రీన్ మూర్తమున్నదని అంటున్నరు. ఎక్వమంది సర్పంచిలను పార్టిలకు గుంజితె మంత్రి కుర్సి దొరుకతదని ఒక ఎమ్మెల్యె అనుకున్నడు. అనుకోని ఒక సర్పంచి తాన్కి బోయిండు. మా అయ్యగని గులాబి కండ్వ ఏస్కో అన్కుంట గడ్డం బట్టుకోని బత్మిలాడిండు. మోటర్ ఎక్కితె మస్తు ఫండ్స్ ఇప్పిస్తనని జెప్పిండు. మంత్రినైతె ఏం గావాలంటె గది ఇస్తనని అన్నడు. మంత్రి కుర్సి కోసం ఒక ఎమ్మెల్యే గుడి గట్టిచ్చిండు. గా గుల్లె పాల రాయితోని జేసిన కెసిఆర్ బొమ్మ బెట్టిచ్చిండు. గా గుడి మీద గులాబి జెండ ఎగిరేసిండు. దినాం కెసిఆర్ బొమ్మకు పాలతోని అబిసేకం జేసి గులాబి పూలు; బుక్క గులాలతోని పూజ జెయ్యబట్టిండు. శ్రీ చంద్రశేఖర్ విబోతవ సుప్రబాతం అన్కుంట పొద్దుగాల్నే లేసి సుప్రబాతం సద్వబట్టిండు. 'చంద్రశేఖర; చంద్రశేఖర చంద్రశేఖర రక్షమాం; చంద్రశేఖర; చంద్రశేఖర చంద్రశేఖర పాహిమాం; మంత్రి కుర్సి దేహిమాం' అని పాడ బట్టిండు. 'ఓం చంద్రశేఖరాయ నమః ఓం రైతు బంధువాయ నమః, ఓం కల్వకుంట్ల వంశోద్ధరణాయ నమః, ఓం తిట్ల పురాణ పురుషాయ నమః అన్కుంట కెసిఆర్ నామావళి సద్వబట్టిండు. ఒక ఎమ్మెల్యే పదవీ ప్రాప్త యాగం జేసిండు. మంత్రి కుర్సి కోసం గన్పతి లెక్క కెటిఆర్ సుట్టు చక్కర్లు గొట్టబట్టిండు. గీ తీర్గ మంత్రి కుర్సి కోసం ఎమ్మెల్యేలు ఒక్క తీర్గ తన్లాడ బట్టింద్రు." అని నర్సిమ సామి ఇంకేమొ జెప్పబోతుంటె నారదుడు అడ్డం దల్గి -

"మంత్రి కుర్సి లేకుంట జెనంకు సేవ జెయ్యరాదా?" అని అడిగిండు.

"ఎన్కటికి ఒక ఎమ్మెల్యే ఉండెటోడు. గాయిన పార్లు గెల్సిండు. ఎప్పుడు గాయిన గెల్సిన పార్టిలకు దుంకెటోడు ఏమన్న అడిగితె జెనంకు సేవ జేసెతందుకుని అనెటోడు. ఎన్ని పార్లు ఎన్ని తీర్ల కోషిస్ జేసినా గాయిన మంత్రి గాలేదు. మంత్రి గాలేదన్న ఫికర్‌తోని గాయిన సచ్చిపోయిండు. గాయిన పీన్గను పాడె మీద ఉంచి బొందల గడ్డ దిక్కు దీస్కుబోబట్టింద్రు. దింపుడు కల్లెం వొస్తె పాడె దించింద్రు. నువ్వు మంత్రి వైనవు అని ఒకడు పీన్గ చెవుల జెప్పిండు. జెప్పంగనే గా ఎమ్మెల్యే పీన్గ లేసి గూసున్నది" అని నర్సిమ్మ సామి అన్నడు. ఇంతల తెల్లారింది. సుప్రబాతం షురువైంది. నారదుడు మాయమై వైకుంటం దిక్కు బోయిండు.

సెల్: 9959150491


పోషకాహారంతోనే..

వెంట్రుకలు చర్మంలోని డెర్మిస్ అనే పొరలో పుడతాయి. వెంట్రుక మొత్తం కెరటిన్ అనే ప్రోటీన్‌ని కలిగి ఉంటుంది. వెంట్రుకల్లో ఉండే మెలనిన్ వల్ల... రంగు నిర్ణయమవుతుంది. మెలనిన్ ఎక్కువగా ఉంటే వెంట్రుకలు నల్లగా వుంటాయి , తక్కువగా వుంటే గోధుమ రంగులోనూ, తెల్లగానూ అవుతాయి. వయసు పెరిగే కొద్దీ మెలనిన్ ఉత్పత్తి ఆగిపోతుంది. వెంట్రుక కుదురు ముఖ్యమైనది. ఈ కుదుళ్ల ఆరోగ్యంగా బాగుంటే రాలిపోయిన వెంట్రుక స్థానంలో కొత్త వెంట్రుకలొస్తాయి.

రోజుకి సుమారు 30-40వెంట్రుకలు రాలిపోతూ ఉంటాయి. వందకంటే ఎక్కువ రాలిపోతే ఎక్కువ జుట్టు ఊడిపోతున్నట్టు లెక్క. వయసు పెరిగే కొద్దీ జుట్టు రాలడం ఎక్కువవుతుంది. మానసికమైన, శారీరకమైన ఒత్తిడి జుట్టు రాలిపోవడానికి ప్రధాన కారణంగా వైద్యులు చెబుతున్నారు. హార్మోన్ల అసమతౌల్యం జుట్టు ఎదుగుదల మీదా, అవాంఛిత రోమాలు ఏర్పడటంలోనూ, జుట్టు రాలిపోవడంలోనూ చాలా ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా ఆండ్రోజన్స్ అనే హార్మోన్స్ జుట్టు ఎదుగుదల మీద బాగా ప్రభావం చూపుతాయి. పి.సి.ఓ.డి. అనే వ్యాధిలో ఆండ్రోజన్స్ ఎక్కువవడం వలన ఆడవారిలో అవాంఛిత రోమాలు ఏర్పడి శారీరకంగా మానసికంగా ఇబ్బందిని కలిగిస్తాయి. ఇవేకాక థైరాయిడ్ హార్మోన్ ఎక్కువయినా, తక్కువయినా జుట్టు ఊడిపోతుంది. కొన్ని రకాల జ్వరాల వల్ల జుట్టు రాలిపోతుంది. వైరల్, బాక్టీరియల్, ఫంగల్ ఇన్ఫెక్షన్ల వల్ల జుట్టు విపరీతంగా ఊడుతుంది. అతివేడీ, అతి చల్లదనం జుట్టుకి పనికి రావు. జుట్టుని మాటి మాటికీ బ్లో డ్రయింగ్ చేయించడం కూడా జుట్టు కోల్పోడానికి కారణమవుతుంది. జుట్టుకి వేసే వివిధ రకాల రంగులకి చెందిన రసాయనాలు, షాంపూలూ, తలమీద వుండే చర్మాన్ని నాశనం చేయడంతో పాటు, జుట్టు రాలిపోవడానికి కారణమవుతాయి.

ఆ జుట్టు బలంగా ఉండాలంటే.. రోజూ మనం తినే ఆహారాన్ని కాస్త మెరుగు పరుచుకుంటే చాలని చెబుతున్నారు. అలాగే, ఆరోగ్యమైన కురుల కోసం వివిధ రకాల పోషకాలు కావాలి.

అందుకోసం మాంసకృత్తులు, పళ్లు, కూరగాయలు, బీన్స్, తృణధాన్యాలు మీ ఆహారంలో ఉండేట్లు చూసుకోవాలి. మరీ ముఖ్యంగా ఐరన్ సమృద్ధిగా ఉండే.. లివర్, డ్రైఫ్రూట్స్, మొలకెత్తిన శెనగలు, సోయా, పనీర్ లాంటివి తినాలని డాక్టర్లు చెబుతున్నారు.



ఇట్లా చేద్దాం

క్యారెట్ గుజ్జును తీసి దానికి చెంచా తులసి పొడి కలపాలి. తరువాత పాలు కలిపి పేస్ట్‌లా చేసి ఈ మిశ్రమాన్ని రోజు ఉదయాన్నే ముఖానికి రాసుకుంటే ముఖంపై ఉండే మచ్చలు మడతలు తగ్గి, చర్మం యవ్వనంగా మారుతుంది.



కొందరు దూరం నుంచే ఆరాధించబడతారు. కొన్ని తరాలు అలా ఆరాధించిన నటీమణి సుచిత్రాసేన్. ఆమెను ఇండియా'స్ గ్రెటాగార్బో అంటుంటారు. కానీ... అంతకు మించిన వ్యక్తి. ఆమెకు ఆమే సాటి. తెలివిలో, వ్యవహరించే తీరులో, ఫ్యాషన్‌లో.. తన తరం కంటే ముందున్నది. సుచిత్ర... హీరోయిన్‌కాదు.. హీరో. బచ్చన్‌లు, ఖాన్‌ల కంటే ముందే.. హిందీ సినిమాను సింగిల్‌హ్యాండ్‌తో, తన భుజస్కందాలపై మోసిన.. హీరో! అలాంటి భావోద్వేగాలను పలికించగలిగే నటి... బెంగాల్‌లో మళ్లీ పుట్టలేదంటే అతిశయోక్తి కాదేమో. డిగ్నిటీకి నిజమైన డెఫనేషన్. అంతర్జాతీయ చిత్రోత్సవంలో అవార్డు అందుకున్న తొలి భారతీయ నటి.

క్వీన్ ఆఫ్ ఇండియన్ సినిమా

సుచిత్రాసేన్ అసలు పేరు రమాదాస్ గుప్తా. 1931 ఏప్రిల్ 6న బెంగాల్‌లోని పబ్నా (ఇప్పుడు బంగ్లాదేశ్‌లో ఉంది) గ్రామంలో ఆమె జన్మించారు. తండ్రి కరుణామరు దాస్‌గుప్తా స్థానిక పాఠశాలలో హెడ్మాస్టర్‌గా పనిచేసేవారు. తల్లి ఇందిరా దేవి సాధారణ గ హిణి. వారి అయిదో సంతానం సుచిత్ర. స్థానిక స్కూల్లోనే చదువుకుంది. 1947లో విభజన తరువాత వాళ్ల కుటుంబం బెంగాల్‌కు వచ్చింది. అదే సంవత్సరం ఆమెకు బెంగాలీ ధనిక పారిశ్రామికవేత్త అదినాథ్ కుమారుడైన దీపానాథ్ సేన్‌తో వివాహం జరిగింది.



పెండ్లయిన కొన్నాళ్లకే... సుచిత్రలోని నటనా కౌశలాన్ని గుర్తించిన దీపానాథ్... ఆమె సినిమాల వైపు ప్రోత్సహించాడు. డైరెక్టర్ బిమల్‌రాయ్ చెల్లెలు... అదినాథ్ మొదటి భార్య. సుచిత్రను బిమల్‌రాయ్‌కు పరిచయం చేశాడు. రాయ్, ఆమెను.. సుకుమార్ దాస్‌గుప్తాకు అప్పగించాడు. నిజానికి సంగీతమంటే ఆమెకు మక్కువ. సినిమాల్లో పాడాలనుకుంది. కానీ అలా సినిమాల్లో నటించే అవకాశం రావడంతో వెండి తెరకు పరిచయమైంది.

ఆత్మాభిమానం ఎక్కువ...

అందమొక్కటే కాదు... అభినయంతో ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసింది. నిజానికి నటించడానికి ఆమె పెద్దగా కష్ట పడాల్సిన అవసరం లేదు. ఏ పాత్రయినా అలా ఒదిగిపోయేది. ఒక చూపుతో, ఒక సైగతో, చిన్న పెదవి విరుపుతో మొత్తం భావాన్ని పలికించిన నటీమణి. అప్పట్లో పెండ్లి తరువాత నటించిన హీరోయిన్స్ తక్కువ. కానీ ఆమె నటనను కొనసాగించారు. ఫెమి నిజం గురించి మనం ఇప్పుడు మాట్లాడు కుంటున్నాం. అదేమీ తెలియకమునుపే ఆమె... తనవైన హక్కుల కోసం కొట్లాడింది. ఆత్మాభిమానం ఎక్కువ. హీరోతో సమాన గౌరవం కోసం ఆనాడే పోరాడింది.

తరాలపై ప్రభావం...

ఆమె నటించిన తొలి చిత్రం 'శేష్ కొరారు'(1952) విడుదల కానే లేదు. ఆ మరుసటి ఏడాది నటుడు ఉత్తమ్‌కుమార్ సరసన ఆమె నటించిన 'షారే చౌత్తోర్' చిత్రం బాక్సాఫీస్ హిట్టవడంతో, ఆమె దశ మారిపోయింది. బెంగాలీ సినీ రంగంలో ఉత్తమ్‌కుమార్, సుచిత్రలది సూపర్‌హిట్ జంట. దాదాపు రెండు దశాబ్దాలపాటు ఆ ప్రభంజనం కొనసాగింది. ఆమె నటించింది అరవై సినిమాలైతే.. అందులో 30 సినిమాలు ఉత్తమ్ కుమార్‌తోనే చేసింది. రాధ-కృష్ణు లెలాగో... బెంగాలీలకు సుచిత్ర-ఉత్తమ్‌లు అలా! ఆ కాలంలో అత్యంత పాపులర్ బెంగాలీ తారగా అవతరించారు. బెంగాలీలో 'సప్తపది' (1961), 'దీప్ జ్వెలే జారు' లాంటి పలుచిత్రాలు ఆమెకు పేరు తెచ్చాయి. 'దీప్ జ్వెలే జారు' (1959), 'ఉత్తర్ ఫల్గుణి' (1963) సినిమాల్లో ఆమె నటన మరపురానిది. బెంగాలీ సినిమా ను అత్యంత ప్రభావితం చేసిన వ్యక్తి. చీరకట్టుతో, సన్‌గ్లాసెస్ పెట్టే తీరులో, మేకప్‌లో... కొన్ని తరాలపై ప్రభావం చూపిన వ్యక్తి.



పారోగా ప్రేక్షకుల మనసుల్లో...

ఆమె నటించిన తొలి హిందీ చిత్రం 'దేవ్‌దాస్' (1955). బిమల్ రారు రూపొందించిన ఈ సినిమాలో దిలీప్‌కుమార్ సరసన పార్వతి పాత్రలో ఆమె అభినయం ప్రేక్షకుల మనసుల్లో ముద్ర వేసింది. హిందీలో తొలి చిత్రంతోనే దేశవ్యాప్తంగా అభిమానుల్ని సంపాదించుకున్నది. హృషీకేశ్ ముఖర్జీ దర్శకత్వంలోని 'ముసాఫిర్' కూడా ఎంతో పేరు తెచ్చింది. దీప్ జ్వేలే జాయ్ (1959) – తెలుగులో చివరకు మిగిలేది, హిందీలో 'ఖామోషీ'గా వచ్చింది. మానసిక రోగంతో బాధపడే చికిత్స చేస్తూ చివరకు అతని ప్రేమలో పడే నర్సుగా నటించింది. బెంగాలీలో సుచిత్ర నటనను చూసిన వహీదా 'ఖామోషి'లో నటిం చేటప్పుడు.. 'నా నటన సుచిత్రా సేన్ నటనకు సరి తూగదు' అని చెప్పిందంటే... సుచిత్ర ఎంత గొప్ప నటో తెలిసిపోతుంది.

'ఆంధీ'తో వివాదాస్పదం..

గుల్జార్ దర్శకత్వంలో సుచిత్రా సేన్ నటించిన 'ఆంధీ' చిత్రం 1975లో విడుదలయింది. ఈ చిత్రం నాటి ప్రధాని ఇందిరా గాంధీ జీవితం ఆధారంగా తీసినట్లుగా అప్పుడు చాలామంది భావించారు. ఇందిరా గాంధీ ఒకింత భయాందోళనకు గురయ్యారట. ఎమర్జెన్సీ సమయంలో ఈ చిత్రాన్ని బ్యాన్ కూడా చేశారు. ఆ చిత్రాన్ని చూసిన తర్వాత బ్యాన్ ఎత్తివేసే విషయమై ఆలోచించాలని నాడు ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరా గాంధీ పిఎంవోను ఆదేశం చారట కూడా. 1977లో జనతా ప్రభుత్వం వచ్చాక 'యథాత థంగా' చిత్రాన్ని నేషనల్ టెలివిజన్‌లో వేసేందుకు అనుమతిం చారట. 1978లో విడుదలైన ప్రణోయ్ పాషా సినిమా ఫ్లాప్ అయిన తర్వాత సుచిత్రాసేన్ ఏకాంతంలోకి వెళ్లిపోయారు.

82వ ఏట...

ఆ తరువాత 1980లో ఉత్తమ్ చనిపోయినప్పుడు అంతిమ వీడ్కోలులో ఒక్కసారి కనిపించిన సుచిత్ర... 1995, జులై 16న ఓటర్ ఐడీ నమోదు కోసం బయటకి వచ్చారు. గంటసేపు లైన్‌లో ఉండి మరీ.. ఓటు నమోదు చేయించుకున్నారు. తెల్లవారి పేపర్‌లో హెడ్‌లైన్స్‌గా మారాక గానీ.. అక్కడివాళ్లు గుర్తుపట్టలేదామెను. సుచిత్రాసేన్ ఏకైక కుమార్తె మూన్‌మూన్‌సేన్, మనుమరాళ్లు రియాసేన్, రైమాసేన్‌లు కూడా సినీ తారలే. మొత్తానికి ఎందరో గుండెల్లో కలల రాణిగా మిగిలిపోయిన సుచిత్రా సేన్, ఆనాటి చెదరని సౌందర్యరాశి గానే గుర్తుండి పోయారు. 2014లో 82వ ఏట కన్నుమూసింది.

దాదాసాహెబ్ ఫాల్కే వచ్చినా...

1963లో మాస్కో చలన చిత్రోత్సవం లో 'సాత్ పాకే బాంధా' చిత్రంలోని నటనకు గాను ఉత్తమ నటిగా వెండి బహుమతిని ఆమె అందుకున్నారు. అలాగే, 1972లో భారత ప్రభుత్వం



ఆమెకు 'పద్మశ్రీ' పురస్కారాన్ని ఇచ్చింది. దేవదాస్ సినిమాలో నటనకు సుచిత్రాసేన్ జాతీయ అవార్డును అందుకున్నారు. మూడు దశాబ్దాలుగా అతికొద్ది మంది సన్నిహితులతో తప్ప ఎవరితోనూ కలవలేదు. బహిరంగ వేదికపైకి రావటం ఇష్టం లేనందువల్ల 2005లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును కూడా సుచిత్ర తిరస్కరించారనే ప్రచారం ఉంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే అత్యున్నత పురస్కారమైన 'వంగ విభూషణ్' పురస్కారాన్ని 2012లో ప్రకటించింది.

కట్ట కవిత



సమయ పాలన నేర్పించండి..

విజయం సొంతమవ్వాలంటే.. కృషి, పట్టుదల ఉంటే సరిపోదు. సమయపాలన చాలా అవసరం. అది పెద్దవాళ్లకే కాదు.. పిల్లలకు. ఆ సమయపాలన పిల్లలకు అలవడాలంటే.. మీరే నేర్పించాలి.

- తల్లిదండ్రు నుంచే పిల్లలు నేర్చుకుంటారు. అందుకే ముందు మీ నుంచే మొదలుపెట్టండి. ఉదయం లేచిన దగ్గరనుంచీ రాత్రి పడుకునే వరకూ ప్రతిపనీ పద్ధతిగా అనుకున్న సమయానికి పూర్తిచేసేలా చూసుకోండి. అంటే మధ్యాహ్నం పన్నెండుకి భోజనం, రాత్రి తొమ్మిదికి నిద్ర, ఉదయం ఆరుగంటలకు లేవడం...ఇలా ప్రతిదానికీ ఓ సమయం నిర్దేశించుకుని దానికి కట్టుబడి ఉండాలి. పిల్లలూ చూసి నేర్చుకుంటారు.
- పిల్లలకో పని అప్పగించండి. అనుకున్న సమయానికి వందశాతం దాన్ని పక్కాగా పూర్తి చేయగలిగితే... అభినందించండి. ఓ చిన్న కానుకనూ ఇవ్వండి. ఇంకాస్త ఉత్సాహంతో సమయపాలనకు ప్రాధాన్యం ఇస్తారు. ఒకవేళ హోంవర్క్‌ని అనుకున్న సమయం కంటే తొందరగా పూర్తి చేయగలిగితే...ఆ సమయంలో వారికి నచ్చే ఆటవిడుపు కల్పించండి. ఇవన్నీ కూడా వారు ప్రతి పనీ ప్రణాళికాబద్ధంగా చేయడానికి అలవాటు పడేందుకు తోడ్పడతాయి.
- సమయపాలన పాటించడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఓ చేతి గడియారం కానుకగా ఇచ్చి సమయపాలన ఎలా చేయొచ్చో నేర్పించండి. ప్రతిసారీ మీరు వెనకుండి సమయాన్ని గుర్తు చేయకుండా దాని విలువ చెప్పగలగాలి. ఈ జాగ్రత్తలన్నీ వాళ్లకు భవిష్యత్తులో ఉపయోగపడతాయి.

❄





బన్నీ బిన్స్

ఇప్పుడు పిల్లలున్న ప్రతి ఇంట్లో క్రేయాన్స్ ఉంటున్నాయి. వాటిని ఎక్కడెక్కడో పడేసి... అవసరమున్నప్పుడు వెదుకుతుంటాం. అలాకాకుండా ఉండాలంటే ఇలా పిల్లలతో బన్నీ క్రేయాన్స్ హోల్డర్స్ తయారు చేయించండి. వాళ్లకు కాలక్షేపం అవుతుంది. కళాత్మకత అబ్బుతుంది.



మానవి మీ స్పందన

'మానవి' పేజీలు మీకెలా ఉన్నాయి? ఇంకా ఏం కావాలనుకుంటున్నారు? మీ కుటుంబ సభ్యుల, మిత్రుల స్పందన ఎలా ఉంది? 'నవతెలంగాణ' కార్యాలయానికి రాయండి. మీ సూచనలు, సలహాలు ఇ-మెయిల్ navamaanavi@gmail.com కు తెలియ జేయండి.

మా చిరునామా

మానవి, నవతెలంగాణ దినపత్రిక,
ఎం.హెచ్. భవన్, ప్లాట్ నెం. 21/1,
1-8-664, అజామాబాద్, ఆర్.టి.సి. కల్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్ - 500 020. లేదా 94900 99016కు ఫోన్ చేయండి. ఇప్పటికే మా ప్రయత్నాలను అభినందిస్తూ స్పందిస్తున్న వారికి కృతజ్ఞతలు.



చర్మ సంరక్షణకు...

- **ము**ఖంపై మొటిమలు ఉన్నప్పుడు కొందరు వాటిని తాకుతూ ఉంటారు. అలా తాకడం వల్ల అవి ఇంకా పెరుగుతాయి. చేతుల్లోని సూక్ష్మక్రిములు ముఖంలోకి చేరడమే అందుకు కారణం. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో చేతులతో వాటిని తాకకపోవడమే మంచిది.
- ఎస్‌పీఎఫ్ 30 ఉన్న సన్‌స్క్రీన్ ముఖానికి మాత్రమే రాసుకుంటారు కొందరు. అదీ ఎండాకాలంలోనే. కానీ ముఖంతోపాటూ మెడచుట్టూ కూడా సన్‌స్క్రీన్ అవసరమే. ఇంకా చెప్పాలంటే ఎండపడే శరీరభాగాలకు సన్‌స్క్రీన్ అవసరం.
- కప్పు కాఫీ తాగడం మనలో చాలామందికి అలవాటు. అవసరానికి మించి ఎక్కువ తాగేస్తుంటారు కొందరు. దానివల్ల చర్మం పొడిబారినట్లు అవుతుంది. శరీరం తేమగా ఉంటేనే చర్మం కూడా ఆరోగ్యంగా ఉంటుంది కాబట్టి కాఫీలు తగ్గించి నీళ్లూ, ఇతర ద్రవపదార్థాలు తీసుకోవడం మంచిది.
- మృతకణాలు తొలగించేందుకు రకరకాల స్క్రబ్‌లు వాడతాం కదా. దానివల్ల చర్మం తాజాగా ఉంటుందనేది వాస్తవమే. అలాగని అతిగా చేస్తే... చర్మం ఇంకా పొడిబారే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. జిడ్డు చర్మం అయితే... వారంలో ఒకసారి చాలు. అదే పొడిబారిన లేదా సాధారణ చర్మతత్వం ఉన్నవారయితే ఒకటి రెండుసార్లు స్క్రబ్‌వాడితే సరిపోతుంది.
- చర్మ సంరక్షణకు సంబంధించిన ఉత్పత్తుల్ని తరచూ మార్చేయడం మీకు అలవాటా... వద్దు. దానివల్ల చర్మం ఇంకా రాపిడికి గురై కందిపోయినట్లు అవుతుంది. నిపుణుల సలహాతో మీకు ఉపయోగపడే ఉత్పత్తులు ఎంచుకుని వాటికే కట్టుబడటం మంచిది. ❄

తెలంగాణకు కేంద్ర బడ్జెట్‌లో మొండిచెయ్యి

● సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం మొండిచెయ్యి చూపించిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ విమర్శించింది. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు జరపడానికి అవసరమైన నిధులు కేటాయించకపోవడం అత్యంత దారుణమని ఖండించింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత నాలుగేండ్లుగా విభజన హామీలను కేంద్రం అమలు చేస్తుందని ప్రజలు ఎదురుచూశారని తెలిపారు. విభజన చట్టంలో హార్టికల్చర్ విశ్వవిద్యాలయం, గిరిజన విశ్వవిద్యాలయం, ఖమ్మంలో ఉక్కు కర్మాగారం, ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4 వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం, ఎన్‌మెచ్‌ఏఐకి రోడ్ల కన్వెన్షన్, ఖాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీకి ఎలాంటి నిధులు కేటాయింపు లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపించిందని తెలిపారు. అయినా కేంద్రం దృష్టి పెట్టలేదని విమర్శించారు. సింగరేణిలో 51 శాతం తెలంగాణకు, 49 శాతం కేంద్రానికి వర్తించాలన్న నిబంధనను చట్టబద్ధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఏర్పడితే లక్షల మందికి ఉద్యోగాలు రావడమే కాక, ఉక్కు ఎగుమతికి అవకాశాలుంటాయని తెలిపారు. అలాగే రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వల్ల వేలాది మందికి ఉపాధి కలుగుతుందని పేర్కొన్నారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి వల్ల ప్రస్తుతం రాష్ట్ర డిస్కంలు భరిస్తున్న అప్పుల నుండి బయటపడే అవకాశముందని తెలిపారు. తక్షణమే హామీలను అమలు జరపడానికి తెలంగాణకు తగు నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ కార్మికులకు మొండిచెయ్యి

కేంద్ర బడ్జెట్‌పై వ్యవసాయ కార్మిక సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికులకు మొండిచెయ్యి చూపిందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ఉపాధ్యక్షులు బి వెంకట్ విమర్శించారు. శనివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆఫీసు బేరర్లు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంయుక్త సమావేశం సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనేక రాయితీలిచ్చిందని చెప్పారు. వ్యవసాయ కార్మికులకు, ఉపాధి కూలీలకు ఈ బడ్జెట్‌తో ఒరిగిందేమీ లేదని విమర్శించారు. వారికి భద్రత కల్పించే సమగ్ర చట్టాన్ని చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు, వేతనాలు పెంపు లేదన్నారు. పట్టణ ప్రాంతంలో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని కోరారు. ప్రధాని నరేంద్రమోడీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వల్ల దేశంలో వ్యవసాయం సంక్షోభంలోకి కూరుకుపోయిందని అన్నారు. రైతు, వ్యవసాయ కార్మికుల వ్యతిరేక విధానాలను మోడీ తీవ్రతరం చేశారని చెప్పారు. 60 ఏండ్లు దాటిన అసంఘటిత కార్మికుల పింఛనులో వ్యవసాయ కార్మికులను, ఉపాధి కార్మికులను చేర్చాలని కోరారు. ఆహార భద్రత చట్టం అమలుకు, ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్టతకు నిధులు కేటాయించకపోవడం ఆందోళనకరమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 7వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, నాయకులు నారి ఐలయ్య, మచ్చ వెంకటేశ్వర్లు, రాములు, పద్మ, జగన్, గోపాల్, వెంకటయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో ముగ్గురు యువకులు గల్లంతు

● వారిది ఒక్కటే గ్రామం



నవతెలంగాణ-బూర్గంపాడు/సారపాక

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు శనివారం గోదావరిలో గల్లంతయ్యారు. కుందూరు శ్రీనివాస్‌రెడ్డి(21), కారంపుడి శేషు(21), తిరుమలరెడ్డి శివారెడ్డి(20) గాదె పృధ్వీరెడ్డి, కుందూరు సతీష్‌రెడ్డి, గాదె విజయ్ కుమార్‌రెడ్డి స్నేహితులు. వీరు విందు చేసుకునేందుకు పశ్చిమ గోదావరి జిల్లాలోని కుక్కునూరు మండలం వేలేరు వద్ద గోదావరి ఒడ్డుకు వెళ్లారు. ఈ క్రమంలో కుందూరు శ్రీనివాస్‌రెడ్డి, కారంపుడి శేషు, తిరుమలరెడ్డి శివారెడ్డి స్నానం చేసేందుకు గోదావరిలోకి దిగారు. వారు ఎంతసేపైనా బయటకు రాకపోయేసరికి మిగతా స్నేహితులు వెంటనే కుటుంబీకులకు సమాచారం అందజేశారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసులు వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. ఇంకా వారి ఆచూకీ తెలియరాలేదని పాల్వంచ డీఎస్పీ మధుసూదన్‌రావు తెలిపారు.

వీడీసీలపై ఉక్కుపాదం మోపాలి

● వామపక్ష, సామాజిక సంఘాల డిమాండ్
● సాంఘిక బహిష్కరణపై సీఐకి ఫిర్యాదు


బాధితులతో మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-భీమ్‌గల్

విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ(వీడీసీ)లు చేస్తున్న అరాచకాలపై ఉక్కుపాదం మోపాలని వామపక్ష, సామాజిక సంఘాలు డిమాండ్ చేశాయి. మేకల ఎరువును ఉచితంగా ఇవ్వలేదనే నెపంతో నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం పల్లికొండ గ్రామంలో 40 యాదవ కుటుంబాలను వీడీసీ సాంఘిక బహిష్కరణ చేసిన విషయం తెలిసిందే. ఆ గ్రామాన్ని వామపక్ష, సామాజిక సంఘాల నాయకులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పల్లికొండ గ్రామంలో నాలుగేండ్లుగా గొల్లకుర్మ కుటుంబాల నుంచి లక్షల విలువ చేసే గొర్రెలు, మేకలను వీడీసీ సభ్యులు ఉచితంగా తీసుకుంటున్నారని తెలిపారు. ఉచితంగా మేకల ఎరువులు ఇవ్వలేదనే నెపంతో వారిని సాంఘిక బహిష్కరణకు గురిచేయడం చట్ట విరుద్ధమని అన్నారు. గ్రామాభివృద్ధి పేరుతో చట్టాన్ని, రాజ్యాంగాన్ని ధిక్కరిస్తూ అనేక అక్రమాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం భీంగల్ సీఐ సైదయ్యకు వినతిపత్రం అందజేశారు. గ్రామాన్ని సందర్శించిన వారిలో పెద్ది వెంకట్రాములు, బి.దేవరాం, దండివెంకట్, సావెల్ గంగాధర్, జి.మాణిక్యం, కె.రాజేశ్వర్ ఉన్నారు.

విషప్రయోగంతోనే హత్య

మేనకోడలిపైనే అనుమానం!

● జయరామ్ హత్యకేసులో పురోగతి


(ఫైల్)

నందిగామ: ఎన్‌ఆర్‌ఐ, ఎక్స్‌ప్రెస్ టివి మాజీ ఎండి, కోస్టల్ బ్యాంక్ ఎండీ చిగురుపాటి జయరామ్ హత్య కేసులో పురోగతి సాధించినట్టుగా నందిగామ పోలీసులు వెల్లడించారు. మరికొద్ది గంటల్లోనే నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టనున్నట్టుగా సమాచారం. ఈ హత్యకేసులో కీలక వ్యక్తిగా భావిస్తున్న జయరామ్ మేనకోడలు పులవర్తి మాధురి అలియాస్ శిఖా చౌదరిని నందిగామ రూరల్ సీఐ కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్పీ త్రిపాఠి, డీఎస్పీ బోస్, సీఐ రమణ ఆధ్వర్యంలో విచారించారు. విచారణలో కీలకాంశాలను పోలీసు అధికారులు రాబట్టినట్టుగా సమాచారం. హత్యకేసుగా నమోదు చేసిన వెంటనే వివిధ కోణాల్లో విచారణ చేపట్టేందుకు నాలుగు బృందాలను రంగంలోకి దింపినట్టు పోలీసులు తెలిపారు. హైదరాబాదులో పలువురిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించినట్టుగా తెలిసింది. కేసులో ముఖ్యమైన వ్యక్తులుగా భావిస్తున్న శిఖా చౌదరి, ఆమె చెల్లెలు మనీష చౌదరి, శిఖా చౌదరి స్నేహితులు రాఖేష్‌రెడ్డి, శ్రీకాంత్, జయరామ్ సోదరి సుశీల, జయరామ్ కారు డ్రైవర్ సతీష్, శిఖా చౌదరి కారు డ్రైవర్ శ్రీరామ్‌లను కంచికచర్లలోని నందిగామ రూరల్ సీఐ కార్యాలయంలో విడివిడిగా విచారించారు. జయరామ్, శిఖా చౌదరీల మధ్య ఆర్థిక లావాదేవీలపై విచారించగా పోలీసులకు కీలకమైన సమాచారం అందినట్లు తెలిసింది. శిఖా చౌదరికి రాఖేష్‌రెడ్డి అనే వ్యక్తి రూ. 4.5 కోట్లు అప్పుగా ఇవ్వగా జయరామ్ తీర్చినట్టు తెలుస్తోంది. ఈ విషయంపై గత రెండేండ్లుగా శిఖా చౌదరి, రాఖేష్‌రెడ్డి, జయరామ్‌ల మధ్య వివాదం కొనసాగుతున్నట్టుగా విశ్వసనీయ సమాచారం. జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు వద్ద జయరామ్‌కు చెందిన 10 ఎకరాల భూమిని శిఖా చౌదరి పేరిట జయరామ్ రిజిస్టర్ చేసి ఆ పత్రాలు తనవద్దే ఉంచుకున్నాడు. జయరామ్ పలు కంపెనీల్లో పెట్టుబడులు పెట్టి శిఖా చౌదరిని మేజర్ షేర్ హోల్డర్‌గా ఉంచిన్నట్టు పోలీసులకు కీలక సమాచారం అందింది. జయరామ్ భార్య పద్మశ్రీకి పోలీసులు ఫోన్ చేసి అడగ్గా ఆమె కూడా శిఖా చౌదరిపైనే అనుమానం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో పోలీసులు నందిగామకు శిఖాచౌదరిని రప్పించారు. ఉదయం 10 గంటలకు కంచికచర్ల రూరల్ సీఐ కార్యలయానికి వచ్చిన జిల్లా ఎస్పీ త్రిపాఠి, డీఎస్పీ, సీఐలు ఆమెను పలు కోణాల్లో విచారించారు. సూర్యాపేట జిల్లా పతంగి వద్ద టోల్‌గేట్‌ను జయరామ్ కారు దాటే టప్పుడు సీసీ పుటేజ్‌లో డ్రైవర్‌తో పాటు ఒక మహిళ ఉన్నట్టు గుర్తించిన పోలీసులు ఆ మహిళ శిఖా చౌదరి అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. రాఖేష్ రెడ్డి, శ్రీకాంత్‌లకు శేఖర్‌రెడ్డితో ఉన్న సంబంధాలపై కూడా ఆరా తీస్తున్నారు. వీరందరినీ ఇప్పటికే విడివిడిగా ప్రశ్నించారు. జనవరి 30వ తేదీ మధ్యాహ్నం ఇంటి వద్ద నుంచి బయలుదేరిన జయరామ్ 31వ తేదీ మధ్యాహ్నం వరకు హైదరాబాదులోని ఓ ప్రముఖ హోటల్‌లో ఫార్మా కంపెనీల ప్రతినిధులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నట్టుగా తెలిసింది. 30, 31 తేదీల్లో మిగిలిన సమయం శిఖా చౌదరి ఇంటి వద్దే ఉన్నట్లుగా సమాచారం. జయరామ్ కారులో మృతదేహంగా పడివున్నప్పుడు అతని శరీరం రంగుమారినట్టు కనిపించటంతో అతని హత్యకు విషప్రయోగం జరిగిందనే అనుమానంతో పోలీసులు అతని శరీరంలోని కీలక భాగాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఈ హత్యలో గుంటూరు జిల్లాకు చెందిన ఒక ఎంపీ సోదరుడి పేరు బలంగా వినిపిస్తుండటంతో అతన్ని కూడా విచారించేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. జయరామ్‌తో గతంలో వ్యాపార లావాదేవీలు నడిపి, ప్రస్తుతం విడిగా వ్యాపారం నిర్వహించుకుంటున్న భాను, ఉద్దండ కృష్ణ అనే వ్యాపారులను కూడా విచారించనున్నట్టుగా తెలిసింది. గతంలో ఎక్స్‌ప్రెస్ చానల్ నడిపిన సమయంలో ఆర్థిక లావాదేవీలకు సంబంధించి జయరామ్‌పై కూడా కేసు ఉన్నట్టు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన చిగురుపాటి జయరామ్ హత్యకేసులో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. అమెరికాలోని ఫ్లోరిడాలో ఉంటున్న ఆయన భార్యపిల్లలు హైదరాబాద్ చేరు కోకపోవడంతో అంత్యక్రియలు ఆలస్యం కానున్నాయి. పొగమంచు కారణంగా అమెరికా నుండి ఇండియాకు వచ్చే విమానాలను నిలిపివేయడంతో వారు మరో రెండురోజులు ఆలస్యంగా వచ్చే అవకాశముందని తెలిసింది. మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి అతని మేనమామ గుత్తా పిచ్చయ్య చౌదరికి అప్పగించారు. జయరామ్ మృతదేహం ప్రస్తుతం హైదరాబాదులోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలోని మార్చురీలో ఉంచారు.

నాణ్యతలో రాజీపడబోం

● పౌరసరఫరాల చైర్మెన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పేదలకు సరఫరా చేసే బియ్యం నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీపడబోమని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రైస్‌మిల్లర్లకు విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ఒక్కరికి ఐదు కిలోల చొప్పున సరఫరా చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం కుటుంబంలో ప్రతి ఒక్కరికి కిలో రూ. 1కే నెలకు 6 కిలోలు ఇస్తుందన్నారు. 2.75 లక్షల మంది లబ్ధి పొందుతున్నారని చెప్పారు. . ఇందు కోసం ప్రతి నెల 1.75 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. దీంతో ప్రజాపంపిణీకి 3.50 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి అవసరం ఉంటుంది. ఈ బియ్యాన్ని మిల్లర్ల నుండి కొనుగోలు చేయాలని నిర్ణయిం చింది. ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలు, మధ్యాహ్న భోజనం పథకం ద్వారా పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన సన్నబియ్యంతో భోజనం అందిస్తుంది. ఇందుకోసం ఏడాదికి 1.20 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం అవసరం అవుతుంది. ప్రజాపంపిణీ కోసం 3.5 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యానికి, 1.20 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం సేకరణ కోసం పౌరసరఫరాల సంస్థ టెండర్లను నిర్వహించింది. దీనిపై శనివారం చైర్మెన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ అకున్ సబర్వాల్ రైస్ మిల్లర్లతో సమావేశం అయ్యారు. ధర విషయంలో మిల్లర్లతో సంప్రదింపులు జరిపారు. అంతకు ముందు పౌరసరఫరాల భవన్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను, ఈ పాస్, ఐరిస్ ద్వారా రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియను చైర్మన్ పరిశీలించారు.

అంగన్‌వాడీలకు మళ్లీ కేంద్రం మోసం

అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

● ఈ నెల 25న 'ఛలో ఢిల్లీ' కార్యక్రమం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

2019-20 మధ్యంతర బడ్జెట్‌లో దేశంలోని 26 లక్షల మంది అంగన్‌వాడీలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరోసారి మోసం చేసిందని తెలం గాణ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ విమర్శించింది. అంగన్‌వాడీల దీర్ఘకాలిక సమస్య లేగాక, దేశంలోని పౌష్టికాహార లోపాన్ని నిర్లక్ష్యం చేసిందని పేర్కొంది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.పద్మ, పి.జయలక్ష్మీ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ' గతేడాది అక్టోబర్ 1న అంగనవాడీల వేతనాలను పెంచుతున్నట్టు ప్రధాని సెప్టెంబర్ 11న ప్రకటన చేశారు. ఇదే పెంపును మధ్యంతర బడ్జెట్‌లో మరోసారి పెంచుతున్నట్టు ఆర్థికమంత్రి చెప్పారు. ఇది అంగన్‌వాడీలను మోసం చేయడమే. ఆ పెరిగిన కొద్దిపాటి వేతనాలను కూడా చెల్లించడానికి అవసరమైన బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం కేటాయించలేదు. 2018 జనవరి 1 నుంచి 2020 మార్చి 31 నాటికి పై వేతనాలు పెంపు చెల్లించడానికి రూ. 10,649.41 కోటర్ల అదనంగా అవసరమవుతాయి. కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సిన 60 శాతం వాటాకి రూ.4,250 కోట్లు అవసరం. కానీ గత బడ్జెట్‌లో పోలిస్తే అదనంగా కేటాయించింది రూ.1,944 కోట్లు మాత్రమే. అంటే పెరిగిన వేతనాలు సగం చెల్లింపులు చేయడానికి కూడా ఈ బడ్జెట్ సరిపోదు. బడ్జెట్‌లో ఎక్కడా 2014 నుండి చెబుతున్న అంగనవాడీల పెన్షన్ గురించి ప్రస్తావనే లేదు. 2017 సెప్టెంబర్‌లో అంగనవాడీ సెంటర్లలో అదనపు పౌష్టికాహారం కోసం రూ.12 వేల కోట్లు ఖర్చుచేస్తామని చెప్పినా, దాని నిమిత్తం కేటాయించాల్సిన రూ.6 వేల కోట్లు ఎక్కడా ప్రస్తావనే లేదు. ఈ ఎన్నికల బడ్జెట్‌తోనూ మోడీ ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. అంతేకాకుండా 2 కోట్ల మంది తల్లులను, 6 ఏండ్లలోపు 10 కోట్ల మంది పిల్లలను కూడా నిర్లక్ష్యం చేసింది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైన చోట నిధులు కేటాయించకపోవటం, నగదు బదిలీ వ్యతిరేకిస్తూ 45వ ఐఎల్‌సీ సిఫార్సులు ప్రకారం కనీస వేతనాలు, పెన్షన్ డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఈ నెల 25న 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని వారు తెలిపారు. ఈ సందర్భంగా జరిగే నిరసన ప్రదర్శనలో రాష్ట్రంలోని అంగనవాడీలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఎం.పద్మ, పి.జయలక్ష్మీలు పిలుపునిచ్చారు.

అమెరికన్ తెలంగాణ అసోసియేషన్ అండ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమెరికాలో అరెస్టయిన తెలుగు విద్యార్థులకు అమెరికన్ తెలంగాణ అసోసియేషన్ బాసటగా నిలిచింది. డెట్రాయిట్, బాటిల్ గ్రీక్ రెండు ప్రాంతాల్లోని డిటెన్సెస్ సెంటర్‌లలో ఉన్న విద్యార్థుల తరఫున వాదించేందుకు మిషిగన్ ఇమ్మిగ్రేషన్ అటార్నీలను అమెరికన్ తెలంగాణ అసోసియేషన్ ఏర్పాటు చేసింది. ఈ మేరకు అమెరికన్ తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షులు సత్య కందిమల్ల, చైర్మెన్ కరుణాకర్ మాధవరం, ప్రెసిడెంట్ ఎలెక్ట్ వినోద్ కుకునూర్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అటార్నీలతోపాటు డిటెన్షన్ సెంటర్‌లలో తమ అసోసియేషన్ ప్రతినిధులు పర్యటించారని తెలిపారు. అరెస్టయిన విద్యార్థులు, వారి స్నేహితులు, తల్లిదండ్రుల ఫోన్ల ద్వారా వచ్చిన సమాచారం మేరకు సహాయం చేసేందుకు రంగంలోకి దిగామని పేర్కొన్నారు. ఇంకా ఎవరైనా సహాయం కావాలంటే info@atausa.org ని సంప్రదించాలని కోరారు.

సర్పంచుల శిక్షణకు రంగం సిద్ధం

ట్రైనర్లకు రేపటి నుంచి 'సీపార్డు'లో అవగాహన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తాజాగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచులకు పరిపాలనా అంశాలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. ఈమేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సోమవారం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనుంది. సర్పంచులకు శిక్షణ ఇచ్చేందుకుగాను బ్యాచ్‌లవారీగా దాదాపు 300 మంది ఎంపీడీవోలు, ఈవోఆర్డీలు, ఇతర అధికారులకు ముందుగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు ఇప్పటికే షెడ్యూల్ ఖరారు చేసింది. ఈ విషయాన్ని ఆయా అధికారులకు తెలియజేసింది. సోమవారం నుంచి రాజేంద్రనగర్‌లోని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, శిక్షణ సంస్థలో చేపట్టనున్నారు. దాదాపు ఐదు రోజులపాటు ఈ శిక్షణ ఉంటుంది. హైదరాబాద్ జిల్లా మినహా మిగతా 30 జిల్లాల అధికారులు హాజరు కానున్నారు. ఒక్కో జిల్లాకు 10 చొప్పున ఈ శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం ఎక్కడిక్కడ కలెక్టర్ల పర్యవేక్షణలో స్థానికంగా సర్పంచులకు శిక్షణ ఇవ్వనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12, 751 పంచాయతీలకు ఇటీవల ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇందులో దాదాపు సగానికిపైగా కొత్తవారు ఉన్నారు. వీరికి పరిపాలన పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో పంచాయతీరాజ్ శిక్షణా కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. సర్పంచులకు శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన షెడ్యూల్‌ను ఒకేసారి రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసేందుకు అవకాశం ఉంది. తేదీలను ఖరారు చేసి ఆయా జిల్లాల కలెక్టర్లకు పంపి, ఆమేరకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించే అవకాశాలు ఉన్నాయి. అలా సాధ్యం కాకపోతే స్థానికంగా కలెక్టర్లకే తేదీలను నిర్ణయించుకుని, శిక్షణ ఇచ్చే అధికారాలను ఇచ్చే విషయాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు తెలిసింది.

బడ్జెట్‌తో 2 కోట్ల మందికి ఉపాధి : దత్తాత్రేయ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ద్వారా రెండు కోట్లకు పైగా ఉపాధి కల్పన జరుగుతుందని కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ బండారు దత్తాత్రేయ ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని అమీర్‌పేటలోని సెంటర్ ఆఫ్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్‌లో సెంటర్ ఫర్ లీడర్‌షిప్ అండ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో 2018 కేంద్ర బడ్జెట్‌పై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. దత్తాత్రేయ మాట్లాడుతూ..తొలిసారి రక్షణ రంగానికి రూ.3 లక్షల కోట్ల కేటాయింపులు జరిగాయన్నారు. ఎమ్మెల్సీ రామచంద్రరావు మాట్లాడుతూ ప్రస్తుత బడ్జెట్ పీపుల్స్ బడ్జెట్ అని, వంద కోట్ల జనాభాకి లాభదాయకమని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఐవైఆర్ కష్ణారావు మాట్లాడుతూ..ఈ బడ్జెట్‌లో జనాకర్షణ, శాస్త్రీయత సమపాళ్ళలో ఉన్నాయని ప్రశంసించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. రీఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్, ఫర్ఫామ్ అనే మూడు సూత్రాలతో ఈ ప్రభుత్వం ముందుకెళ్తుందని విశ్లేషించారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ..ఐదేండ్లకోసారి జరిగే సర్వే ఇప్పుడు క్వార్టర్లీగా జరగడం వల్ల ప్రజలకు అనేక లాభాలు కలుగుతున్నాయని వివరించారు. ఆర్థిక నిపుణులు సూర్యనారాయణ రావు మాట్లాడుతూ.. స్వచ్ఛభారత్ ద్వారా మోడీ ఇచ్చిన సందేశం కేవలం పరిసరాల పరిశుభ్రతకే పరిమితం కాకుండా నల్లధనం, అవినీతి నిర్మూలన, విలువలను శుభ్రతను తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ మాజీ కార్యదర్శి అజయ్ కళ్లెం, ఎఫ్‌ఏపీటీసీఐ మాజీ అధ్యక్షులు ఎన్ వి రాజేశ్వరరావు, సెంటర్ ఫర్ లీడర్‌షిప్ అండ్ గవర్నెన్స్ డైరెక్టర్ ఏనుగుల రాకేష్ రెడ్డి, ఆర్థిక రంగ నిపుణులు పాల్గొన్నారు.

'సేఫ్టీ'లేని ఆస్పత్రులపై ఆరోగ్యశాఖ 'ఫైర్'

అగ్నిమాపక అనుమతుల్లేని వాటిపై త్వరలో స్పెషల్ డ్రైవ్

● నిబంధనలు ఉల్లంఘించినట్టు తేలితే లైసెన్సుల రద్దు.. కేసులు నమోదు
● 'నవతెలంగాణ' ఎఫెక్ట్


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అగ్నిమాపక నిబంధనలు పాటించని ప్రయివేటు ఆస్పత్రులపై ప్రభుత్వం కొరడా ఝుళిపించేందుకు సిద్ధమవుతున్నది. నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) లేని ఆస్పత్రుల లైసెన్స్‌ను రద్దు చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. అడ్డగోలు అనుమతులిచ్చిన అవినీతి అధికారులపై కేసులు నమోదు చేసేందుకు రెడీ అవుతున్నారు. గత నెల 21న నవతెలంగాణలో 'ప్రయివేటు ఆస్పత్రుల్లో నో ఫైర్ సేఫ్టీ' పేరుతో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. వేల సంఖ్యలో ప్రయివేటు ఆస్పత్రులు అగ్ని ప్రమాద నివారణ చర్యలు తీసుకోవడంలేదని.. దీంతో ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటన్నది కథనం సారాంశం. ఈ విషయమై వైద్యఆరోగ్యశాఖకు డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం వారం రోజుల క్రితం లేఖ రాసింది. ప్రతిశాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు ప్రత్యేకంగా ఫైర్‌సేఫ్టీపై ఉత్తరాలు రాస్తూ సంబంధిత శాఖలను అప్రమత్తం చేస్తారు. ఇందులో భాగంగా తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వైద్యశాఖ అధికారులకు లేఖ రాశారు. కొంతమంది అవినీతి అధికారులు జిల్లాల్లో ఎన్‌ఓసీలు లేని ఆస్పత్రులకూ లైసెన్స్, రెన్యువల్స్ చేసేస్తున్నారని.. ఏదైనా జరగరాని సంఘటన జరిగితే సంబంధిత డీఎంహెచ్‌ఓనే బాధ్యుల్ని చేస్తామని ఆ లేఖలో స్పష్టం చేసింది. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని ఆస్పత్రుల్లో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలపై విజిలెన్స్ విభాగం త్వరలో ఆకస్మిక తనిఖీలు చేయనుంది. ఎన్‌ఓసీ లేని ఆస్పత్రుల లైసెన్స్ రద్దు చేయనున్నారు. రాష్ట్రంలో చిన్న, పెద్ద ఆస్పత్రులు కలిసి సుమారు 5 వేలకు పైగా ఉంటాయని అంచనా. ఇందులో ఫైర్‌సేఫ్టీ పొందినవి కేవలం 500లోపే ఉండటం విశేషం. మిగిలినవి యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని అగ్నిమాపక అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రయివేటు ఆస్పత్రులపై స్పెషల్ డ్రైవ్ చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

నిబంధనలు తప్పనిసరి

1999 ఫైర్ చట్టం సెక్షన్ 121 ప్రకారం 15 మీటర్ల కలిగి ఉన్న వ్యాపార సంబంధ బహుళ అంతస్తుల భవనాలు కచ్చితంగా అగ్నిమాపక అధికారుల నుంచి ఫైర్‌సేఫ్టీ సర్టిఫికేట్‌ను పొందాల్సి ఉంటుంది. అంతకు తక్కువ ఉన్న భవనాలు సర్టిఫికేట్‌ను తీసుకోవాల్సిన అవసరం లేదు. అదే విధంగా గృహసంబంధ నిర్మాణాలకు సంబంధించి 18 మీటర్లు కలిగి ఉన్న భవనాలు ఖచ్చితంగా ఫైర్‌సేఫ్టీ సర్టిఫికేట్‌ను తీసుకోవాల్సి ఉంటుంది. కానీ కొన్ని ఆస్పత్రులు బహుళ అంతస్తుల భవనాల్లో నిబంధనలకు నీరుగారుస్తూ వెలుస్తున్నాయి. కనీస సౌకర్యాలు సైతం లేకుండా ఆస్పత్రులను ఏర్పాటు చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. మరోవైపు ఫైర్‌సేఫ్టీపై అగ్నిమాపక శాఖ అధికారులు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుంది. ఆయా భవనాల్లో ఫైర్‌సేఫ్టీ ఉందా ? వేటికి లేదో ఖచ్చితంగా నిర్ధారించాలి. అప్పుడు మాత్రమే భవనం నిర్మించాలి. కానీ నగరంలో ఆ పరిస్థితి కానరావడం లేదు.

ప్రభుత్వాస్పత్రుల్లోనూ..

ఇక ప్రభుత్వాస్పత్రులను పరిశీలిస్తే ఫైర్‌సేఫ్టీ అంటే ఏమిటో అన్నట్టుగా కనిపిస్తున్నది. నగరంలో వేలాది మంది చికిత్స పొందే గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, ఫీవర్ ఆస్పత్రుల్లోనూ ఫైర్‌సేఫ్టీ లేనట్టు అధికారులు గుర్తించారు. కనీసం సిఓ2 సిలిండర్లను కూడా సరిగ్గా సమకూర్చడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాకుండా భవనం కింది భాగంలో 70 వేల లీటర్ల నీటి ట్యాంకును, పై భాగాన 30వేల లీటర్ల ట్యాంకును ఏర్పాటు చేయాలి. ఈ నీళ్లను నిరంతరం పైపుల ద్వారా సరఫరా చేస్తుండాలి. ఆరు నెలలకోసారి అగ్నిప్రమాదాలపై మాక్‌డ్రిల్‌ను నిర్వహించి, అవగాహన కల్పించాలి. ప్రమాదం జరిగినపుడు సిబ్బంది, రోగులు సులభంగా బయటకు వచ్చేందుకు భవనానికి ఇరువైపులా రెండు మెట్లమార్గాన్ని ఏర్పాటు చేయాలి. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు విద్యుత్ సరఫరాను నిలిపివేయాలి కాబట్టి.. ప్రతి భవనంలో జనరేటర్‌ను కచ్చితంగా ఏర్పాటు చేయాలి. భవనాలపైన నీటి ట్యాంకర్లను నిర్మించుకోవాలి. ప్రతి అంతస్తుకు నీటిని అందించే పైవును ఏర్పాటు చేయాలి. ఆస్పత్రి బయట నుంచి కూడా పొడవైన పైవులను ఏర్పాటు చేయాలి. వీటి ద్వారా వెలుపలి నుంచి భవనానికి అన్ని వైపులా నీళ్లు చిమ్మేందుకు వీలవుతుంది. ఏది ఏమైనా ఇలాంటి ఆస్పత్రులపై వెంటనే చర్యలు చేపట్టాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

మిషన్ భగీరథపై ఆర్థిక సంఘం దృష్టి..

ఈనెల 18న రాష్ట్రానికి రాక
అయిపోయిన పథకానికి డబ్బులెందుకు..?
పలు వినతులతో సిద్ధమవుతున్న రాష్ట్ర ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెబుతున్న మిషన్ భగీరథ పథకంపై 15వ ఆర్థిక సంఘం (ఫైనాన్స్ కమిషన్) ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్టు తెలిసింది. ఈ పథకానికి నిధులు కావాలి.. అందువల్ల ఆర్థిక సాయం చేయాలంటూ రెండు, మూడేండ్లుగా టీఆర్ఎస్ సర్కారు.. కేంద్రాన్ని కోరుతూ వస్తున్నది. ఈ క్రమంలో రాష్ట్రంలో పర్యటించబోయే ఆర్థిక సంఘం దృష్టికి కూడా ఇదే అంశాన్ని తీసుకెళ్లాలని ప్రభుత్వ పెద్దలు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మిషన్ భగీరథ తీరు తెన్నులు, దానికైన ఖర్చు, నిర్వహణ తదితరాంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆర్థిక సంఘం భావిస్తున్నది. ఈ పథకం 90 శాతం దాకా పూర్తయిందంటూ మొన్నటి శాసనసభ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పలుమార్లు ప్రకటించారు. అలాంటప్పుడు అసలు ఈ పథకానికి నిధులివ్వాలంటూ అడగటంలో ఆంతర్యమేంటంటూ కమిషన్ ప్రశ్నించే అవకాశముందని ఆర్థికశాఖ వర్గాలు చెబుతున్నాయి.

మరోవైపు ఈనెల 18న రాష్ట్రానికి విచ్చేస్తున్న ఆర్థిక సంఘం ప్రతినిధులు.. మూడు రోజులపాటు ఇక్కడ పర్యటించనున్నారు. ఆ సందర్భంగా వారు ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ, వ్యయాలు, వివిధ పథకాలకు వెచ్చిస్తున్న నిధులు, వాటి వ్యయం తదితరాంశాలను పరిశీలిస్తారు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తన ప్రాధాన్యతలు, అవసరాలకు అనుగుణంగా పలు ప్రతిపాదనలను తయారు చేసి ఫైనాన్స్ కమిషన్‌కు సమర్పించనుంది. ఇందుకనుగుణంగా నివేదికలు సిద్ధం చేయాలంటూ సీఎం ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో పర్యటించిన ఫైనాన్స్ కమిషన్.. మిగతా రాష్ట్రాల్లో కూడా పర్యటించటం ద్వారా అన్ని రాష్ట్రాల అవసరాలు, ప్రాధాన్యతలను పరిశీలిస్తుంది. ఆ తర్వాత ఈ యేడాది డిసెంబరు నాటికి ఒక నివేదికను తయారు చేసి కేంద్రానికి నివేదిస్తుంది. అందులోని మార్గదర్శకాలను 2020 ఏప్రిల్ నుంచి కేంద్రం అమలు చేయాల్సి ఉంటుంది.

4,5 తేదీల్లో హైదరాబాద్‌లో ఉన్నత విద్యా సదస్సు

● పలు రాష్ట్రాల నుంచి ప్రతినిధుల హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లో ఈనెల 4,5 తేదీల్లో కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంయుక్తంగా ఉన్నత విద్యా సదస్సును నిర్వహిస్తున్నాయి. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ఆర్ లింబాద్రి మాట్లాడుతూ ప్రపంచంలో విద్యారంగంలో వస్తున్న మార్పులు, సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తెలంగాణలో ఉన్నత విద్యారంగంలో తేవాల్సిన మార్పులపై చర్చిస్తామని చెప్పారు. మార్కెట్ అవసరాలు, ఉపాధి అవకాశాలు ప్రధాన అంశంగా చర్చలుంటాయని వివరించారు. పరిశ్రమలు, ఐటీ రంగానికి అనుగుణంగా ఎలాంటి కోర్సులు ప్రవేశపెడితే విద్యార్థులకు ప్రయోజనమో నిపుణులు పరిశీలిస్తారని అన్నారు. కాలేజీలను తప్పనిసరిగా పరిశ్రమలతో అనుసంధానం చేసే అంశాన్ని అధ్యయనం చేస్తామన్నారు. ఈ విద్యా సదస్సులో 50 మంది కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతోపాటు తెలంగాణ, రాజస్థాన్, మహారాష్ట్ర, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని అన్నారు.

మెట్రో రైలులో నిండు గర్భిణి మీద...

సెక్యూరిటీ గార్డుల దాడి

స్టాక్‌హోం: స్వీడన్‌లో నిండు గర్భిణీ మీద మెట్రో రైలు గార్డులు దాడికి పాల్పడ్డారు. చిన్నారి కూతురుతో ప్రయాణిస్తున్న ఆ నిండు గర్భిణీపై గార్డులు భౌతిక దాడికి పాల్పడిన ఘటనపై స్వీడన్‌లో ఆగ్రహావేశాలకు దారితీసింది. స్వీడన్ రాజధాని నగరం స్టాక్‌హోంలోని మెట్రోలో తన కూతురుతో పాటు ప్రయాణిస్తున్న ఆ మహిళ వద్ద టికెట్ లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో ఆమెకు, సెక్యూరిటీ గార్డులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత ఆమెను రైలు నుంచి బయటకు ఈడ్చుకొచ్చి బల్ల మీద పడేశారు.

ఈ ఘటనలో గాయపడిన గర్భిణిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను అక్కడే ఉన్న కొందరు మొబైల్‌లో చిత్రించి ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేశారు. దీంతో ఈ ఘటనపై పెద్దమొత్తంలో వ్యతిరేకత వచ్చింది. రవాణా సేవల విభాగం అధికారి ఒకరు స్వీడన్ మీడియాతో మాట్లాడుతూ "మెట్రోలో మహిళ మీద జరిగిన దాడిపై సెక్యూరిటీ గార్డులు జులుం ప్రదర్శించారని తెలిపారు.

ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు గార్డులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. దానిపై సమగ్ర విచారణ చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. "నిబంధనలను ఉల్లంఘించిన ప్రయాణికులెవరైనా వారిని మెట్రో నుంచి బయటకు పంపించడం, లేదా అదుపులోకి తీసుకోవడం సెక్యూరిటీ గార్డులు చేయాల్సిన పని. టికెట్ లేదని గుర్తించడంతో ఆమెను మెట్రో దిగాల్సిందిగా గార్డులు సూచించారు. కానీ ఆమె అందుకు నిరాకరించడంతో అదుపులోకి తీసుకునేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఆ గర్భిణి అరుపులు మొదలుపెట్టింది. ఈ దాడి ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తున్నాం" అని రవాణా సంస్థ మీడియాకు తెలిపింది.



'నల్లజాతీయుల మీద హింస'

ఆఫ్రికా మూలాలున్న స్వీడిష్ ప్రజల మీద ఇలాంటి దాడులు జరగడం కొత్తేమీ కాదనీ గతంలోనూ మెట్రోలో సెక్యూరిటీ గార్డులు ఇలాగే భౌతిక దాడులకు పాల్పడ్డారని స్వీడన్‌కు చెందిన జాతి వివక్ష వ్యతిరేక సంస్థ ఆక్షేపించింది.

"నల్ల జాతీయుల మీద అకారణంగా.. ఉద్దేశపూర్వకంగా సెక్యూరిటీ గార్డులు దాడులు చేస్తున్నారడానికి అనేక ఆధారాలు ఉన్నాయి" అని ఆ సంస్థ అధ్యక్షులు అలాన్ అలీ అన్నారు. జాతి వివక్ష గురించి, గర్భిణులతో ఎలా మెలగాలన్న విషయాల గురించి మెట్రో సిబ్బందికి, సెక్యూరిటీ గార్డులకు శిక్షణా తరగతులు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆస్ట్రేలియాను ముంచెత్తుతున్న వరదలు

- జలదిగ్బంధంలో టౌన్స్‌విల్లే నగరం



టౌన్స్‌విల్లే : మొన్నటివరకు ఎండలతో మండిపోయిన ఆస్ట్రేలియాను.. నేడు వరదలు ముంచెత్తుతున్నాయి. ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో క్వీన్స్‌లాండ్ రాష్ట్రంలోని టౌన్స్‌విల్లే నగరం జలదిగ్బంధమయ్యింది. దీంతో క్వీన్స్‌లాండ్ ప్రభుత్వం టౌన్స్‌విల్లేను డిజాస్టర్ జోన్‌గా ప్రకటించింది. లోతట్టు ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. డ్యాంలలో నీరు ప్రమాదకర స్థాయికి చేరకుంది. భూతాపాలు సంభవిస్తుండటంతో స్థానికులు దిక్కుతోచని పరిస్థితుల్లో పడవల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. ప్రభుత్వ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికతో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా చర్యలకు పూనుకుంది. క్వీన్స్‌లాండ్‌లో వరదముప్పు పొంచి ఉండటంతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న భారీ మార్పులు గ్లోబల్ వార్మింగ్ విపరిణామాలేనా? అని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యూఎస్‌లో అరెస్టయిన విద్యార్థుల కోసం ఎంబసీ హాట్ లైన్

వాషింగ్టన్: అమెరికాలో సంచలనం సృష్టించిన పే టు స్టే కుంభకోణంలో పోలీసులు అరెస్ట్ చేసిన విద్యార్థుల కోసం భారతీయ రాయబార కార్యాలయం హాట్ లైన్ ఏర్పాటు చేసింది. ఈ హాట్ లైన్ 24/7 పనిచేస్తుందని ఎంబసీ అధికారులు వెల్లడించారు. సుమారు 129మంది భారతీయ విద్యార్థుల్ని అరెస్టు చేసినట్టు అక్కడి యంత్రాంగం ప్రకటించింది. ఈ హాట్ లైన్‌లో 202-322-1199, 202-340-2590 నెంబర్లకు అరెస్ట్ అయిన విద్యార్థుల స్నేహితులు, కుటుంబ సభ్యులు ఎప్పుడైనా ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపింది. న్యూజెర్సీ, అట్లాంటా, హ్యూస్టన్, మిషి గాన్, కాలిఫోర్నియా, లూసియానా, నార్త్ కరోలినా, మిస్సోరి రాష్ట్రాల్లో ప్రత్యేక దాడులు నిర్వహించి విద్యార్థులను యూఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరం దరిపై పౌర వలస నిబంధనల చట్టం ప్రకారం అభియోగాలు నమోదు చేయ నున్నట్టు ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెల్లడించారు. అమెరి కాలో ఉంటున్న విదేశీ విద్యార్థులను పట్టుకునేందుకు ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ అధికారులు పార్మింగ్టన్ పేరుతో నకిలీ యూనివర్సిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

అమెరికాలో తెలుగు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి : సీపీఐ(ఎం)


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమెరికాలో సంక్షోభంలో చిక్కుకున్న తెలుగు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి చదువుకోవడానికి అమెరికా వెళ్లి నకిలీ విశ్వవిద్యాలయాల సంక్షోభంలో చిక్కుకున్న విద్యార్థుల సమస్యలను ఆ ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అమెరికా ఇమ్మిగ్రేషన్ స్టింగ్ ఆపరేషన్‌లో చిక్కుకున్న 600 మంది తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు వారెంట్లు జారీ చేయగా, 130 మందిని అరెస్టు చేయడంతోపాటు, జియోట్యాగ్‌తో వాళ్ల కాళ్లను బంధించి ఆ విద్యార్థులు ఎక్కువ దూరం ప్రయాణించకుండా ఆంక్షలు విధించారని తెలిపారు. దీంతో అనేక వ్యయప్రయాసలకు ఓర్చి పిల్లలు ఉన్నతంగా చదువుకుంటారని ఆశించి పంపిన తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవితవ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి ఇతర విశ్వవిద్యాలయాల్లో సీటు కల్పించేలా, ప్రస్తుతం తెలుగు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా అమెరికా ప్రభుత్వంతో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు.

చదువుతోనే జీవితం మార్పు

ప్రతి ఒక్కరూ నిత్యం నేర్చుకోవాల్సిందే

- దేశంలో తొలిసారి గురుకులాలను తెచ్చింది ఎన్టీఆరే
- సమాజానికి తిరిగి ఇవ్వడానికే ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా సేవ: ఏపీసీఎం, టీడీపీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ పిల్లలకు ఎంత ఆస్తి ఇచ్చామా? అనే ధోరణి నుంచి ఎంత మంచి చదువు చెప్పించామా అన్న అలోచనకు తల్లిదండ్రులు వచ్చారని, చదువుతో మంచి జీవితం సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని గండిపేటలో గల ఎన్టీఆర్ మోడల్ స్కూల్ వార్షికోత్సవం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. తొలుత విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ...దేశంలో పేదల కోసం తొలిసారి గురుకుల పాఠశాలలను తెచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావుకే దక్కుతుందని కొనియాడారు. ప్రస్తుత ఎన్టీఆర్ మోడల్ స్కూల్ ప్రాంగణం గతంలో టీడీపీ రాజకీయ శిక్షణా తరగతులకు అడ్డాగా ఉండేదని, తాను కూడా ఇక్కడ రోజులు తరబడి ఉండి రాజకీయ పాఠాలు నేర్చుకున్నానని గుర్తుకు చేసుకున్నారు. రాజకీయ నాయకులు తమకు అన్ని విషయాలు తెలియకున్నా తెలిసినట్టు నటిస్తారని, ఏవరైనా తెలియని విషయాన్ని తెలుసుకోవడంలో తప్పులేదని అన్నారు. తనకు కూడా చాలా విషయాలు తెలియవని, నిరంతర అధ్యయనం ద్వారా నేర్చుకుంటానని చెప్పారు. టీచర్లుగానీ, రాజకీయ నాయకులుగానీ, ఇంకెవరైనా నిరంతరం అధ్యయనం చేయాలని, లేనిపక్షంలో సమాజంలో ఇతరులతో పోటీపడలేరని హెచ్చరించారు. అవసరానికి అనుగుణంగా ఆలోచనలు తట్టితేనే ఉపయోగకరమన్నారు. 1984 ప్రాంతంలోనే 8 లక్షల ఫైళ్లను కంప్యూటరైజ్డ్ చేశామని గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం టెక్నాలజీ మారిందని, సెల్‌ఫోన్ ఉంటే అన్నీ దాంట్లోనే చేసే సామర్థ్యం నేటి యువతకు ఉందని అభిప్రాయపడ్డారు. టీచర్లు లేకపోయినా చదువుకునే స్థాయికి విద్యార్థులు ఎదిగారన్నారు. గతంలో టీచర్లు చెప్పేదే వేదమని, నేడు తప్పుచెబితే పసిగట్టి టీచర్లకే వివరించే స్థాయికి విద్యార్థులు ఎదిగారని అభిప్రాయపడ్డారు. క్లాసుల్లో యాంత్రికంగా బోధించడం వల్ల చదువుల్లో నాణ్యత కొరవడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆడియో, వీడియోల ద్వారా బోధిస్తూనే క్షేత్రస్థాయి పర్యటనలకు తీసుకెళ్తేనే విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని, విభిన్నంగా ఆలోచిస్తారని అన్నారు. ఐటీకి అధిక ప్రాధాన్యం ఇవ్వటం వల్లే నేడు హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చెందిందన్నారు. ఐటీ కారణంగా 25 నుంచి 300లకు పైగా ఇంజినీరింగ్ కళాశాలు పెరిగాయని గుర్తుచేశారు. అమెరికాలో, ఇతర దేశాల్లో ఐటీలో తెలుగువారు ఎక్కువగా రాణించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో టీడీపీ కార్యకర్తల పిల్లలనే చేర్చుకునేవారని, నేడు పేద పిల్లలందరికీ అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఇక్కడ చదువుకున్న పిల్లలు బయటి ప్రపంచంలో విస్తృతంగా రాణిస్తున్నారని పలు ఉదాహరణలను ప్రస్తావించారు. ఎన్టీఆర్ ఎడ్యుకేషన్ ట్రస్టును యూనివర్సిటీ స్థాయికి విస్తృతపరుస్తామన్నారు. తమను ఈ స్థాయికి తీసుకొచ్చిన సమాజానికి తిరిగి ఏదైనా ఇవ్వడానికే ఈ ట్రస్టు ద్వారా సేవ చేస్తున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు తనను నమ్మి రాజధాని అమరావతి నిర్మాణం కోసం 35 వేల ఎకరాలు ఇచ్చారని, అక్కడ అద్భుత నగరాన్ని తీర్చిదిద్దుతున్నామని అన్నారు. భువనేశ్వరి మాట్లాడుతూ..ప్రతి విద్యార్థికీ లక్ష్యం ఉండాలని సూచించారు. విద్యార్థులు సైనికులవలె కష్టపడాలని, లక్ష్యాన్ని చేరుకుంటే ఎంతో సంతోషంగా ఉంటుందని అన్నారు. వచ్చిన అవకాశాలను వినియోగించుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. తాము నేర్చుకున్నది ఇతరులకు పంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెరిటేడ్ ఫుడ్స్ అధ్యక్షులు సాంబశివరావు, ట్రస్ట్ సీఈఓ విష్ణువర్ధన్, సీవోఓ మోహన్‌రావు, ఎన్టీఆర్ మోడల్ స్కూల్ డైరెక్టర్ ఎస్‌ఎస్ ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దేశం మెచ్చేలా చేస్తాం

- మిషన్ భగరథపై ఇంజినీర్ ఇన్ చీఫ్ కృపాకర్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మిషన్ భగీరథ ప్రాజెక్టు నిర్మాణమే కాదు నిర్వహణ కూడా దేశం మెచ్చేలా చేస్తామని ఆ ప్రాజెక్టు ఇంజినీర్ ఇన్ చీఫ్ కృపాకర్‌రెడ్డి అన్నారు. ఆటంకాలు లేకుండా తాగునీటి సరఫరా చేసేందుకు అత్యాధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తామన్నారు. మిషన్ భగీరథ అపరేషన్, నిర్వహణ విధానం, విధివిధానాలపై గచ్చిబౌలి ఇస్కీలో జరుగుతున్న వర్క్ షాప్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడిన కృపాకర్‌రెడ్డి ఇంటివరకు శుద్ధిచేసిన మంచినీటిని అందించే బాధ్యత తమ ఇంజినీర్లదే అన్నారు. ఆర్వోనీళ్లు, క్యాన్‌వాటర్‌తో కలిగే దుష్పరిణామాలపై ప్రజలను చైతన్యపరుస్తామన్నారు. ఇందుకోసం ఉత్తమమైన తాగునీటి సరఫరా వ్యవస్థను తయారుచేస్తున్నామన్నారు. ఇదే లక్ష్యంతో మూడు రోజులగా ఇస్కీలో సమావేశమై...ఈ రంగంలోని నిష్ణాతులతో చర్చించామని వివరించారు. ఎన్నో కొత్త విషయాలను తెలుసుకున్నామని చెప్పారు. రిటైర్డ్ ఇంజినీర్లు, ప్రతిష్టాత్మక సంస్థల నుంచి విలువైన సలహాలు, సూచనలు వచ్చాయని, వాటన్నింటిని క్రోడీకరించి మంచి అపరేషన్, నిర్వహణ విధానాన్ని ఖరారు చేస్తామని తెలియజేశారు. అంతకుముందు పొద్దున ఇంటెక్ వెల్స్, ట్రీట్ మెంట్ ప్లాంట్లు, పైపులైన్ వ్యవస్థ నిర్వహణపై నిజామాబాద్ ఎస్.ఈ రాజేంద్రకుమార్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆ తర్వాత తాగునీటి రంగంలో అంతర్జాతీయంగా పేరుగాంచిన రిటైర్డ్ ఇంజినీర్ డాక్టర్ డి.ఎమ్. మోహన్ నిర్వహణలో ఎదురయ్యే సమస్యలపై మాట్లాడారు. వివిధ దేశాల్లో అమలుచేస్తున్న విధానాలను వివరించారు. ఎంతో దూరదృష్టితో తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన మిషన్ భగీరథతో ప్రజలకు వెలకట్టలేని మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ వర్క్‌షాప్ లో ప్రభుత్వ సలహాదారులు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజినీర్లు జగన్మోహన్ రెడ్డి, విజయపాల్ రెడ్డి, విజయప్రకాశ్, వినోభాదేవి, చిన్నారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్, కన్సల్టెంట్లు నర్సింగరావు, జగన్, మనోహర్ బాబుతో పాటు ఎస్.ఈ,ఈఈ, డీ.ఈ.ఈలు పాల్గొన్నారు.

దరఖాస్తును నాలుగు వారాల్లోగా పరిష్కరించండి

- రాష్ట్ర సమాచార కమిషన్‌కు హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమాచార హక్కు చట్టం కింద అప్పీల్ దరఖాస్తును నాలుగు వారాల్లోగా పరిష్కరించాలని రాష్ట్ర సమాచార కమిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పివి సంజయ్‌కుమార్ శనివారం ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని ప్రయివేటు ఆస్పత్రులు పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాయో సమాచారం ఇవ్వాలని హైదరాబాద్‌కు చెందిన ఎం శ్రీనివాస్ వైద్య విద్యాశాఖ సంచాలకుడికి దరఖాస్తు చేశారు. అధికారులు వివరాలు ఇవ్వకపోవడంతో రాష్ట్ర సమాచార కమిషన్‌లో అప్పీల్ చేశారు. దాఖలు చేసిన అప్పీల్ దరఖాస్తు సైతం పెండింగ్‌లోనే ఉంచారని ఆయన హైకోర్టును ఆశ్రయించారు. రెండేండ్ల క్రితం, గతేడాది సమాచార కమిషన్‌లో శ్రీనివాస్ రెండుసార్లు అప్పీల్ చేశారు. సమాచార కమిషన్ ఆ అప్పీల్‌ను విచారించి గతేడాది సెప్టెంబర్‌లో వైద్య విద్యాశాఖ డైరెక్టర్‌కు నోటీసులు ఇచ్చింది. అప్పటి నుంచి ఎలాంటి పురోగతి లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని ఆయన తరపున న్యాయవాది హైకోర్టు దష్టికి తెచ్చారు. అప్పీల్ దరఖాస్తుకు మోక్షం కల్పించకపోవడంపై హైకోర్టు అసహనాన్ని వ్యక్తం చేసింది. నాలుగు వారాల్లో పరిష్కరించాలని ఇటీవల హైకోర్టు కమిషన్‌ను ఆదేశించింది.

ప్రజాస్వామ్య గొంతు నొక్కుతున్నారు

మమతా బెనర్జీపై మోడీ విమర్శలు


- సభలో తొక్కిసలాట



దుర్గాపూర్/తకూర్‌నగర్/కోల్‌కతా : తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ బెంగాల్‌లో ప్రజాస్వామ్యం గొంతు నొక్కుతున్నా రని ప్రధాని మోడీ విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూ ర్‌లో ప్రధాని శనివారం మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారని అన్నారు. మమత బెనర్జీకి ఎన్నికల భయం పట్టుకుందని, అందుకే తమ పార్టీని ఎదుర్కొనేందుకు ప్రతి పక్షాల కూటమి ఏర్పాటుకు యత్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. 'టోల్‌బాజి పన్ను'తో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న తృణమూల్ ప్రభుత్వం మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలకు విఘాతం కలిగించిం దని, తృణమూల్ కార్యకర్తలు తరుచూ తమ కార్యకర్తలపై దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. దేశానికి స్వాతంత్ర్య వచ్చి దశాబ్దాలు గడిచిన తరువాత కూడా రాష్ట్రంలోని గ్రామాలు నిర్లక్ష్యానికి గురికావడం దురదృష్టకరమన్నారు. కాగా మోడీ పాల్గొన్న ర్యాలీలో తొక్కిసలాట జరగడంతో బ్యారికేడ్లు ధ్వంసమై మహిళలు, పిల్లలతో సహా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి.

ఆనంద్ తేల్‌తుంబ్డే అరెస్టు చట్టవ్యతిరేకం

- పూణె కోర్టు ఆదేశాలతో విడుదల



ముంబయి : పోలీసుల అత్యుత్సాహంపై పూణె కోర్టు తీవ్రంగా స్పందించింది. హక్కుల కార్యకర్త, గోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ ఆనంద్ తేల్‌తుంబ్డేను శనివారం ఉదయం పోలీసులు అరెస్టు చేయడం చట్టవ్యతిరేకమని కోర్టు తెలిపింది. నాలుగు వారాలపాటు ఆయనను అరెస్టు చేయకుండా గతనెల 14న సుప్రీంకోర్టు ఇచ్చిన ప్రొటెక్షన్ గడువు ముగియకముందే పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు తేల్‌తుంబ్డేను పోలీసులు విడుదల చేశారు. కేరళ నుంచి వస్తున్న ఆనంద్ తేల్‌తుంబ్డేను మహారాష్ట్రలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉదయం 3.30 గంటలకు ముంబయి పోలీసులు అరెస్టు చేసి పూణె పోలీసులకు అప్పగించారు. కాగా, పూణె పోలీసులు సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించారని తేల్‌తుంబ్డే తరపు న్యాయవాది రోహన్ నాహర్ వ్యాఖ్యానించారు. ఈ నెల 11 వరకు ఆయనకు పోలీసు అరస్టు నుంచి సుప్రీంకోర్టు భద్రతనిచ్చిందని, అయినప్పటికీ ఆయనను పోలీసులు అరెస్టు చేయడం కోర్టు ధిక్కారమని, చట్టవ్యతిరేకమని అన్నారు. తేల్‌తుంబ్డే ముందస్తు బెయిల్‌ను తొసిపుచ్చిన తర్వాతి రోజునే పూణె కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. భీమా కోరేగావ్ కేసుకు సంబంధించి గతేడాది ఆగస్టులో దేశంలోని పలునగరాల్లో ఏడుగురు కార్యకర్తల ఇండ్లల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ఏడుగురు హక్కుల కార్యకర్తల్లో ఆనంద్ తేల్‌తుంబ్డే ఒకరు.

ఈవీఎంలు ఎందుకు తెరిచారు ?

వికారాబాద్ కలెక్టర్, డీఆర్వో తీరుపై ఆందోళన

- పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్

కోర్టులో కేసు నడుస్తుండగా గోదాంలో భద్రపర్చిన ఈవీఎం, వీవీ ప్యాట్‌లను ఎందుకు తెరిచారని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలను, స్లిప్పులను అధికారులు తెరవడాన్ని నిరసిస్తూ వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో శనివారం ధర్నా చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి కలెక్టర్, డీఆర్వో ఎమ్మెల్యేలపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఉపయోగించిన ఈవీఎంలను వికారాబాద్ మార్కెట్ యార్డులో గల గోదాంలో భద్రపరిచారని తెలిపారు. అయితే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా వాటిని జిల్లా కలెక్టర్ ఒమర్ జలీల్, ఇతర అధికారులు శుక్రవారం పరిశీలించారని అన్నారు. ఈ మిషన్‌లో టాంపరింగ్ జరిగిందని జనవరి 24న కాంగ్రెస్ అధిష్టానం హైకోర్టులో కేసు వేసిందని గుర్తుచేశారు. హైకోర్టు ఆదేశాలను బేఖాతర్ చేస్తూ అధికారులు కుమ్మక్కై వివాదంలో ఉన్న ఈవీఎంలను ఓపెన్ చేయడం చట్ట విరుద్ధమన్నారు.

వికారాబాద్ కలెక్టర్‌ను సస్పెండ్ చేయాలి : భట్టి

ఎన్నికల పిటిషన్ కోర్టులో ఉందని తెలిసి కూడా ఈవీఎంలను తెరిచిన వికారాబాద్ జిల్లా కలెక్టర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ప్రతిపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. ఈవీఎంలను తెరవడం వల్ల తమకు అనుమానాలు బలపడుతున్నాయని చెప్పారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

శనివారం గాంధీభవన్‌లో మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, పార్టీ నేతలు శ్యామ్‌మెహన్, నిరంజన్ తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈవీఎంలపై వెల్లువెత్తుతున్న అనుమానాలను నివృత్తి చేయాలని ఈసీని కోరారు. నాంపల్లి నియోజకవర్గంలో ఓపీ రావత్ ఓట్ నమోదు చేసిన అధికారులపై చర్య తీసుకోవాలని మర్రి శశిధర్‌రెడ్డి కోరారు.

మూడో రోజూ పనులడ్డగింత

- మల్లన్నసాగర్ నిర్వాసితుల ఆందోళన

నవతెలంగాణ-కొండపాక

సిద్దిపేట జిల్లా కొండపాక మండలం ఎర్రవల్లి, సింగారం గ్రామాల పరిధిలో నిర్మిస్తున్న మల్లన్నసాగర్ ప్రాజెక్టు పనులను నిర్వాసితులు వరుసగా మూడోరోజూ అడ్డుకున్నారు. తొగుట మండలం వేములఘాట్ రైతులకు ఇచ్చిన విధంగానే తమకూ పరిహారం ఇవ్వాలని కోరుతూ గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించినా ప్రభుత్వం నుంచి హామీ రాకపోవడంతో శనివారం కూడా ఆందోళన చేశారు. పనులు చేసే వాహనాలకు అడ్డుగా కూర్చున్నారు. సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమకు న్యాయమైన పరిహారం చెల్లించే వరకూ పనులడ్డుకుంటామని హెచ్చరించారు.

కార్మిక, కర్షకులకు భవిష్యత్ లేని కేంద్ర బడ్జెట్ : ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ వల్ల కార్మికులు, కర్షకులకు భవిష్యత్ లేదని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఐఎఫ్‌టీయూ) విమర్శించింది. ఈ మేరకు ఐఎఫ్‌టీయూ నేత కె సూర్యం శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు అండ ఇవ్వలేదని తెలిపారు. రైతాంగానికి, కార్మికవర్గానికి భద్రత లేదని పేర్కొన్నారు. రైతాంగాన్ని రక్షించే లక్ష్యం ఉన్న ప్రభుత్వాలు స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగం పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ఆర్థిక విధానాలుండాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎకరాకు రూ.6 వేలు మూడు దఫాలుగా చెల్లించడం వల్ల రైతులకు విశ్వాసం కలిగించబోదని పేర్కొన్నారు.

ఇది రైతాంగానికి గొప్పవరం అని ప్రకటించడం సిగ్గు చేటని తెలిపారు. రాష్ట్రీయ కామధేను ఆయోగ్ గోకుల్ మిషన్‌కు రూ.750 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. అదే 40 కోట్ల మంది అసంఘటిత కార్మి కుల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటా యించిందని తెలిపారు. మనిషి లేనిదే గోవు లేదని పేర్కొన్నారు. కానీ మనిషి సౌభాగ్యం కన్నా గోవు సౌభాగ్యం ముఖ్యమా?అని కేంద్రాన్ని ప్రశ్నిం చారు. ఇది ప్రజల అవసరాలు తీర్చే బడ్జెట్ కాదనీ, కార్పొరేట్ సంస్థలకు అండదండలి స్తుందనీ తెలిపారు.

పింఛనర్ల అధ్యయన నివేదిక

బహిర్గతం చేయాలి

- 7న పీఎఫ్, 8 న ఇందిరాపార్క్ వద్ద అర్ధనగ్న ప్రదర్శన : తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పింఛనర్లకు సంబంధించి హైఇంపవర్డ్ మానిటరింగ్ కమిటీ నివేదిక వెంటనే బహిరంగపర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7న పీఎఫ్ కార్యాలయం, 8న ఇందిరాపార్క్ వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించనున్నట్టు తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రకటించింది. జనవరి 4, 2018లో ఆరుగురు సభ్యులు, చైర్మెన్‌తో కూడిన హైఇంపవర్డ్ కమిటీని ప్రభుత్వం నియమించిందని, కమిటీ నివేదికను అక్టోబరులో సమర్పిస్తున్నట్టు కార్మిక మంత్రి ప్రకటించిన నేపథ్యంలో ఆ నివేదికను బహిరంగ పర్చాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షులు పి. కృష్ణమూర్తి మాట్లాడుతూ కమిటీని ప్రతి మూడు నెలలకోసారి పొడిగించడం సరైంది కాదన్నారు. పెన్షన్‌పై కమిటీ అధ్యయనం చేసిన నివేదికను తెలియపర్చాలని కోరారు. తమ విజ్ఞప్తిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కనీస పెన్షన్‌గా రూ. 9 వేలు ప్రకటించాలని, ప్రతి మూడు నెలలకు కరువు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షులు డాక్టర్.ఎఆర్‌కె చౌదరి మాట్లాడుతూ ఇపిఎఫ్ కంట్రిబ్యూషన్‌పై రూ. 15 వేల సీలింగ్ ఎత్తివేయాలని ప్రోరేట్ పెన్షన్ కాకుండా ఒకే పెన్షన్‌గా లెక్కగట్టాలని డిమాండ్ చేశారు. పెన్షన్ జీతం ప్రాతిపదిక ఏడాది పొడవునా ఉండాలని సూచించారు. అమ్ముకున్న పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎంఎన్ రెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శి పి. నారాయణరెడ్డి, ఎన్. బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.



ఆనంద్ తేల్‌తుంబ్డే అరెస్టుకు న్యూడెమోక్రసీ ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యాహక్కుల నేత ప్రొఫెసర్ ఆనంద్ తేల్‌తుంబ్డేను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తీవ్రంగా ఖండించింది.

ఈ మేరకు న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి డివి కృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి పి రంగారావు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆనంద్ తేల్‌తుంబ్డేను శనివారం తెల్లవారుజామున ముంబాయి ఎయిర్‌పోర్టులో మహారాష్ట్ర పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. ఇది మోడీ ప్రభుత్వ కుట్రలో భాగమేనని పేర్కొన్నారు. మానవ హక్కుల కార్యకర్తలు, ప్రజా ఉద్యమాల్లో పాల్గొనే వారిని, ప్రజా సంఘాలకు నాయకత్వం వహించే వారిని కొంత మందిని ఎంపిక చేసి అర్బన్ నక్సల్స్ పేరుతో అరెస్టు చేస్తున్నారని తెలిపారు. భీమా కోరెగాం ఘటనలో వారి పాత్ర ఉందని ఆరోపించి, మోడీ హత్యకు కుట్ర పన్నారనే తప్పుడు ఆరోపణపై అన్‌లాఫుల్ ఆక్టివిటీస్ (ప్రివెన్షన్) యాక్ట్ (ఉపా) మోపడానికి మోడీ ప్రభుత్వం కుట్ర పన్నిందని పేర్కొన్నారు. భీమా కోరెగాం ఘటనను పీష్వాలకు, దళితులకు మధ్య జరిగిన ఘటనగా చూడొద్దని, ఆ ఘటనను విభేదించింది ఆనంద్ తేల్‌తుంబ్డే అని తెలిపారు. ఇలాంటి వ్యక్తిపై ఉపా వంటి చట్టం నమోదు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. తక్షణమే ఆ కేసును ఎత్తివేసి, తేల్‌తుంబ్డేను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నవచిత్రం

త్వరలోనే నయా చిత్రం షురూ


నాగశౌర్య

నాగశౌర్య హీరోగా సుకుమార్ దర్శకత్వ శాఖలో పనిచేసిన కాశీ విశాల్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందబోతుంది. సుకుమార్ రైటింగ్స్, నార్త్ స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై సుకుమార్, శరత్ మరార్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం గురించి యూనిట్ చెబుతూ, 'బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ తన సుకుమార్ రైటింగ్స్ బ్యానర్ ద్వారా నూతన దర్శకులను ప్రోత్సహిస్తున్న విషయం విదితమే. తాజాగా నాగశౌర్య హీరోగా ఓ కొత్త సినిమాని తెరకెక్కించబోతున్నారు. త్వరలో సినిమా ప్రారంభం కానుంది. నవ్య కథాంశంతో సినిమా ఉండబోతోంది. సినిమాలో నటించే నటీనటులు, టెక్నీషియన్లతోపాటు పూర్తి వివరాలను త్వరలోనే తెలియజేస్తాం' అని తెలిపింది.

డిఫరెంట్ హర్రర్ సినిమా


సచిన్ జోషి

సచిన్ జోషి హీరోగా నటించిన చిత్రం 'అమావాస్య'. నర్గీస్ ఫక్రీ కథానాయికగా నటించగా, భూషణ్ పటేల్ దర్శకత్వం వహించారు. తెలుగు, హిందీలో బైలింగ్వల్‌గా రూపొందిన ఈ సినిమా ఈ నెల 8న విడుదల కానుంది.

ఈ సందర్భంగా సచిన్ జోషి మాట్లాడుతూ, 'హర్రర్ జోనర్ నా ఫేవరేట్. చాలా రోజులుగా హర్రర్ కామెడీ సినిమా చేయాలని ఉంది. రెగ్యులర్ హర్రర్ చిత్రాలకి పూర్తి భిన్నమైన సినిమా. న్యూ ఏజ్ క్లాసిక్ హర్రర్. హర్రర్ సినిమాలకి ఇండియాలోనే ఇప్పటి వరకు వాడని వీఎఫ్ఎక్స్ ఇందులో వాడుతున్నాం. స్క్రీన్‌ప్లే డిఫరెంట్‌గా ఉంటుంది. సినిమాకి కథే ప్రధాన బలం. మంచి కథ ఉంటే, ఆటోమేటిక్‌గ్గా మంచి మ్యూజిక్, విజువల్స్, ఆర్టిస్టులు కుదురుతారు. ఇందులో నేను కరణ్ పాత్రలో కనిపిస్తాను. హీరోయిన్‌ని పెళ్ళి చేసుకోవాలని ప్రపోజ్ చేస్తా. వేసవి టైమ్‌లో హాలీడేస్‌లో భాగంగా దూరంగా ఉండే ఓ భవనానికి వెళ్తాం. అందులోకి వెళ్ళాక అమావాస్య రాత్రి సమయంలో ఏం జరిగిందనేది సినిమా. పూర్తి హర్రర్ ఎంటర్‌టైనర్‌గా సాగుతుంది. హై టెక్నికల్‌గా తెరకెక్కించాం. దర్శకుడు భూషణ్ పటేల్ హిందీలో చాలా పాపులర్. 'రాగిని ఎంఎంఎస్', 'ఎలోన్', '1920: ఎవిల్ రిటర్న్స్' వంటి హర్రర్ చిత్రాలు రూపొందించారు. కచ్చితంగా ఆడియెన్స్‌కి నచ్చుతుంది. నేను చేసే ప్రతి సినిమా తెలుగులో విడుదలవ్వాలనుకుంటాను. నా ఫస్ట్ ప్రయారిటీ తెలుగు. అందుకే ఈ సినిమా హిందీతోపాటు తెలుగులోనూ తెరకెక్కించాం. చేసే ప్రతి సినిమా భిన్నంగా, ఔట్ ఆఫ్ ది బాక్స్ ఉండాలనుకుంటున్నా. హీరో, నిర్మాత అనేవి రెండూ పూర్తి భిన్నం. రెమ్యూనరేషన్ తీసుకోవడానికి, ఇవ్వడానికి చాలా తేడా ఉంది' అని అన్నారు. 'సినిమాకి బెస్ట్ వీఎఫ్ఎక్స్ వాడాం. అవి సరికొత్త అనుభూతినిస్తాయి. సచిన్‌తో సినిమా చేయాలని నేను, నాతో సినిమా చేయాలని ఆయన చాలా రోజులుగా అనుకుంటున్నాం. ఫైనల్‌గా కుదిరింది. సినిమా చాలా బాగా వచ్చింది' అని దర్శకుడు తెలిపారు. 'తెలుగంటే నాకు చాలా ఇష్టం. హెవీ హర్రర్‌తో సాగే క్రమంలో నా పాత్ర కామెడీతో కాస్త రిలీఫ్‌నిస్తుంది' అని కమెడీయన్ అలీ అస్గర్ చెప్పారు.

హిందీలో ఖాకి రీమేక్..!


అక్షయ్‌కుమార్, రోహిత్ శెట్టి

ఏడాదికి మూడు, నాలుగు సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉంటారు అక్షయ్ కుమార్. నిజం చెప్పాలంటే ఆయనే ఓ మినీ ఇండస్ట్రీ. ఇప్పటికే నాలుగు సినిమాలతో బిజీగా ఉన్నారు. త్వరలో రోహిత్ శెట్టి దర్శకత్వంలో ఓ సినిమా చేసేందుకు సిద్ధమవుతున్నారు. 'సూర్యవంశీ' పేరుతో రూపొందనున్న ఈ సినిమా తమిళ చిత్రానికి రీమేక్ అని తెలుస్తోంది. రెండేండ్ల క్రితం కార్తి, రకుల్ ప్రీత్ సింగ్ జంటగా రూపొందిన 'ఖాకి' (ధీరన్ అధికారమ్ ఒంద్రు) చిత్రం విడుదలై ఘన విజయం సాధించింది. పోలీస్ బ్యాక్‌డ్రాప్‌లోసాగే క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రమిది. తాజాగా దీన్ని అక్షయ్ కుమార్ హీరోగా 'సూర్యవంశీ' పేరుతో రీమేక్ చేయాలని రోహిత్ శెట్టి భావిస్తున్నారు. ఈ చిత్ర కథ యూనివర్సల్‌గా ఉండటంతో బాలీవుడ్ ఆడియెన్స్‌కి బాగా కనెక్ట్ అవుతుందనే భావనలో చిత్ర యూనిట్ ఉందట. అక్షయ్ ప్రస్తుతం 'కేసరి', 'హౌస్‌ఫుల్ 4', 'మిషన్ మంగళ్', 'గుడ్ న్యూస్' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు.

సమకాలీన రాజకీయ నేపథ్యంలో నేనే ముఖ్యమంత్రి


వాయుతనయ్

వైష్ణవి ఫిల్మ్స్, ఆలూరి క్రియేషన్స్ పతాకాలపై అట్లూరి నారాయణరావు, ఆలూరి సాంబశివరావు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'నేనే ముఖ్యమంత్రి'. దేవి ప్రసాద్, వాయు తనయ్, శశి, సుచిత్ర ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న ఈ చిత్రానికి మోహన్ రావిపాటి దర్శకత్వం వహిస్తున్నారు. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి నిర్మాత అల్లూరి నారాయణరావు మాట్లాడుతూ, 'సమకాలీన రాజకీయ నేపథ్యంలో సినిమాని రూపొందించాం. అన్ని వర్గాలకి నచ్చే అంశాలతోపాటు అందర్నీ ఆలోచింపచేసేలా సన్నివేశాలు, డైలాగులు ఉంటాయి. దేవిప్రసాద్, వాయుతనయ్, శశి, సుచిత్ర అద్భుతమైన నటన ప్రదర్శించారు. సంగీతానికి మంచి ప్రాధాన్యం ఉన్న చిత్రమిది. ప్రేక్షకులకి నచ్చుతుందన్న నమ్మకంతో ఉన్నాం' అని అన్నారు.
'నేటి సమాజంలోని రాజకీయ పరిస్థితులని అద్దం పట్టేలా సినిమా ఉంటుంది. అనుకున్న దానికంటే సినిమా చాలా బాగా వచ్చింది. దర్శకుడు పర్‌ఫెక్ట్ ప్లానింగ్‌తో ఇబ్బంది లేకుండా తెరకెక్కించాడు. ఇప్పటికే విడుదలైన పాటలకి, టీజర్‌కి రెస్పాన్స్ బాగుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ నెల 8న సినిమాని గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం' అని మరో నిర్మాత ఆలూరి సాంబశివరావు చెప్పారు.

వైభవంగా యాత్ర ప్రీ రిలీజ్ వేడుక


కృష్ణకుమార్, మహి.వి.రాఘవ్, మమ్ముట్టి, విజయ్ చిల్లా, అశ్రిత

'తెలుగు భాషంటే నాకు చాలా ఇష్టం. తెలుగుని 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని పిలుస్తారు. ఇది పొయెటిక్ లాంగ్వేజ్. అందుకే నాకిష్టం' అని మమ్ముట్టి అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'యాత్ర'. వైఎస్ పాత్రలో మమ్ముట్టి నటిస్తున్న ఈ చిత్రానికి మహి వి రాఘవ్ దర్శకత్వం వహించారు. 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై శశిదేవి రెడ్డి, విజయ్ చిల్లా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది.
ఈ సందర్భంగా మమ్ముట్టి మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం కష్టపడి తెలుగు నేర్చుకున్నా. శ్యామ్ దత్ ఈ సినిమా గురించి చెప్పాడు. రాఘవ్ చెప్పిన కథ బాగా నచ్చింది. 21ఏండ్ల తర్వాత తెలుగులో సినిమా చేయడం చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. తెలుగులో నాకిది మూడో సినిమా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన పాదయాత్ర ప్రధానంగా సినిమా తెరకెక్కింది. సినిమా షూటింగ్ ప్రారంభానికి ముందే స్క్రిప్ట్ తీసుకుని నేర్చుకున్నా. వైఎస్‌ని అందరూ గుండెల్లో పెట్టుకున్నారు. నన్ను కూడా కాస్త పెట్టుకుంటారని భావిస్తున్నా. ఆయన్ని ప్రేమించిన దాంట్లో నన్ను ఒక్క శాతం ప్రేమిస్తే చాలు. మేం చేయాల్సిన పని పూర్తయ్యింది. ఫలితం ఆడియెన్స్ చేతుల్లో ఉంది' అని అన్నారు.
'శ్యామ్ దత్ వల్లే ఈ సినిమా సెట్ అయ్యింది. మమ్ముట్టి ఈ కథని నమ్మడమే కాదు, గొప్ప సపోర్ట్ అందించారు. టెక్నీషియన్లు సినిమాటోగ్రాఫర్ సత్య, మ్యూజిక్ డైరెక్టర్ కె, ఆర్ట్ డైరెక్టర్ రామకృష్ణ, మోనిక, ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ సినిమాకి బ్యాక్‌బోన్‌లా నిలిచారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి ఐదు సందర్భానుసారమైన పాటలను రాశారు. పెంచలదాస్‌కి థ్యాంక్స్. దర్శకుడు మహి మనసున్న వ్యక్తి. వైఎస్ ఫ్యాన్సే కాదు, ప్రతి కుటుంబం చూడాల్సిన చిత్రమిది. ఈ నెల 8న విడుదల చేస్తున్నాం' అని నిర్మాత విజయ్ చిల్లా తెలిపారు.
చిత్ర దర్శకుడు మహి. వి రాఘవ్ చెబుతూ, 'మమ్ముట్టికి ఎప్పటికీ రుణ పడి ఉంటా. ఆయనతో పనిచేసే అవకాశం కల్పించినందుకు థ్యాంక్స్. ఓ మెంటర్‌లా నన్ను నడిపించారు. ఈ చిత్రానికి సంబంధించి కథ మాత్రమే నాది, మిగతాదంతా టీమ్ వర్క్. ఆర్టిస్టులు, టెక్నీషియన్లు అన్ని విధాలుగా సపోర్ట్ అందించారు. సత్య అందమైన విజువల్స్ అందించారు. కె అందించిన సంగీతానికి మంచి స్పందన లభిస్తోంది. నేను దర్శకుడిగా మారడానికి విజయ్, శశినే కారణం. మా అమ్మది కడప దగ్గర చిన్న ఊరు. అక్కడ పుట్టడం వల్లే మాకున్న ఓర్చుకునే బలం, ఓపిక మరొకరికి ఉండదు. జగన్ అన్నా, నేను ఎక్కడైనా దూకిన తర్వాత ఆలోచిద్దాంలే అనుకునే టైప్. స్క్రిప్ట్ రాశా. మమ్ముట్టి రెడీ అయ్యారు. పాదయాత్రలో ఉన్న జగన్ అన్నని కలిసి, ఈ సినిమా గురించి చెప్పా. 'మా నాయన ఏం చేశాడో చూపించు, ఆయన చేయని దానికి క్రెడిట్ ఆపాదించొద్దు' అన్నారు. అది ఆయన గొప్పతనం. ఈ ఫంక్షన్‌కి ఎవరినైనా స్పెషల్ గెస్ట్‌లను పిలుద్దామనుకున్నా. కానీ ఆయన అభిమానులను పిలవాలని నిర్ణయించుకున్నాం. ఇది అందరి సినిమా. ఎమోషనల్‌గా, నిజాయితీగా ఉండే చిత్రం. చూసినప్పుడు అంతా రియల్‌గానే ఫీలవుతారు. ఈ చిత్రాన్ని ఆదరిస్తారని ఆశిస్తున్నా' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుధీర్‌బాబు, ఆశ్రిత, యలమంచిలి రవి, కె.ఎల్.దామోదర్ ప్రసాద్, మ్యూజిక్ డైరెక్టర్ కె, శ్రీరామ్ ఆదిత్య తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.


రకుల్ ప్రీత్ సింగ్

ఇదంతా తదుపరి సినిమా కోసమే..

ఏరియల్(గాల్లో) యోగాని ప్రాక్టీస్ చేస్తున్న రకుల్ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ సందర్భంగా రకుల్ స్పందిస్తూ, 'ఫిజికల్‌గా ఫిట్‌గా ఉండటం కోసం జిమ్‌కి వెళ్తాను. అయితే ఎప్పుడూ యోగా ప్రయత్నించలేదు. కానీ ఏరియల్ యోగా అంటే ఇష్టం. ఇప్పుడు అదే నేర్చుకుంటున్నా. రెగ్యులర్ యోగాతో పోలిస్తే ఇది చాలా డిఫరెంట్‌గా, ఛాలెంజింగ్‌గా ఉంటుంది. దీనికి చాలా సామర్థ్యం కావాలి. ఓ పద్ధతి ప్రకారం పూర్తి ఏకాగ్రతతో ప్రయత్నం చేయాల్సి ఉంది. ఈ యోగా చేసే పద్ధతిని బాగా ఎంజాయ్ చేస్తున్నా. ఇప్పటి వరకు నన్ను గ్లామర్ సైడ్ మాత్రమే చూశారు. త్వరలో నటన సైడ్ కూడా చూస్తారు. ఈ యోగా ఎందుకు చేస్తున్నానో త్వరలో మీకే తెలుస్తుంది' అని తెలిపింది. రకుల్ ప్రస్తుతం 'దేవ్', 'ఎన్జీకే', 'దే దే ప్యార్ దే', 'మార్జావాన్', 'వెంకీ మామ'తోపాటు శివకార్తికేయన్ సినిమాలోనూ నటిస్తూ బిజీగా ఉంది.



ప్రేక్షకులను ఆద్యంతం థ్రిల్ చేసే ఎం 6


విశ్వనాథ్ తన్నీరు

ధ్రువ, అశ్విని జంటగా జైరాం వర్మ దర్శకత్వంలో విశ్వనాథ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, శ్రీ లక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ పతాకాలపై విశ్వనాథ్ తన్నీరు నిర్మించిన చిత్రం 'ఎం6'. ఈ నెల 8న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత విశ్వనాథ్ మాట్లాడుతూ, 'నటుడిని అవ్వాలనే కోరికతో చిత్ర పరిశ్రమలోకి వచ్చాను. మొదట్లో కొన్ని టీవీ సీరియల్స్‌లో నటించడంతోపాటు, నిర్మించాను. అలాగే పలు సినిమాలకి దర్శకత్వ శాఖలో పనిచేశాను. ఈ చిత్రాన్ని కూడా నిర్మించా. ఇదొక హర్రర్, కామెడీ థ్రిల్లర్. క్వాలిటీ విషయంలో రాజీ పడకుండా నిర్మించాం. దర్శకుడు ఎంచుకున్న పాయింట్ ఆస్తికరంగా ఉంటుంది. సినిమాకి కథే హీరో. అందరికి నచ్చే కథాంశమిది. ఇలాంటి సినిమాలకి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ చాలా ముఖ్యం. దానికి తగ్గట్టుగానే ఆర్‌ఆర్ బాగా కుదిరింది. ఈ సినిమా చూస్తున్నంత సేపు ప్రేక్షకులు ఎక్కడా బోర్ ఫీలవ్వరు. ఉత్కంఠకి గురి అవుతారు. అనుకోకుండా వచ్చే మలుపులు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటాయి. నటీనటులు కొత్తవారైనా బాగా నటించారు. సినిమాలోని 'ఈ క్షణం' అనే మెలోడియస్ పాటని అరకు, మంగుళూరులోని సుందరమైన లొకేషన్లలో చిత్రీకరించాం. దానికి మంచి స్పందన లభించింది. ఈ చిత్రానికి 'ఎం6' అనే డిఫరెంట్ టైటిల్ ఎందుకు పెట్టామనేది సినిమా చూస్తే తెలుస్తుంది. నా అభిమాన దర్శకులు వి.వి.వినాయక్ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేయడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. మా సినిమాని ప్రేక్షక దేవుళ్ళు ఆదరిస్తారని ఆశిస్తున్నా. చిన్న చిత్రాలను ఆదరించినప్పుడే మరిన్ని చిత్రాలు నిర్మించటానికి వీలుంటుంది. దీంతోపాటు నా స్వీయ దర్శకత్వంలో ఓ సినిమా ప్లాన్ చేస్తున్నాను' అని అన్నారు.

న్యూ స్టయిల్లో ఉండే స్పెషల్ సాంగ్..


కృతి సనన్

గతేడాది 'స్త్రీ' చిత్రంలో ప్రత్యేక పాటలో కృతి సనన్ డాన్స్ చేసి ఉర్రూతలూగించింది. త్వరలో మరోసారి ఓ స్పెషల్ సాంగ్‌తో ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేయబోతోంది. వరుణ్ ధావన్, ఆదిత్య కపూర్‌లతో కలిసి ఓ స్పెషల్ సాంగ్‌లో కృతి నటించనుంది. మాధురీ దీక్షిత్, సంజయ్ దత్, సోనాక్షి సిన్హా, అలియా భట్, వరుణ్ ధావన్, ఆదిత్య రాయ్ కపూర్, కునాల్ కెమ్ము ప్రధాన పాత్రధారులుగా అభిషేక్ వర్మన్ దర్శకత్వంలో పీరియడ్ డ్రామా 'కళంక్' తెరకెక్కుతోంది. కరణ్ జోహార్, సాజిద్ నడియడ్‌వాలా నిర్మిస్తున్న ఈ చిత్రంలోని మరో ప్రత్యేక పాటలో కైరా అద్వానీ కూడా మెరవనుంది. దీంతోపాటు ఉన్న స్పెషల్ సాంగ్‌లో కృతి సిల్వర్ స్క్రీన్ మీద మ్యాజిక్ చేయనుందట. ఈ పాటని ఇటీవలే వరుణ్ ధావన్, ఆదిత్య రాయ్ కపూర్, కృతి సనన్‌లపై చిత్రీకరించినట్టు సమాచారం. న్యూ స్టయిల్‌లో ఉండే స్పెషల్ సాంగ్‌గా చూసిన ప్రతి ఒక్కరూ అప్రిషియేట్ చేస్తారనే నమ్మకంతో చిత్రయూనిట్ ఉందట. ఏప్రిల్ 19న ఈ చిత్రం ప్రేక్షకులు ముందుకు రానుంది. కృతి దీంతోపాటు ప్రస్తుతం 'లుక్కా చుప్పి', 'అర్జున్ పాటియాలా', 'హౌస్‌ఫుల్ 4', 'పానిపట్' చిత్రాల్లో భిన్న పాత్రలు పోషిస్తోంది.

సెన్సార్ వాళ్ళు కారణాలు చెప్పాల్సిందే


కె.టి.నాయక్, బెనర్జీ, వెంకట్, ముత్యాల రాందాస్, డీఎస్‌రావు తదితరులు

బెనర్జీ, వెంకట్, సుమన్ రఘునాథన్, ముమైత్ ఖాన్, సంజీవ్ కుమార్, అరుణ్ బచ్చన్, డిఎస్ రావు, రాక్‌లైన్ సుధాకర్ వంటి వారు ప్రధాన పాత్రధారులుగా కె.టి.నాయక్ దర్శకత్వంలో వెంకట్ మూవీస్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ నిర్మిస్తున్న చిత్రం 'దండుపాళ్యం 4'. కన్నడ, తమిళంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని తెలుగు, మలయాళం, హిందీలో డబ్బింగ్ చేయబోతున్నారు.
కన్నడ వెర్షన్‌కి సంబంధించి సెన్సార్ సమస్య తలెత్తడంతో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నిర్మాత వెంకట్ మాట్లాడుతూ, 'గతేడాది జూన్‌లో చిత్ర ఫస్ట్‌లుక్ విడుదల చేశాం. దానికి మంచి స్పందన లభించింది. ఇందులో ఆర్టిస్టులంతా సహజంగా నటించారు. సినిమా చాలా 'రా' గా ఉంటుంది. చిత్రీకరణ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ ఫిబ్రవరిలో విడుదల చేయాలనుకున్నాం. గతేడాది నవంబర్ 8న కన్నడలో సెన్సార్‌కి అప్లై చేశాం. కానీ సెన్సార్ అధికారి ఎలాంటి కట్స్ చెప్పకుండా సినిమాని తిరస్కరించారు. తిరస్కరించడానికి కారణాలేంటో చెప్పడం లేదు. దీనిపై మేం రివైజింగ్ కమిటీకి(ఆర్‌సీ) వెళ్తున్నాం. అక్కడ కాకపోతే ట్రిబ్యూనల్‌కి వెళ్తాం. దీంతో సినిమా విడుదల ఆలస్యం అవుతుంది. సెన్సార్ క్లియర్ చేసుకుని విడుదల చేస్తాం. మీ అందరి సపోర్ట్ కావాలి' అని అన్నారు.
'వెంకట్ నిర్మించిన 'దండుపాళ్యం' చిత్రాన్ని నైజాంలో డిస్ట్రిబ్యూట్ చేశా. ఈ చిత్రాలకి మాస్‌లో మంచి క్రేజ్ ఉంది. కారణం లేకుండా సినిమాని తిరస్కరించే రైట్ సెన్సార్ అధికారికి లేదు. ఈ విషయంలో మేం అన్ని రకాలుగా సపోర్ట్‌ని అందిస్తాం' అని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి ముత్యాల రాందాసు తెలిపారు.
నటుడు బెనర్జీ మాట్లాడుతూ, 'ఇదొక రా ఫిల్మ్. ఆర్టిస్టులు చాలా సహజంగా, మాస్ లుక్‌లో నటించారు. దండుపాళ్యం గ్యాంగ్‌కి నేను లీడర్‌గా నటించా. సినిమాలో మంచి హ్యూమర్ ఉంటుంది. క్రైమ్ ఎంటర్‌టైనర్ ఎంజాయ్ చేసేలా ఉంటుంది. సెన్సార్‌లో తలెత్తిన సమస్య క్లియర్ చేసుకుని విడుదల కావాలని కోరుకుంటున్నా' అని చెప్పారు. 'సినిమాని నీట్‌గా తెరకెక్కించాం. ఆడియెన్స్‌కి బాగా నచ్చుతుంది' అని దర్శకుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌రావు, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

యూత్‌ని మాత్రమే టార్గెట్ చేశాం


నిక్కి తంబోలి, అరుణ్ ఆదిత్

అరుణ్ ఆదిత్, నిక్కి తంబోలి జంటగా సంతోష్ పి.జయకుమార్ దర్శకత్వంలో బ్లూ ఘోస్ట్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రం 'చీకటి గదిలో చితక్కొట్టుడు'. ఈ చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమం శనివారం జరిగింది.
ఈ సందర్భంగా హీరో అరుణ్ ఆదిత్ మాట్లాడుతూ, 'గతంలో 'ఎల్ 7' అనే హర్రర్ సినిమాలో నటించా. అది ఘోర పరాజయం చెందింది. ఈసారి చేసే హర్రర్ సినిమా బొమ్మ పడిపోయేలా ఉండాలనుకున్నా. ఈ చిత్రం అదిరిపోయేలా ఉంటుంది. అడల్ట్ హర్రర్ కామెడీ చిత్రమిది. యూత్ ఆడియెన్స్‌ని టార్గెట్‌గా తెరకెక్కించాం. వాళ్ళు బాగా ఎంజాయ్ చేస్తారు. అడల్ట్ కంటెంటే కాదు, కడుపుబ్బా నవ్విస్తుంది. నేను నటించిన గత సినిమాలు మంచి విజయం సాధించినా నాకు గుర్తింపు రాలేదు. ఈ సినిమా మంచి గుర్తింపు తెస్తుందని ఆశిస్తున్నా. నాకు ఇమేజ్ లేదు, అందుకే ప్రయోగాలు చేస్తున్నా' అని అన్నారు.
'దక్షిణాదిలో ఈ జోనర్ కొత్త. గతేడాది తమిళంలో రూపొందించిన ఈ సినిమా మంచి విజయం సాధించింది. తెలుగులోనూ వర్కౌట్ అవుతుందనే ఉద్దేశంతో రూపొందించాం. 20 రోజుల్లో చిత్రీకరించాం. నటీనటులు అంతా బాగా సపోర్ట్ చేశారు. 18 ఏండ్లు దాటిన వారు మాత్రమే సినిమా చూడాలి. వర్జిన్ అమ్మాయి, అబ్బాయిల కోసం, సింగిల్‌గా ఉండే వారికోసం రూపొందించాం. సింగిల్‌గా ఉండేవారికిది అంకితం. మన దేశంలో అత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఎవరికివారు స్వయంసంతృప్తి చెందితే అలాంటి ఘటనలు జరగవని చెప్పే చిత్రమిది' అని దర్శకుడు తెలిపారు. 'చాలా రోజులుగా చించేసే పాత్రలు చేయాలని ఉండేది. ఇందులో అలాంటి పాత్ర చేశా. ఇది బూతు సినిమా కాదు. మంచి ఎమోషన్ కూడా ఉంటుంది. 'ఆనందో బ్రహ్మ' నాకు ఎంతటి గుర్తింపు తెచ్చిందో, ఈ సినిమా ఆ స్థాయిలో పేరు తెస్తుందని భావిస్తున్నా' అని తాగుబోతు రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు బాల మురళీ, హీరోయిన్ నిక్కీ పాల్గొని మరిన్ని చిత్ర విశేషాలు తెలిపారు.

ఉపాధ్యాయ పదోన్నతులకు పచ్చజెండా

యాజమాన్యం వారీగా ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయం

- అధికారుల కసరత్తు వేగవంతం
- ఎస్జీటీలకు ఎస్ఏలుగా, ఎస్ఏలకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి
- పండితులు, పీఈటీల అప్‌గ్రెడేషన్‌కు లైన్‌క్లియర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఏండ్ల తరబడి ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ పదోన్నతులకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. పంచాయతీరాజ్, ప్రభుత్వ టీచర్లకు యాజమాన్యం వారీగా పదోన్నతులు ఇవ్వాలని ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఏకీకృత సర్వీసు రూల్స్ అంశం కోర్టు పరిధిలో ఉన్నది. ఎంఈవో, డిప్యూటీఈవో పోస్టులకు ఇచ్చే పదోన్నతులను మినహాయించి స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయుల పోస్టులకు పదోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)లకు స్కూల్ అసిసెంట్లు (ఎస్ఏ)గా, ఎస్ఏలకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు లభించనున్నాయి. ఈ దిశగా అధికారులు కసరత్తు వేగవంతం చేశారు. ఉపాధ్యాయులకు యాజమాన్యం వారీగా పదోన్నతులు ఇచ్చేందుకు అవసరమైన మార్గదర్శకాలు రూపొందించిన దస్త్రం సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)కి చేరినట్టు సమాచారం. జీఏడీ ఆమోదం లభించగానే ఆ దస్త్రం ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరనుంది. సీఎం కేసీఆర్ అనుమతి రాగానే ఉత్తర్వులు వెలువడతాయి. పండితులు, పీఈటీల పోస్టులను అప్‌గ్రెడేషన్ చేయడం, ఎస్జీటీలకు ఎస్ఏలుగా, స్కూల్ అసిసెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి ఇచ్చే అంశంపై సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు పాతూరి సుధాకర్‌రెడ్డి, పూల రవీందర్ కసరత్తు



చేసినట్టు తెలిసింది. రాష్ట్రంలో మూడు వేల వరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 800 వరకు ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో ఆయా పోస్టులకు పదోన్నతి లభించనుంది. ఏకీకృత సర్వీసు రూల్స్ వివాదంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరా తీసినట్టు సమాచారం. ఉపాధ్యాయుల పదోన్నతుల సమస్య పరిష్కారంపై దృష్టి సారించారు. అందులో భాగంగానే పంచాయతీరాజ్, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాల నేతలతో అధికారులు సంప్రదించాలని ఆదేశించినట్టు సమాచారం.

పండితులు, పీఈటీలకు ప్రయోజనం

పండితులు, పీఈటీల పోస్టులను అప్‌గ్రెడేషన్ చేయడంతో వారి కల సాకారం కానుంది. పండితులు, ఎస్జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతి లభించనుంది. ఈ నిర్ణయం వల్ల 15 వేల మంది ఉపాధ్యాయులు లబ్దిపొందనున్నట్టు సమాచారం. పండితుల పదోన్నతులకు సంబంధించి 2,487 పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేసింది. తాజాగా మరో 6,024 పోస్టులను అప్‌గ్రేడ్ చేసింది. దీనివల్ల ఇంతకాలం గ్రేడ్-2 ఉపాధ్యాయులుగా కొనసాగిన 8,511 మంది పండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించనుంది. పీఈటీలు గతంలో 1,047 పోస్టులను ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)లుగా అప్‌గ్రేడ్ చేసింది. ఇప్పుడు మరో 786 పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయడం ద్వారా 1,833 పీఈటీ పోస్టులను పీడీలుగా అప్‌గ్రేడ్ అయ్యారు. పండితులు, పీఈటీలు 10,344 మందికి పదోన్నతులు లభించనున్నాయి.

టెన్షన్.. టెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

సికింద్రాబాద్, వరంగల్ (106), ఇబ్రహీంపట్నం, కోడంగల్, గోషామహాల్, కొత్తగూడ ఉన్నాయి.

ఆ మూడింటిపై విచారణ..

మూడు నియోజకవర్గాల్లోని అభ్యంతరాలపై కోర్టు విచారణకు ఆదేశించింది. హుస్నాబాద్, మంచిర్యాల, తుంగతుర్తి నియోజకవర్గాల్లో వెంటనే విచారణ చేపట్టాలని ఆదేశించింది. న్యాయవాదులు పిటిషన్‌లో పేర్కొన్న అంశాలపై విచారణ జరగనుంది. మరో మూడు నియోజకవర్గాలపై డబుల్ పిటిషన్లు వేశారు. వాటిలో మహబూబ్‌నగర్, కరీంనగర్, జుబ్లీహిల్స్ నియోజకవర్గాలున్నాయి.

29 నియోజకవర్గాల్లో కొత్త ఈవీఎంలు

హైకోర్టు విచారణలో ఉన్న 29 నియోజకవర్గాల్లో పార్లమెంట్ ఎన్నికలకు కొత్త ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ రానున్నాయి. పిటిషన్ వేసిన నియోజకవర్గాల ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ భద్రపర్చాలని కోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆ జాగ్రత్తలు తీసుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు ఉపయోగించిన 29 నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌ను భద్రపర్చారు. వాటిస్థానంలో సుమారు 9వేలకుపైగా కొత్త ఈవీఎంలు, వీవీప్యాట్స్‌ను జిల్లా కేంద్రాలకు పంపించనున్నారు.

ఎస్‌బీఐలో 2.15 కోట్లకు టోపీ

(మొదటిపేజీ తరువాయి)

నరేంద్రచౌదరి, ఫీల్డ్ ఆఫీసర్ రమేష్, మధ్యవర్తులు రాజేందర్, శ్రీనివాస్ ప్రమేయం ఉన్నట్టు అధికారులు ప్రాథమికగా నిర్ధారించి బ్యాంకు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలోనే బ్యాంకు ఉన్నతాధికారులు సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేయగా, పరకాల పట్టణంలో విచారణ మొదలైంది. ఇటీవల ఎస్‌బీఐ శాఖ మేనేజర్‌ను సీబీఐ అధికారులు విచారించినట్టు తెలిసింది. సీబీఐ అధికారులు ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కీచక ప్రధానోపాధ్యాయుడు

విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

- సర్వీసంతా ఇదే తంతు..
- పాఠశాల ఎదుట ఆందోళన
- పోలీసుస్టేషన్‌లో తల్లిదండ్రుల ఫిర్యాదు



నవతెలంగాణ- కూసుమంచి

ఉపాధ్యాయ వృత్తికే కళంకం తెచ్చాడు ఆ ప్రధానోపాధ్యాయుడు. తండ్రిలా ఉండాల్సిన అతడు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. అతని సర్వీసు మొత్తంగా ఇలాంటి ఘటనలే ఎక్కువగా ఉన్నాయి. గతంలో పలుమార్లు సస్పెండైనా గుణపాఠం నేర్వలేదు. అతని వెకిలి చేష్టలను భరించలేక విద్యార్థినులు తల్లిదండ్రులతో కలిసి శనివారం పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. ఈ ఘటనకు సంబంధించి విద్యార్థినులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి..

ఖమ్మం జిల్లా కూసుమంచి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యయుడు బి.శంకర్‌రెడ్డి. విద్యాబుద్ధులు మరిచి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. అసభ్య పదజాలంతో సంభోదిస్తూ అమ్మాయిలను తమను తాకుతూ వెకిలి చేష్టలు చేస్తున్నాడు. ప్రత్యేక తరగతులు పేరిట అదనంగా రెండుగంటల పాటు పాఠశాలలో ఉంచి చెప్పుకోలేని విధంగా ప్రవర్తిస్తున్నాడు. అతని ప్రవర్తనతో భయాందోళనకు గురైన విద్యార్థినులు శనివారం తల్లిదండ్రులతో కలిసి విద్యార్థినులు పాఠశాల ఎదుట అందోళన చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సర్వీసంతా ఇదే తంతు ..!

శంకర్‌రెడ్డి గతంలో పనిచేసిన చోటల్లా ఇలాగే ప్రవర్తించారు. గతంలో ఆయన పనిచేసిన పాఠశాలల్లో జరిగిన కొన్ని ఘటనలు ఇవే..

- ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని నామవరంలో పనిచేసిన సమయంలో పదో తరగతి విద్యార్థినులను తీవ్ర వేధింపులకు గురిచేశాడనే ఆరోపణలు ఉన్నాయి. తిరుమలాయపాలెం మండలంలోని తెట్టెలపాడులో పనిచేసిన సమయంలోనూ ఓ విద్యార్థినిని లైంగికంగా వేధించడమేగాక లొంగదీసుకుని ఇబ్బందులకు గురిచేశాడనే ఆరోపణలున్నాయి. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లోనూ కేసు నమోదైంది. దాంతో అతన్ని ఆయన్ను సస్పెండ్ చేశారు. అనంతరం ఉమ్మడి ఖమ్మం జిల్లా, ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని నెల్లిపాకకు ట్రాన్స్‌ఫర్ చేశారు. అక్కడ్నుంచి కూసుమంచి మండలం కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు బదిలీపై వచ్చారు. ఇక్కడా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు.

అతనిపై చర్యలు తిసుకోవాలి
టీఎస్‌యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ప్రధానోపాధ్యాయుడు ఇలాంటి చర్యలకు పాల్పడటం సిగ్గుచేటు. విద్యార్థులను లైంగికంగా వేధించిన శంకర్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి.

విచారించి చర్యలు తీసుకుంటాం
జి.అశోక్- కూసుమంచి ఎస్ఐ

విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, లైంగిక దాడికి పాల్పడుతున్నట్టు వస్తున్న ఆరోపణలపై విచారించి చర్యలు తీసుకుంటాం. దీనికి సంబంధించి ఇప్పటికే ఫిర్యాదు అందింది. విచారణలో నిజమని తేలితే ప్రధానోపాధ్యాయునిపై నిర్భయ చట్టం కింద కేసు నమోదు చేస్తాం.

భట్టి ముందే డిష్యుం డిష్యుం

(మొదటిపేజీ తరువాయి)

అడ్డుకోవడంతో ఆయనపై పిడిగుద్దులకు తెగబడ్డారు. దీంతో ఆగకుండా వీహెచ్ ఉన్న గదికి వెళ్లి నానా హంగామా సృష్టించారు. పరస్పరం కుర్చీలు విసురుకున్నారు. వీహెచ్, నూతి శ్రీకాంత్ వర్గీయుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. శ్రీకాంత్‌కు టికెట్ రాకుండా వీహెచ్ అడ్డుకున్నారని ఆరోపిస్తూ...ఆయన అనుచరులు ఆందోళన చేపట్టారు. దీంతో సహనం కోల్పోయిన వీహెచ్, వారిపై దుర్భాషలాడారు. దీంతో శ్రీకాంత్ అనుచరులు వీహెచ్‌పైకి దూసుకెళ్లారు. పార్టీ ప్రధాన కార్యదర్శులు బొల్లు కిషన్, నగేష్‌ముదిరాజ్ జోక్యం చేసుకుని వారిని శాంతింప చేశారు. అయితే గాంధీభవన్ ఘటన నేపథ్యంలో నూతి శ్రీకాంత్‌పై ఓబీసీ చైర్మెన్ చిత్తరంజన్‌దాస్ క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. ఓబీసీ అధ్యక్ష పదవి నుంచి సస్పెండ్ చేశారు. అంతకు ముందు వీహెచ్ మాట్లాడుతూ గాంధీభవన్‌లో ఇలాంటి చర్యలకు పాల్పడటం దురదృష్టకరమన్నారు. హైదరాబాద్ ఓబీసీ సెల్ చైర్మెన్‌గా నాగేష్ ముదిరాజ్‌ను కాకుండా శ్రీకాంత్‌కు ఇప్పించానని, ఈ విషయంలో తాను తప్పు చేశానని ఆవేదన వ్యక్తం చేశారు.

బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి
భట్టి సన్మాన కార్యక్రమంలో చిత్తరంజన్‌దాస్

ప్రతిపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి అని ఓబీసీ చైర్మెన్ చిత్తరంజన్‌దాస్ అన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎల్పీ నేతగా ఆయనకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వి హనుమంతరావు మాట్లాడుతూ గతంలో సీఎల్పీ నేతగా అగ్రకులాలకు అవకాశం ఇచ్చేవారనీ, రాహుల్‌గాంధీ దళిత సామాజికవర్గానికి చెందిన నేతకు అవకాశం కల్పించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ విభాగం నేతలు పాల్గొన్నారు.

డ్రైవర్లే ఆర్టీసీకి మూల స్తంభాలు

ఎండీ సునీల్ శర్మ

- ఉత్తమ డ్రైవర్లకు అవార్డుల ప్రధానం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (ఆర్టీసీ)కి డ్రైవర్లే మూల స్తంభాలని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ శర్మ అన్నారు. వారి సేవలు మరువలేనివని చెప్పారు. శనివారం ఆర్టీసీ కళాభవన్‌లో 11 రీజియన్లకు చెందిన ఉత్తమ డ్రైవర్లకు ఆయన అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ శర్మ మాట్లాడుతూ ప్రతి సంస్థలో చిన్న చిన్న సమస్యలుంటాయని వాటిని సర్దుకుపోవాలని సిబ్బందికి సూచించారు. డ్రైవర్లతోనే ఆర్టీసీకి ఆదాయం వస్తున్నదని, వారిని అన్ని విధాల ఆదుకుంటామని చెప్పారు. అవార్డులు పొందిన వారిని ఇతర సిబ్బంది స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. త్వరలోనే సంస్థలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రతి డ్రైవర్ సురక్షితంగా బస్సును నడిపి కెఎమ్‌పీఎల్‌ను పెంచాలన్నారు. ప్రయివేటు వాహనాలకు ధీటుగా ఆర్టీసీ కొత్త బస్సులను ప్రవేశపెడుతున్నదని చెప్పారు. డ్రైవర్లపై పని ఒత్తిడిని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మదురో సర్కారుకే ఐక్యరాజ్య సమితి గుర్తింపు

(మొదటిపేజీ తరువాయి)

సంక్షోభం ప్రభావం ప్రజలపై చూపుతుందని గుటెరస్ ఆందోళన వెలిబుచ్చారు. కాగా, సాయం కావాలంటూ గెయిడో చేసిన అభ్యర్థనపై అధ్యక్షుడు మదురోతో మాట్లాడాలని గుటెరస్ కోరారు. వెనిజులాలో అభివృద్ధి కార్యక్రమాలకు మానవతా సాయం పెంచేందుకు ఐక్యరాజ్య సమితి సిద్ధంగా వుందని చెప్పారు. అయితే ఇందుకోసం ముందుగా మదురో ప్రభుత్వ అనుమతి, అంగీకారం కావాల్సి వుంటుందని డుజారిక్ చెప్పారు. వెనిజులాలోని సంబంధిత పక్షాలన్నీ కలిసి విశ్వసనీయమైన రాజకీయచర్చలు జరిపి పరిష్కారం కనుగొనాలని గుటెరస్ ఆకాంక్షిస్తున్నారు.

దేశ సార్వభౌమత్వాన్ని కాపాడతా : మదురో

దేశ ప్రజల సార్వభౌమాధికారాన్ని పరిరక్షించడానికి తన నిబద్ధతను వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో పునరుద్ఘాటించారు. కాగా బొలివారియన్ జాతీయ సాయుధ బలగాలు (ఎఫ్ఎఎన్‌బి) శుక్రవారం సైనిక విన్యాసాలు నిర్వహించాయి. ఎఫ్ఎఎన్‌బి కమాండర్ ఇన్ చీఫ్‌గా ప్రజల సార్వభౌమాధికారాన్ని, రాజ్యాంగాన్ని, వెనిజులా హక్కులను రక్షించేందుకు ధృఢ నిశ్చయంతో వున్నానని విన్యాసాలను పర్యవేక్షిస్తూ మదురో ప్రకటించారు. వెనిజులాలో హింసను రెచ్చగొట్టాలన్నది అమెరికా ప్రభుత్వ లక్ష్యంగా వుందని, ఆ మేరకు ఆ ప్రభుత్వం దాడులకు పాల్పడుతున్న నేపథ్యంలో దేశ సార్వభౌమాధికారానికి ఎఫ్ఎఎన్‌బి వెన్నెముక వంటిదని మదురో అన్నారు. గత 200ఏండ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా బొలివారియన్ విప్లవం తీవ్ర రాజకీయ, ఆర్థిక సవాలును ఎదుర్కొంటోందని, వాటిల్లో వెనిజులా గెలిచి తీరుతుందని అన్నారు. ఎవరికీ తలవంచని బొలీవర్లకు మాతృభూమి వెనిజులానే అని చెప్పారు. రాజ్యాంగం పట్ల విశ్వాసాన్ని, సైనిక నాయకత్వం పట్ల సంపూర్ణ ఐక్యతను ప్రకటించాలని ఎఫ్ఎఎన్‌బీకి మదురో పిలుపిచ్చారు.

అమెరికా, బ్రిటన్‌ల జోక్యాన్ని ఖండించిన కార్బిన్

వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా, బ్రిటన్ జోక్యాన్ని బ్రిటన్ లేబర్ పార్టీ నేత జెరిమీ కార్బిన్ ఖండించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలంటూ అన్ని వర్గాలకు పిలుపివ్వడం సరైన చర్య కాదని విమర్శించారు. తమ భవితవ్యం ఎలా వుండాలో నిర్ణయించుకోవాల్సింది వెనిజులన్లే అని స్పష్టం చేశారు. వెనిజులాపై మరిన్ని ఆంక్షలు విధించాలంటూ బ్రిటన్ విదేశాంగ మంత్రి జెరిమీ హంట్ పిలుపివ్వడాన్ని ఆయన తప్పు పట్టారు. ఈ మేరకు కార్బిన్ ట్వీట్ చేస్తూ, వెలుపలి నుండి జోక్యాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు.

ఓటుకు నోటు కేసులో రేవంత్‌కు నోటీసు?

(మొదటిపేజీ తరువాయి)

తెలిసిందే.ఈ కేసులో దర్యాప్తు సాగించిన ఏసీబీ అధికారులు ఎమ్మెల్యే ఓటు కోసం మొత్తం నాలుగు కోట్ల రూపాయల మేరకు బేరం సాగిందని, అందులో అడ్వాన్స్‌గా 50లక్షలు స్టీఫెన్‌సన్‌కు ఇచ్చే ప్రయత్నం జరిగినట్టు తేల్చింది. అయితే ఇంత పెద్ద మొత్తంలో డబ్బులను ఎక్కడి నుంచి ఎవరు సమకూర్చారనే కోణంలో సాగిన దర్యాప్తులో అవి విదేశాల నుంచి హవాలా ద్వారా సమకూర్చినట్టుగా ఏసీబీ వద్ద సమాచారం ఉన్నట్టు తెలిసింది. కాగా హవాలా కోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మాత్రమే సక్రమంగా దర్యాప్తు జరిపి నిజాలు తేల్చగలదని భావించిన రాష్ట్ర ఏసీబీ అధికారులు ఈడీ తో పాటు కేంద్ర హోంశాఖకు ఈ కేసు దర్యాప్తు జరిపేలా లేఖ రాశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఈడీ అధికారులు తదుపరి దర్యాప్తునకు రంగంలోకి దిగారు. ఈ నేపథ్యంలోనే టీడీపీ నాయకుడు వేం నరేందర్‌రెడ్డికి నోటీసులు ఇచ్చిన ఈడీ అధికారులు తాజాగా రేవంత్‌రెడ్డి, సెబాస్టియన్, ఉదయ్‌సింహాలకు కూడా నోటీసులు ఇచ్చారని తెలిసింది. హవాలా ద్వారా స్టీఫెన్‌సన్‌కు డబ్బులు సమకూర్చేందుకు ప్రయత్నాలు జరిగాయా , ఇందులో ఎవరెవరి మస్తాలు ఉన్నాయనే దిశగా ఈడీ దర్యాప్తు ముందుకు సాగనున్నదని తెలిసింది.

వన్నెతగ్గిన పసుపు

(మొదటిపేజీ తరువాయి)

'మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీం' అమలులోనూ తాత్సారం జరుగుతోంది.

రాష్ట్రంలోనే అత్యధికంగా పసుపు సాగయ్యే నిజామాబాద్ జిల్లాలో ప్రధానంగా ఆర్మూర్ డివిజన్‌లోని ఆర్మూర్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, భీంగల్, ఏర్గట్ల, మెండోరా, ముప్కాల్ మండలాల్లో అత్యధికంగా సాగైంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 33వేల 55 ఎకరాలు కాగా, 34వేల 914 ఎకరాల్లో పంట సాగు చేశారు. జనవరి నుంచి పంట మార్కెట్‌లో అమ్మకాలకు వస్తోంది. గతేడాది ఇదే సీజన్‌లో నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయానికి 9లక్షల క్వింటాళ్ల పసుపు తీసుకురాగా, ఆ ఏడాది మొత్తంగా 12లక్షల క్వింటాళ్ల వరకు వచ్చింది. ప్రస్తుతం జనవరి ప్రారంభం నుంచి పంట మార్కెట్‌లోకి వస్తోంది.


పెట్టుబడికీ సరిపోని దిగుబడి

పసుపు సాగుకు ఏయేటికాయేడు ఖర్చులు పెరుగుతున్నాయి. ఎకరానికి రూ.లక్ష వరకు పెట్టుబడి అయింది. విత్తనం, ఎరువులు మొదలు ఉడకబెట్టడం వంటి వ్యయాలు తడిసి మోపడయ్యాయి. మరోవైపు పంట సాగు మధ్యలో అకాలవర్షం, ప్రారంభంలో వర్షాభావంతో దుంప మొఖంపుచ్చు వచ్చి సరిగా ఊరలేదు. ఫలితంగా ఏడాది పొడవునా నానా చాకిరి చేస్తే ఆయా ప్రాంతాల్లో ఒకరిద్దరికి మినహా ఎకరాకు 20క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. ప్రస్తుతం నిజామాబాద్ మార్కెట్ యార్డులో జనవరి ప్రారంభంలో క్వింటా రూ.6355 పలకగా, ఇప్పుడు రూ.5500లోపే పలుకుతోంది. ఇదే సమయానికి గతేడాది కనిష్టంగా 7,250, గరిష్టంగా రూ.8,681 వరకు పలికింది. తేమశాతం పేరుతో కొందరు దళారులు క్వింటా పసుపు రూ.3800 వరకు కోట్ చేయడం గమనార్హం. పంటలో తేమశాతం అధికంగా ఉంటోందనీ, అయినా రైతులు నష్టపోకుండా క్వింటా పంటకు రూ.4వేలు కటాఫ్ పెట్టామనీ మార్కెట్ కమిటీ కార్యదర్శి స్వరూపారాణి 'నవతెలంగాణ'తో తెలిపారు. రూ.4వేల కన్నా తక్కువగా వ్యాపారులు కోట్ చేయకుండా సాఫ్ట్‌వేర్‌లోనే మార్పులు చేశామని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వం తాత్సారం

పంటలకు కనీస మద్దతు ధర అందని సమయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం 'మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీం(ఎంఐపీ)'ని కేంద్రం అమలు చేస్తోంది. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో మిర్చి రైతులకు కనీస ధర అందని సమయంలో అప్పటి కేంద్ర మంత్రి వెంకయ్యానాయుడు స్వయంగా వ్యవసాయశాఖ మంత్రి రాధామోహన్‌సింగ్‌తో సమావేశమయ్యారు. ఎంఐపీ కింద కేంద్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించింది. అయితే, తెలంగాణాలో పసుపు రైతులకు కనీస మద్దతు ధర అందని పరిస్థితుల్లో కేంద్రం జోక్యం చేసుకోవడం లేదు. మరోవైపు తిరిగి అధికారంలోకి వస్తే పసుపునకు గిట్టుబాటు ధర కల్పిస్తామని నవంబర్ 22న ఆర్మూర్‌లో నిర్వహించిన ఎన్నికల సభలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ అచరణకు నోచుకోవడం లేదు.

క్వింటా రూ.పది వేలు ప్రకటించాలి
బుచ్చిరెడ్డి- ఆర్మూర్



ఆర్మూర్ సభలో పసుపు రైతులకు రూ.పది వేలు మద్దతు ధర ఇస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. మార్కెట్‌లో ధర లేక తక్కువ ధరకు అమ్ముకుంటున్నాం. పెట్టిబడి కూడా ఎల్లడం లేదు. అందువల్ల సీఎం స్పందించి క్వింటాల్‌కు రూ.పది వేలు ప్రకటించి మమ్మల్ని ఆదుకోవాలి.

గీ వ్యవసాయం చేయలేం
ఎన్‌సీ గంగారం- మోర్తాడ్

పసుపు అమ్మితే వచ్చే డబ్బు కూలీలకే సరిపోవడం లేదు. లక్షల్లో పెట్టుబడి పెట్టి.. మా కుటుంబమంతా కష్టపడితే లాభం లేకుండా పోతోంది. ధర పూర్తిగా పడిపోయింది. వ్యవసాయం తప్ప మరో పని తెలియదు. అందుకే దీనిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. సాగుకు పెట్టిన పెట్టుబడీ ఎల్లనప్పుడు ఇక గీ వ్యవసాయం చేయలేం.

సీబీఐ కొత్త చీఫ్ ఆర్కేశుక్లా

(మొదటిపేజీ తరువాయి)

ఆయన రిటైర్ కావాల్సి ఉండగా, అంతకుముందే(జనవరి 10న) ఉద్యోగ విరమణ చేశారు. ఈ వివాదం నడుస్తుండగానే మన్నెం నాగేశ్వరరావును సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా కేంద్రం నియమించింది. ఆ నియామకాన్ని సవాల్ చేస్తూ కామన్‌కాజ్ అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. శుక్రవారం దీనిపై విచారణ సందర్భంగా కేంద్రం తీరును సుప్రీంకోర్టు తప్పు పట్టింది. సీబీఐకి రెగ్యులర్ డైరెక్టర్‌ను వెంటనే నియమించాలని ఆదేశించింది.

సంఘాల అధ్యక్ష పదవులకు కవిత రాజీనామా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఆర్ఎస్‌కు అనుబంధంగా ఉన్న పలు సంఘాల గౌరవాధ్యక్ష పదవులకు ఎంపీ కవిత రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖలను ఆయా సంఘాల ప్రధాన కార్యదర్శులకు శనివారం పంపినట్టు టీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర బొగ్గుగని, విద్యుత్ కార్మిక సంఘం, అంగన్‌వాడీలు తదితర సంఘాలకు ఆమె గౌరవాధ్యక్షురాలుగా ఉన్నారు. అయితే ఆయా పదవుల్లో ఉన్నప్పటికీ తగిన సమయం కేటాయించలేకపోవటం వల్లే వాటి నుంచి తప్పుకుంటున్నట్టు ఆమె ప్రకటించారు.

మద్దతు ధర, కొనుగోళ్లపై సీఎస్ సమీక్ష

- వారలోగా నిధులు విడుదల చేయాలని ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కందులు, మొక్కజొన్నలు, పత్తి, సెసర్లు, మినుములు, సోయాబీన్ పంటలకు మద్దతు ధర, కొనుగోళ్లకు సంబంధించిన అంశాలపై వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సీ. పార్థసారధి శనివారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2018-19లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) వారు ఇప్పటి వరకు రూ. 1329 కోట్ల విలువైన 2.45లక్షల మెట్రిక్ పత్తిని 93,591 మంది రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేసినట్టు మార్కెటింగ్ శాఖ సంచాలకులు లక్ష్మీభాయి చెప్పారు. ఈ ఏడాది 142 కందుల కొనుగోలు కేంద్రాలకు ప్రతిపాదించి, ఇప్పటి వరకు 123 కేంద్రాల ద్వారా 0.43 మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేసినట్టు మార్క్‌ఫెడ్ ఎండీ వి. భాస్కరాచారి వివరించారు. వెంటనే కొనుగోలు చేసిన కందులకు వారం రోజుల్లోగా నిధులు విడుదల చేయాలని అధికారులను సీఎస్ ఆదేశించారు.ఈ సమావేశంలో హాకా, సీసీఐ అధికారులు పాల్గొన్నారు.

20 జిల్లాల్లో భూగర్భ జలం తగ్గుదల

- తక్కువ వర్షపాతమే కారణం్ణ భూగర్భజల శాఖ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలోని 20 జిల్లాల్లో భూగర్భ జలం తగ్గింది. మరో 11 జిల్లాల్లో స్వల్పంగా పెరుగుదల నమోదయింది. జనవరి నెలాఖరు వరకూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో భూగర్భ జలం పరిస్థితి ఏవిధంగా ఉన్నదో ఆ శాఖ వెల్లడించింది. వర్షపాతం తక్కువగా నమోదయిన జిల్లాల్లో భూగర్భ జలాలు మరింత లోతుకు పోయినట్టు ఆ శాఖ అధికారులు తెలిపారు. 2018 జనవరి నుంచి 2019 జనవరి వరకూ రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 852 మిల్లీమీటర్లు కాగా 15 శాతం తక్కువగా 720.6 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. రాష్ట్రంలో సగటు భూగర్భ జలమట్టం 11.91 మీటర్లు కాగా 5.57 మీటర్ల లోతులో ఖమ్మం జిల్లాలో ఉండగా 20.97 మీఈటర్ల పాతాళం లోకి మెదక్ జిల్లాలో ఉన్నట్టు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గత సంవత్సరం జనవరి నెలలో పోలిస్తే రాష్ట్రంలో సగటున 1.83 మీటర్ల లోతుకు భూగర్భ జలమట్టం తగ్గినట్టు తెలుస్తున్నది. 1.56 మీటర్ల పెరుగుదల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నమోదు కాగా అతి తక్కువగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 0.11 మీటర్ల స్వల్ప పెరుగుదల కనిపించింది. రాష్ట్రంలోని భూపాలపల్లి, హైదరాబాద్, జనగామ, గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, మేడ్చల్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, నిజామాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, సిద్దిపేట, సిరిసిల్ల, వికారాబాద్, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, యాదాద్రి జిల్లాల్లో భూగర్భ జలమట్టం పడిపోయింది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, ఖమ్మం, కొమ్రం భీం, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, సూర్యాపేట, వనపర్తి జిల్లాల్లో స్వల్పంగా భూగర్భ జలమట్టం పెరిగింది.

ఎల్ఈడీలో వాతావరణ వివరాలు

- సచివాలయంలో సీఎస్ ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజలు సులువుగావాతావరణ వివరాలను తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. ప్రజి జిల్లా కేంద్రాల్లో "లెడ్ డిస్‌ప్లే" (ఎల్ఈడీ) బోర్డులను ఏర్పాటు చేసింది. సచివాయలంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీని శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఎగిడీ బోర్డుల ద్వారా తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి హెచ్చరికలను సంబంధిత జిల్లా అధికారులు జారీ చేస్తారని తెలిపారు. టీఎస్‌డీపీఎస్ ఏర్పాటు చేసిన ఈ ఎల్ఈడీ డిస్‌ప్లే బోర్డుల వల్ల రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో పాటు రాగల మూడు రోజులకు సంబంధించిన వాతావరణ సూచనలను కూడా తెలియజేస్తుందన్నారు. రాష్ట్రంలో 924 ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు ఉన్నాయని, ఈ స్టేషన్ల ద్వారా ప్రతి రోజు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోని వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు రికార్డు చేసి టీఎస్‌డీపీఎస్ ద్వారా అధికార వెబ్‌సైట్‌తో పాటు మొబైల్ యాప్ ద్వారా వర్షపాతము,అత్యల్ప, అత్యధిక ఉష్ణోగ్రతలు, గాలిలోని తేమకు సంబంధించిన వివరాలను అందుబాటులో ఉంటాయని తెలిపారు.

మోడల్ స్కూల్ సిబ్బంది జీతాలు పెంచాలని

- 5న హైదరాబాద్‌లో ధర్నా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మోడల్ స్కూల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న హైదరాబాద్‌లో ధర్నా జరగనుంది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు జె వెంకటేష్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 192 మోడల్ స్కూల్స్‌లో పనిచేసే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, బోధనేతర సిబ్బందికి కనీస వేతనాలు అమలు కావడం లేదని తెలిపారు. రోజుకు 12, 14 గంటలు పనిచేయాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత లేదని తెలిపారు. పీఎఫ్, హెల్త్ కార్డుల వంటి చట్టబద్ధ సౌకర్యాలు లేవని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా మోడల్ స్కూల్స్ పనిచేయడంలో బోధనేతర సిబ్బంది కృషి ఎంతో ఉందని తెలిపారు. అయినా ఈ ఉద్యోగుల సమస్యలు వర్ణనాతీతమని పేర్కొన్నారు. న్యాయమైన కోర్కెల సాధనకు ఈనెల 5న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ముందున్న ధర్నాచౌక్ వద్ద ఉదయం 10 గంటలకు ధర్నా చేపడతామని తెలిపారు.

వైఎస్ షర్మిల కేసులో పురోగతి

- ఇద్దరు అరెస్ట్

నవతెలంగాణ-సిటీబ్యూరో



సామాజిక మాధ్యమాల వేదికగా వైఎస్ఆర్ సీపీ నాయకురాలు వైఎస్ షర్మిల గురించి అసభ్యంగా వీడియోలు పెట్టిన వ్యక్తిని సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. గూగుల్ ఇచ్చిన ఐపీ అడ్రస్ ఆధారాలతో నిందితుడిని పట్టుకున్న పోలీసులు హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. గుంటూరుకు చెందిన వెంకటేశ్ అక్కడే ఓ ప్రయివేటు కాలేజీలో ఎంసీఏ చదువుతున్నాడు. నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 509, 67ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు.

మంచిర్యాలకు చెందిన మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు. సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కొద్ది రోజుల కిందట వైఎస్ షర్మిల భర్త అనిల్‌కుమార్‌తో కలిసి సీపీ అంజనీకుమార్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు అన్ని కోణాల్లో విచారణ చేపట్టిన సీసీఎస్ పోలీసులు మరికొందరిని విచారిస్తున్నట్టు సమాచారం.

సెన్సెక్స్ ▲212
36,469

నిఫ్టీ ▲62
10,893

శుక్రవారం మార్కెట్లు ముగిసే సమయానికి

డాలరుకు
రూపాయి విలువ
71.25



బంగారం(10.గ్రా)
రూ. 33,410



వెండి (కేజీ)
రూ. 40,580



కోడిగుడ్లు (వందకి)

హైదరాబాద్	418	విజయవాడ	423
ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	455
వరంగల్	420	ముంబయి	473



మార్కెట్లోకి రూ.75 లక్షల బైక్!



రోమ్: ఇటలీకి చెందిన ప్రముఖ డిజైన్ సంస్థ ఆఫిసిన్ జీపీ డిజైన్ తాజాగా డుకాటీ పనిగేల్ వీ4లో కస్టమ్ బైక్‌ను మార్కెట్‌లోకి ఆవిష్కరించింది. దీని ధర దాదాపు రూ.74.5 లక్షలు. డుకాటీ పనిగేల్ వీ4 కస్టమ్ బైక్ పేరు వీ4 పెంటా. వీ4 ఎస్ బైక్‌లకు పలు అదనపు ప్రత్యేకతలను జోడించి ఈ బైక్‌ను రూపొందించారు. ఇందులో కస్టమ్ స్పోక్డ్ వీల్స్, ఇంజిన్‌పై బ్రాంజ్ పౌడర్ కోటింగ్, క్రాంక్‌కేస్ కవర్స్, క్లాసిక్ స్టైల్డ్ గిర్డర్ ఫ్రంట్ ఎండ్ వంటి ప్రత్యకతలున్నాయి. ఈ బైక్‌ను లూకా పొజాటో డిజైన్ చేసింది. ఇది కేవలం స్ట్రీట్‌ఫైటర్ మాత్రమే కాదు. అంతకు మించేలా ఉంది. ఫెరింగ్ తొలగింపుతో బైక్ నేక్డ్ స్ట్రీట్ ఫైటర్‌లా కనిపిస్తుంది. ఇది లిమిటెడ్ ఎడిషన్. కేవలం 10 బైక్స్ మాత్రమే అందుబాటులో ఉండనున్నాయి. బైక్‌కు సంబంధించిన హ్యాండ్‌బార్స్, ఇండికేటర్లు, ఫుట్‌పెగ్స్ సహా పలు ఇతర భాగాలను రిజోమా సంస్థ రూపొందించడం విశేషం. అయితే వీటైనన్ని ఎక్కువ బైక్‌లను భారత్‌లోనే విక్రయించేలా సంస్థ ప్లాన్ చేసుకున్నట్టుగా సమాచారం.

ఐకియా స్థానికతను పెంచుతాం

- అనుకున్న స్థాయిలో సందర్శకులు రావట్లేదు



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: స్వీడన్ ఫర్నిచర్ దిగ్గజం ఐకియా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన స్టోర్‌కు అంచనా వేసిన స్థాయిలో సందర్శకుల తాకిడి లేదని స్టోర్ మేనేజర్ జాన్ అచిల్లియా అన్నారు. తొలత తాము ప్రతియేటా దాదాపు 70 లక్షల మంది సందర్శకులు స్టోర్‌కు వస్తారని భావించామని.. అయితే ఇప్పుడు దానిని 5 లక్షలకు సవరించుకుంటున్నట్టుగా ఆయన వివరించారు. గత ఆరు నెలల అనుభవం మేరకు తమ అంచనాలను సవరించుకుంటున్నట్టుగా ఆయన తెలిపారు. స్టోర్ ప్రారంభంలో తాము అంచనావేసిన దానికంటే సందర్శకుల తాకిడి ఎక్కువగా నమోదు అయిందని.. అయితే రానురాను ఇది తగ్గుతూ వస్తోందని ఆయన తెలిపారు. పానిపట్, హర్యాణా సంప్రదాయాలకు అద్దం పడుతూ రూపొందించిన 'ఆంగ్లతర' టెక్స్‌టైల్స్ కలెక్షన్‌ను ఆయన స్టోర్‌లో ఆవిష్కరించారు. ఐకియాలో స్థానిక వస్తువులను సమీకరించి విక్రయించే విషయంలో వేగంగా ముందుకు సాగుతున్నామని ఆయన అన్నారు. తొలినాళ్లలో స్థానిక వస్తువుల విక్రయం ఒక అంకె స్థాయిలో ఉంటే.. ప్రస్తుతం అది 19% స్థాయికి చేరిందని.. భవిష్యత్తులో దీనిని 30 శాతానికి చేర్చనున్నట్టుగా ఆయన తెలిపారు. షాపింగ్ సమయంలో భారతీయులు డబ్బుకు ఎక్కువ విలువనిస్తారని ఆయన వివరించారు. తమ స్టోర్‌లో రూ.15ల నుంచి మొదలుకొని దాదాపు రూ.11 లక్షల వరకు విలువైన ఫర్నిచర్‌ను విక్రయిస్తున్నామని ఆయన తెలిపారు. హైదరాబాద్ స్టోర్‌లో గతంలో ప్రపంచంలో ఎక్కడాలేనన్ని ఇంటీరియర్ ఫర్నిచర్‌ను అందుబాటులో ఉంచినట్టుగా ఆయన తెలిపారు. గడిచిన ఆరు నెలలో అన్నింటికంటే ఎక్కువగా రంగురంగుల చెంచాలను ఎక్కువగా విక్రయించినట్టుగా ఆయన తెలిపారు. ఆరు నెలల్లో దాదాపు 5 లక్షల చెంచాలను విక్రయించామని ఆయన తెలిపారు.

చందా కొచ్చర్‌పై మనీలాండరింగ్ కేసు

- రంగంలోకి దిగిన ఈడీ విచారణ వర్గాలు
- త్వరలోనే నిందితులకు నోటీసులు



న్యూఢిల్లీ: వీడియోకాన్ గ్రూపుకు భారీగా రుణాలను మంజూరు చేయడంలో ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ చైర్మెన్ చందా కొచ్చర్ క్విడ్‌ప్రోకోకు పాల్పడిందన్న అంశంపై వివాదం మరింత ముదురుతోంది. తాజాగా ఆమెపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మానిలాండరింగ్ కేసును నమోదు చేసింది. కొచ్చర్‌తో పాటు ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ గ్రూపు అధినేత వేణుగోపాల్ దూత్‌లపై ఈడీ కొరడా ఝులిపించినట్లు శనివారం అధికారులు వెల్లడించారు. వీడియోకాన్‌కు ఐసీఐసీఐ ఇచ్చిన రుణాల జారీలో రూ.1,875 కోట్ల మోసం జరిగినందన్న ఆరోపణలపై కూడా ఈడీ విచారణ ప్రారంభించింది. గత నెలలో సీబీఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈడీ కొచ్చర్‌తో సహా ఈ కేసులోని అనుమానిత నిందుతులపై 'ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఈసీఐఆర్)ను నమోదు చేసింది. పోలీసు విభాగానికి ఎఫ్ఐఆర్ ఎలాగో.. ఈడీకి ఈసిఐఆర్ అలాంటిది. ఈ రుణ ఒప్పందంలో జరిగిన మోసంలో మానీలాండరింగ్‌కు ఉన్న అవకాశాలపై ఈడి విచారణ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి అతి త్వరలోనే నిందితులకు నోటీసులు జారీ చేయనుందని అధికారులు వివరించారు. ఈ కేసులో ఇప్పటికే సీబీఐ ఎవరికైతే నోటీసులు అందించిందో వారందరికి కూడా ఈడీ నోటీసులు జారీ చేయనుందన్నారు. సీబీఐ నోటీసులు జారీ చేసిన వారిలో చందా కొచ్చర్, అమె భర్త దీపక్ కొచ్చర్, దూత్‌తో పాటు ఆయన కంపెనీలు అయినా వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్, వీడియోకాన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అందులోని కొందరు అధికారులు ఉన్నారు.

2012లో వీడియోకాన్ గ్రూపునకు ఐసీఐసీఐ బ్యాంక్ రూ.3,250కోట్ల అప్పులను ఇచ్చింది. రుణం మంజూరైన కొద్ది మాసాలకే ఆ కంపెనీ చీఫ్ వేణుగోపాల్ ధూత్.. చందాకొచ్చర్ భర్తకు చెందిన న్యూపవర్ సంస్థలో కోట్లాది రూపాయల పెట్టుబడులు పెట్టింది. తుదకు రూ.9 లక్షల నామమాత్రపు ధరకే రూ.64 కోట్ల ఆస్తులను దూత్ దీపక్ కొచ్చర్‌కు అందజేశారనేది ప్రధాన ఆరోపణ. దీనికి సంబంధించి కొచ్చర్‌పై చాలా ఆరోపణలు వచ్చాయి. వీడియోకాన్ గ్రూప్ రుణాల అవకతవకల వివాదం కారణంగా చందా కొచ్చర్ గత ఏడాది అక్టోబరులో ఐసిఐసిఐ బ్యాంకు సీఈవో పదవి నుంచి వైదొలగాల్సి వచ్చింది. వీడియోకాన్ రుణం కేసులో చందా కొచ్చర్ దోషేనని ఐసీఐసీఐ ఏర్పాటు చేసిన స్వతంత్ర విచారణ కమిటీ తేల్చిన విషయం తెలిసిందే. ఈ స్కామ్‌పై విచారణకు నియమించిన జస్టిస్ శ్రీకృష్ణ స్వతంత్ర కమిటీ.. తన రిపోర్టును బుధవారం ఆ బ్యాంకుకు అందించింది. నివేదికలలో బ్యాంకునకు సంబంధించిన అంతర్గత నిబంధనలను కొచ్చర్ ఉల్లఘించారని కమిటీ తేల్చింది. ఈ నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు కేసు విచారణలో వేగం పెంచాయి.

పబ్లిక్ ఇష్యూ ద్వారా వాటాల విక్రయం



న్యూఢిల్లీ: ఏప్రిల్ నుంచి ప్రారంభంకానున్న కొత్త ఆర్థిక సంవత్సరంలో వివిధ ప్రభుత్వ రంగ కంపెనీలను (పీఎస్‌యూ) పబ్లిక్ ఇష్యూ బాట (ఐపీవో) పట్టించనున్నట్టుగా ప్రభుత్వం వెల్లడించింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దాదాపు పది ప్రభుత్వ రంగ కంపెనీలు ప్రాథమిక మార్కెట్లోకి రానున్నాయని 'డిపార్టుమెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్' (దీపమ్) కార్యదర్శి అటను చక్రబొర్తి తెలిపారు. 2019-20 సంవత్సరానికి గాను పీఎస్‌యూలలో డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ.90,000 కోట్ల వాటాలను విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. 2018-19లో రూ.80వేల కోట్ల వాటాల ఉపసంహరణ లక్ష్యాన్ని చేరకుంటామని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ పీఎస్‌యూలల భారీగా వాటాల విక్రయానికి ఎత్తుగడలు రూపొందిస్తోందని సమాచారం. ఈ క్రమంలో భాగంగా నే ఇప్పటికే 10 ఐపీవోలు వరసలో ఉన్నాయని చక్రబొర్తి తెలిపారు. చాలా కంపెనీలు ఇంకా కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ లక్ష్యాన్ని చేరాల్సి ఉందన్నారు. గడిచిన 10 నెలల్లో కేంద్ర పీఎస్‌యుల్లో రూ.36,000 కోట్ల విలువ చేసే వాటాలను ఉపసంహరించుకుంది. వచ్చే నెల మార్చి ముగింపు నాటికి మరో రూ.44,000 కోట్ల వాటాలను విక్రయించాలని కేంద్రం నిర్దేశించుకుందని.. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి లక్ష్యంగా పెట్టుకున్న రూ.80,000 కోట్ల వాటాల ఉపసంహరణ లక్ష్యం నెరవేరనుందని చక్రబొర్తి పేర్కొన్నారు. 2019 మార్చి కల్లా పవన్ హాన్స్‌లో కీలక వాటాలను విక్రయించనున్నామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.90వేల కోట్ల వాటాలను ఉపసంహరణకు ఇప్పటికే తాము ప్రణాళికలు రూపొందించామన్నారు.

మోడీ వరాలు ఓట్లు కురిపించవు!

మధ్యంతర బడ్జెట్ గేమ్ ఛేంజర్ కాలేదు:

కేడియా సెక్యూరిటీస్ ఎండీ విశ్లేషణ



న్యూఢిల్లీ: మోడీ సర్కారు మధ్యంతర బడ్జెట్‌లో రైతులు, మధ్యతరగతి, విద్యావంతులు, వేతన జీవులను లక్ష్యంగా చేసుకొని వరాలను ప్రకటించినప్పటికీ అవి ఎన్‌డీఏ ప్రభుత్వానికి ఓట్లు కురిపించలేవని కేడియా సెక్యూరిటీస్ ఎండీ విజయ్ కేడియా అభిప్రాయపడ్డారు. అయితే ఆశ్చర్యకరంగా ఈసారి బడ్జెట్ మాత్రం పూర్తి భిన్నంగా ఉందని పేర్కొన్నారు. ఒక ఆంగ్ల చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాలు వెల్లడించారు. మధ్యతరగతి ప్రజలకు పన్ను మినహాయింపు అంశంపై స్పందిస్తూ... ప్రజలు తొలిగా పన్ను మినహాయింపు పరిమితి రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెరిగిందని గందరగోళానికి గురయ్యారని విజయ్ కేడియా తెలిపారు. అయితే అసలు కథ అది కాదన్నారు. సెక్షన్ 87 ఏను సవరించారని, అన్ని డిడక్షన్ల తర్వాత నికర పన్ను ఆదాయం రూ.5 లక్షల లోపు ఉంటే.. ఆ మొత్తంపై పన్ను భారం ఉండదని వివరించారు. లేని పక్షంలో పన్ను భారం మోయాల్సిందేనని తెలిపారు. బడ్జెట్‌లో చిన్నకారు రైతులకు ఏడాదికి రూ.6,000 నగదు బదిలీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని విజయ్ కేడియా గుర్తు చేశారు. రైతులకు ప్రత్యక్ష నగదు పథకం కింద అందించే మొత్తం చాలా తక్కువగా కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వానికి తాజా బడ్జెట్ గేమ్ ఛేంజర్ అవుతుందని భావించడం లేదన్నారు విజయ్ కేడియా. బడ్జెట్ వల్ల వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వానికి ఆరోగ్యకరమైన ఓట్లు లభిస్తాయని అనుకోవడం లేదని ఆయన తెలిపారు.

మార్కెట్లలో తమ్మాత్ జాగ్రత్త

క్యాపిటల్ మార్కెట్ కోణంలో చూస్తే.. స్టాక్ మార్కెట్ ప్రాధాన్యం ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల వైపు మళ్లుతుందని కేడియా తెలిపారు. దీర్ఘకాల ఇన్వెస్టర్లకు మార్కెట్‌లో మంచి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆమోదయోగ్యమైన వ్యాల్యుయేషన్స్‌తో నాణ్యమైన స్టాక్స్ కొనుగోలు చేయవచ్చని తెలిపారు. అయితే మెరిసేదంతా బంగారం కదన్నా విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఇన్వెస్టర్లు జాగ్రత్తగా ఉండాలని, స్టాక్ ఎంపిక విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ముందు బెంచ్‌మార్క్ ఇండెక్స్‌లు కొత్త గరిష్ఠ స్థాయిలకు చేరకపోవచ్చని కేడియా అంచనా వేశారు. ఇండెక్స్ కదలికల ఆధారంగా ఇన్వెస్ట్ చేయనని పేర్కొన్నారు. దాదాపు 90 శాతం మిడ్ క్యాప్స్ పెన్నీ స్టాక్స్‌గా మారాయని, అందువల్ల సమర్థవంతమైన మేనేజ్‌మెంట్ ఉన్న కంపెనీలను ఎంచుకోవడం మంచిదని సలహా ఇచ్చారు.

లక్ష కోట్లు దాటిన జీఎస్టీ వసూళ్లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్ళు ముచ్చటగా మూడో సారి లక్ష కోట్ల రూపాయల మార్క్‌ను నమోదు చేశాయి. కొత్త ఏడాది నెలలో జీఎస్టీ వసూళ్లు రూ.1,02,503కోట్లకు చేరాయని ఆర్థిక శాఖ శనివారం వెల్లడించింది. గతేడాది ఏప్రిల్ తర్వాత జీఎస్టీ వసూళ్లు అత్యధికంగా నమోదు కావడం ఇదే తొలిసారి. 2017 జులై నుంచి ఈ కొత్త పన్ను విధానం అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. 2018 డిసెంబరులో రూ.94,725 కోట్ల వసూళ్లు నమోదయ్యాయి. కాగా 2018 జనవరిలో వసూలైన రూ. 89,825 కోట్ల జీఎస్టీ వసూళ్లతో పోల్చితే క్రితం మాసం వసూళ్లలో 14 శాతం పెరుగుదల చోటుచేసుకుంది. అధికారిక లెక్కల ప్రకారం జనవరి 31 నాటికి 73.3లక్షల మంది వర్తకులు జీఎస్టీ రిటర్న్‌లను దాఖలు చేశారు. 2019 జనవరిలో వసూళ్లయిన జీఎస్టీలో కేంద్ర జీఎస్టీ రూ. 17,763 కోట్లుగాను, రాష్ట్ర జీఎస్టీ రూ. 24,826 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ రూ. 51,225 కోట్లు, సెస్ రూ. 8,690 కోట్లుగా ఉన్నాయి. గతేడాది ఏప్రిల్, అక్టోబరులోనూ వసూళ్లు లక్ష కోట్లు దాటాయి. 2018 ఏప్రిల్‌లో రూ.1.03లక్షల కోట్లు వసూళ్లు కాగా.. అక్టోబరులో రూ. 1,00,710 కోట్ల జీఎస్టీ వసూళ్లు నమోదయ్యాయి.

ఎన్ఎండీసీ ఘననీయమైన వృద్ధి


- మూడో త్రైమాసికంలో అద్భుత ఫలితాలు



హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ప్రభుత్వరంగ సంస్థ నేషనల్ మినరల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎండీసీ) ఘననీయమైన వృద్ధిని సాధించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో తొమ్మిది నెలలు ముగిసేనాటికి కంపెనీ టర్నోవర్ రూ. 8,509 కోట్లకు చేరింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో టర్నోవర్(రూ. 7,732కోట్లు)తో పోల్చితే దాదాపు 10శాతం వృద్ధిని సాధించింది. ప్రాఫిట్ బిఫోర్ ట్యాక్స్(పీబీటీ) కూడా క్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 19శాతం వృద్ధి సాధించి రూ. 5,001కోట్లకు చేరింది. ప్రాఫిట్ ఆఫ్టర్ ట్యాక్స్(పీఏటీ) కూడా 18శాతం వృద్ధి సాధించి రూ. 3,188కోట్లకు పెరిగింది. అలాగే మూడో త్రైమాసికంలోనూ మంచి వృద్ధిని సాధించింది. క్రితం ఏడాదితో పోల్చితే ఈ ఏడది మూడో త్రైమాసికంలో కంపెనీ టర్నోవర్ 48శాతం పెరిగి రూ. 3,649 కోట్లకు చేరింది. పీబీటీ రూ. 2,211 కోట్లు (61శాతం పెరుగుదల), పీఏటీ రూ. 1,577 కోట్ల (78శాతం పెరుగుదల)కు పెరిగింది. మూడో త్రైమాసికంలో 9.54 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్‌ల ఉత్పత్తి చేయగా, 8.70 మిలియన్ టన్నుల ఇనుము సేల్ చేసింది. ఈ గణాంకాలను ఐఏఎస్ ఎన్ బైజేంద్ర కుమార్ నేతృత్వంలోని కంపెనీ బోర్డు డైరెక్టర్లు ఆమోదించినట్టు యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. ఎన్నో ప్రతికూల సవాళ్లను అధిగమించి ఈ విజయాలు సాధించడంపై ఉద్యోగులు, బోర్డు సభ్యులకు కుమార్ అభినందనలు తెలిపారు.


పులుల సంరక్షణ పథకం అమలు చేయాలి

- హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విస్తరించిన కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో పులుల సంరక్షణ పథకాన్ని అమలు చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కొమురంభీమ్ జిల్లాల్లో విస్తరించి ఉన్న ఈ కేంద్రం ద్వారా పులుల సంరక్షణ పథకాన్ని అమలు చేసేలా తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని అభ్యర్థిస్తూ హైదరాబాద్ నగరంలోని బండ్లగూడకు చెందిన జాగిర్ దియా సూర్ పిల్ దాఖలు చేశారు.



ఇందులో ప్రతివాదులుగా కేంద్ర, రాష్ట్ర అటవీ శాఖలు, జాతీయ పులుల సంరక్షణ అథారిటీ, రాష్ట్ర అటవీ శాఖలను చేర్చారు. ఒకే మాసంలో రెండు పులులు మత్యువాతపడ్డాయని, మహారాష్ట్రలోని అటవీ ప్రాంతం నుంచి వచ్చిన సుమారు 20 పులులు కనిపించడం లేదని, అవి చనిపోయాయో, ఏమయ్యాయో తెలియడం లేదని పిల్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. పంటలు, ఆస్తుల రక్షణ కోసం విద్యుత్ పెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నందున పులులు మత్యువాతపడుతున్నాయని, దేశంలో 2002లో 3,642 పులులు ఉంటే 2008 నాటికి వాటి సంఖయ 1,411కు పడిపోయాయని, పులుల్ని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. పోడు వ్యవసాయం, అడవుల ఆక్రమణల కారణంగా పులులు తగ్గిపోతున్నాయన్నారు.

ఉద్యమమే బిక్షమయ్య జీవితం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉద్యమమే బిక్షమయ్య జీవితమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. కమ్యూనిస్టు నాయకుడు బిక్షమయ్య రచించిన 'ఎదురీత' (జీవితం, ఉద్యమం) పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తమ్మినేని మాట్లాడుతూ.. బిక్షమయ్యయ మాటలు నిస్సంకోచంగా, సూటిగా ఉంటాయనీ, చెప్పదలుచుకున్న విషయాన్ని కుండబద్దలు కొట్టినట్టు చెబుతారనీ అన్నారు. సామాజిక అణిచివేతకు గురైన కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి గొప్ప నాయకుడిగా ఎదిగారని కొనియాడారు. బిక్షమయ్యతో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. కుటుంబమంతా కమ్యూనిస్టులుగా ఉండడం చాలా గొప్ప విషయమని అన్నారు. నవతెలంగాణ దినపత్రిక ఎడిటర్ వీరయ్య మాట్లాడుతూ.. ఒక కమ్యూనిస్టు ఎలా బతకాలో సూచించే పుస్తకం 'ఎదురీత' అని అన్నారు. ప్రస్తుత సమాజంలో సౌకర్యాలు అనుభవించాలనే ఆలోచన అందరిలో పెరిగిపోతోందని దానికి కమ్యూనిస్టులు అతీతులు కాదన్నారు. కమ్యూనిస్టుల వ్యక్తిగత జీవితం, ఉద్యమ జీవితాన్ని వేరుగా చూడలేమన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ, సామాజిక వ్యవస్థ మీద ఉన్న కసి ఈ పుస్తకంలో కనిపిస్తుందన్నారు. వివక్షత నేపథ్యం నుంచి వచ్చి ఆ వివక్షత కలిగిన సమాజంపైనే పోరాటం చేసిన

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

- కమ్యూనిస్టు ఎలా బతకాలో చెప్పేది 'ఎదురీత':

నవతెలంగాణ ఎడిటర్ వీరయ్య

వ్యక్తి జీవితమే ఈ పుస్తకమని తెలిపారు. ఒక సీపీఐ(ఎం) కార్యకర్త పుస్తకం రాసుకోవడం గొప్ప విషయమనీ ప్రభుత్వ మాజీ ముఖ్య కార్యదర్శి కాకి మాధవరావు అన్నారు. అవసరమైన దగ్గర ప్రజాస్వామ్యవాదిగా.. అవసరం లేనిచోట ఇండియన్ స్టాలిన్‌లా ఉంటాడని ప్రజాకవి జయరాజ్ అన్నారు. సామాజిక వాస్తవిక పునాదుల నుంచి వచ్చిన రచనలు నిజమైనవి ప్రొఫెసర్ జయధీర్ తిరుమల్‌రావు అన్నారు. ప్రముఖ రచయిత జుపాక సుభద్ర మాట్లాడుతూ బిక్షమయ్య జీవితాన్ని ఈ పుస్తకం ద్వారా మన ముందు ఆవిష్కరించారన్నారు. ఇండో యూఎస్ చైర్మెన్ ప్రసాద్ రావు మాట్లాడుతూ పార్టీలకతీతంగా బిక్షమయ్య నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టారన్నారు. ప్రజాగాయకురాలు విమలక్క మాట్లాడుతూ లాల్-నీల్ జమిలి పోరాటాలు చేయడం ద్వారానే దోపిడీని అరికట్టవచ్చన్నారు. మొదుగుపూలు సంపాదకులు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమంలో బీఎల్ఎఫ్ చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, బొడ్లాడ గ్రామ సర్పంచ్ మంద సుష్మా, బిక్షమయ్య కుటుంబ సభ్యులు, సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోసం తెరపైకి తాయిలాలు

భయపెడుతున్న ద్రవ్యలోటు..ద్రవ్యోల్బణం :

కేంద్ర బడ్జెట్‌పై ఆర్థికరంగ నిపుణులు

వచ్చే ఎన్నికల్లో రాజకీయంగా లబ్ది పొందాలన్న తాపత్రయం 'కేంద్ర బడ్జెట్'లోని ప్రతీ పేజీలో కనపబడింది. ఈ బడ్జెట్‌తో దేశానికి, దేశ ప్రజలకు ఏమైనా ఉపయోగముందా? అని ఆర్థికరంగ నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నోట్లరద్దు అనంతరం దేశ ఆర్థిక పరిస్థితి దిగజారి ద్రవ్యలోటు, ద్రవ్యోల్బణం అదుపుతప్పాయనీ, కొత్త పథకాల్ని అమలుజేసే సత్తా ఈ బడ్జెట్‌కు లేదనీ వారు విశ్లేషించారు.



న్యూఢిల్లీ : పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన 'తాత్కాలిక బడ్జెట్'లో మోడీ సర్కార్ ఘనంగా చెప్పుకుంటున్న 'రైతు పథకం'పై పెద్ద చర్చ సాగుతోంది. మొదటి వాయిదాగా రూ.2వేలు ఇస్తామనీ, 12కోట్లమంది రైతులకు లబ్ది చేకూరుతుందనీ కేంద్రం తెలిపింది. ఈ పథకాన్ని ఎలా అమలుజేస్తారన్నది ఆర్థికరంగ నిపుణులకు అంతుచిక్కటం లేదు. కారణం దేశ ఆర్థిక పరిస్థితి ఎప్పుడో అదుపుతప్పిందనీ, ఖజానా ఎప్పుడో ఖాళీ అయ్యిందనీ వారు చెబుతున్నారు.

సార్వత్రిక ఎన్నికలు రెండు నెలల్లో ఉండగా 'రైతు పథకం' తీసుకురావటం వెనుకున్న ఉద్దేశం అందరూ అర్థం చేసుకోగలిగినదే. మొదటి వాయిదా కింద రూ.2వేలు ఇస్తామన్న మాట అమలుచేసేనాటికి ఎన్నికల ప్రకటన వచ్చేస్తుంది. ఆదాయ పన్ను పరిమితి పెంపు, పన్ను మినహాయింపులు...అంతా కూడా ఎన్నికల కోణంలో తయారుచేశారు. ఉన్నత మధ్యతరగతి ఆదాయ వర్గాల్ని గంపగుత్తగా తమవైపు తిప్పుకునే ప్రయత్నం ఇది. అసంఘటిత రంగంలో ఉన్న 10కోట్లమంది కోసం నెలకు రూ.3వేలు వృద్ధాప్య పింఛన్ అందజేస్తామని కొత్త పథకాన్ని కేంద్రం ప్రకటించింది. 18 ఏండ్లు ఉన్న వ్యక్తి నెలకు రూ.55, 25ఏండ్లు ఉన్న వ్యక్తి నెలకు రూ.100 కడితే...30 ఏండ్ల తర్వాత రూ.3వేలు ఇస్తామని కేంద్రం తెలిపింది. 2050లో రూ.3వేల పెన్షన్ ఒక కార్మికుడికి ఏవిధంగా సరిపోతుందో అర్థం కాని విషయం. అందునా కార్మికుడి నుంచి కొంత వసూలు చేస్తున్నారు.

ఆర్థిక పరిస్థితి ఆందోళనకరం

ద్రవ్యలోటుకు సంబంధించి తాత్కాలిక ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ ఒక విచిత్రమైన విషయాన్ని చెప్పారు. 2019 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు జీడీపీలో 3.4శాతానికి చేరుకుంటుందనీ, 3శాతం లక్ష్యానికి చాలా చేరువలో ఉన్నామనీ చెప్పారు. ద్రవ్యలోటు 3శాతం...అన్న లక్ష్యం 2008నాటిది. 2019 వచ్చినా ఇప్పటికీ సాధించలేకపోయారు. కేంద్ర ప్రభుత్వం చేసిన అప్పుల్ని బడ్జెట్‌లో చూపకుండా అంకెల గారడీ చేస్తోందని స్వయంగా కాగ్ అక్షింత లు వేసింది. ఉదాహరణ భారత ఆహార సంస్థ ఎఫ్‌సీఐ. లక్ష కోట్ల రూపాయలు ఎఫ్‌సీఐపై అప్పులు తెచ్చారు. ఈ మొత్తాల్ని బడ్జెట్‌లో చూపెట్టలేదు.

ఆర్‌బీఐ నిధులపై కన్ను..

ప్రభుత్వ రంగంలో పెరిగిన అప్పుల భారం, నోట్ల ముద్రణ అంతా కూడా ద్రవ్యోల్బణాన్ని పెంచుతున్నాయి. నోట్లరద్దు కారణంగా కేంద్ర రెవెన్యూ ఆదాయం కూడా పడిపోయింది. అందుకే ప్రభుత్వ రంగంలో పెట్టుబడుల ఉపసంహరణపై ఆశలు పెట్టుకుంది. డివిడెండ్ నిధుల కోసం ఆర్‌బీఐపై ఒత్తిడి తెస్తోంది. ఆర్‌బీఐ తనదగ్గర స్థాయికిమించి నిధుల్ని అట్టిపెట్టుకుందన్న ప్రచారాన్ని మోడీ సర్కార్ ముమ్మరం చేసింది. రైతులకోసం ప్రకటించిన కొత్త పథకాన్ని అమలుజేయాలంటే ఆర్‌బీఐ నుంచి బలవంతంగా తీసుకుంటున్న డివిడెండ్ నిధులే దిక్కు. ఇక మోడీ సర్కార్ నవంబరు 8, 2016లో తీసుకున్న నోట్లరద్దు నిర్ణయం ఫలించిందంటూ పియూష్ గోయల్ సమర్థించుకున్న తీరు నవ్వుతెప్పించింది. నల్లధనాన్ని వెలికితీయటం కోసం నోట్లరద్దు నిర్ణయం తీసుకున్నామని ప్రధాని మోడీ ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ అలాంటిదేమీ బయటకురాలేదనీ, 99.6శాతానికిపైగా పాతనోట్లు బ్యాంకులకు చేరాయనీ స్వయంగా ఆర్‌బీఐయే ప్రకటించింది. మరి అలాంటప్పుడు నోట్లరద్దు నిర్ణయం విఫలమా?సఫలమా?

జన్‌ఆక్రోశ్ ర్యాలీపై ఖాకీ వీరంగం

పోలీసుల లాఠీచార్జీ

- కేంద్ర మాజీ మంత్రి కుశ్వాహాకు గాయాలు, ఆస్పత్రిలో చేరిక



పాట్నా: బీహార్‌లో ఆర్ఎల్ఎస్పీ శాంతియుతంగా చేపట్టిన జన్‌ఆక్రోశ్ ర్యాలీపై ఖాకీలు విరుచుకుపడ్డారు. ఆ పార్టీ చీఫ్, కేంద్ర మాజీ మంత్రి ఉపేంద్ర కుశ్వాహ సహా పార్టీకి చెందిన పలువురు నాయకులపై పోలీసులు లాఠీచార్జికి చేశారు. ఈ ఘటనలో గాయపడిన కుశ్వాహ ఆస్పత్రిలో చేరారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను గాడిన పెట్టాలని అందులో తీసుకురావాల్సిన మార్పులపై ఆర్ఎల్ఎస్పీ ఈ ర్యాలీని చేపట్టింది. ఆర్జేడీ, జేడీ(యూ) పాలనలో రాష్ట్రంలో విద్యావ్యస్థ నశించిపోయిందని ర్యాలీలో పాల్గొన్న కుశ్వాహ ఆరోపించారు. పాట్నాలోని గాంధీ మైదాన్ నుంచి రాజ్‌భవన్ వరకు ర్యాలీగా వెళ్లి గవర్నర్‌కు మెమొరాండం సమర్పించాలని ముందుగా అనుకున్నారు. ఆ విధంగానే రాజ్‌భవన్ వైపు వారు ర్యాలీగా వెళ్లారు. అనంతరం ఎలాంటి హెచ్చరికలు లేకుండానే ఆర్ఎల్ఎస్పీ కార్యకర్తలపై పోలీసులు లాఠీ చార్జికి దిగారు. దొరికివారినందరిని లాఠీలతో పోలీసులు చితకబాదారు. కార్యకర్తలు కుశ్వాహను వేదిక నుంచి బయటకు తీసుకెళ్తున్న క్రమంలో ఆయనపై పోలీసులు లాఠీచార్జీ చేశారని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాదవ్ ఆనంద్ అన్నారు. పోలీసుల లాఠీచార్జిలో తాను, పార్టీ కార్యకర్తలు గాయపడ్డారని కుశ్వాహ తెలిపారు. పోలీసులు లాఠీచార్జిని ఖండించిన ఆయన.. సీఎం నితీశ్‌కుమార్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎంత మంది కుశ్వాహలపై మీరు దాడి చేస్తారు? మీ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా గొంతెత్తడానికి అనేక మంది కుశ్వాహలు వస్తారు' అని నితీశ్ సర్కారును ఆయన హెచ్చరించారు. పోలీసుల లాఠీచార్జిలో గాయపడిన కుశ్వాహను పార్టీ కార్యకర్తలు ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించగా ఆయన చికిత్స పొందుతున్నారు.

కుశ్వాహ అధినాయకత్వంలోని ఆర్ఎల్ఎస్పీ.. బీహార్‌లోని ఎంపీ సీట్ల పంపకంలో తలెత్తిన విభేదాల నేపథ్యంలో కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి గత డిసెంబరులోనే ఎన్డీయే నుంచి బయటకొచ్చారు. అనంతరం కాంగ్రెస్, ఆర్జేడీల మహాఘట్‌బంధన్‌తో ఆయన చేతులు కలిపారు. కాగా, బీహార్‌లో పాలక ఎన్డీయే ప్రభుత్వం నుంచి బయటకొచ్చిన తర్వాత నితీశ్ సర్కారు ఆయనపై పోలీసులతో లాఠీచార్జీ చేయించడం గమనార్హం.



మీ అపజయాన్ని తప్పటడుగులని ఎప్పుడూ అనుకోకండి. అవి తప్పులు కావు. భవిష్యత్తులో మీరేం చేయకూడదో తెలిపే పాఠాలు.

– అబ్దుల్ కలాం



అంతా టిక్ టాక్ మయం

సోషల్ మీడియా వేదికగా తమ వీడియోలతో దుమ్ము దులిపేస్తున్నారు యువత. తమ నటన, డ్యాన్సులతో లక్షల్లో ఫ్యాన్స్‌ను సంపాదించు కుంటున్నారు. ఒకప్పుడు డబ్‌స్మాష్‌లు చేయగా.. ఇప్పుడు సోషల్ మీడియా మొత్తం టిక్ టాక్‌తో మారుమోగుతోంది. మ్యూజిక్ క్లిప్స్‌కు తమ నటనను జోడిస్తూ సెలబ్రిటీలుగా మారిపోతున్నారు. మరి ఆ విశేషాలేంటో చూద్దాం..



ఈ మధ్య కాలంలో యూత్‌ని ఎక్కువగా అట్రాక్ట్ చేసింది 'టిక్ టాక్' యాప్. ఇప్పుడు ఈ 'టిక్ టాక్' కి యూత్ బాగా అడిక్ట్ అయ్యారు. టిక్ టాక్ అనే యాప్ చూడటానికి డబ్‌స్మాష్‌లానే ఉంటుంది. కానీ, ఇందులో మ్యూజికల్ వీడియోస్ ఉంటాయి. ఈ యాప్ ద్వారా ఒకే వీడియోలో ఇద్దరూ కూడా పార్టిసిపేట్ చేయొచ్చు. అంటే.. ఆల్రెడీ చేసిన వీడియోని ఇతరులు కూడా వాడొచ్చు. డైలాగ్స్, ఎమోషన్స్, సాంగ్స్ ఈ ఎమోషన్స్ అన్ని ఈ 'టిక్ టాక్' ద్వారా యూత్ తమ టాలెంట్‌ని ప్రపంచానికి పరిచయం చేసుకుంటున్నారు.

మోస్ట్ ఎంటర్‌టైనింగ్ యాప్‌గా

తమని తాము ప్రూవ్ చేసుకుని సోషల్ మీడియాలో సత్తా చాటి రంగుల ప్రపంచంలోకి అడుగుపెడదామని కలలుకంటున్న యూత్ మొత్తం 'టిక్‌టాక్'కి అడిక్ట్ అవుతున్నారు. ఈ కారణం చేతనే 2018లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసిన మోస్ట్ ఎంటర్‌టైనింగ్ యాప్ అవార్డు పొందింది 'టిక్ టాక్'. ఈ టిక్ టాక్ లో చిన్న పిల్లల నుండి పెద్దల వరకు తమ టాలెంట్ తో వీడియోలు చేస్తూ ఫేమస్ అవుతున్నారు. వీరు చేసిన వీడియోకి లైక్స్ కూడా ఉంటాయి. ఎవరికి ఎక్కువ లైక్స్ వస్తే వారు ఫేమస్ అవుతు ఉంటారు. లైకుల కోసం వారు తమ టాలెంట్ ను బయటకు తీస్తున్నారు. కొంత మంది ఫన్నీ, చేస్తే కొంత మంది సాడ్ ఎమోషన్స్‌తో వీడియోలు చేస్తున్నారు. ఇక మరికొంత మంది తమ డ్యాన్స్ తో వీడియోలు చేస్తు అందరిని అట్రాక్ట్ చేస్తున్నారు.



పల్లెల నుండి ఎక్కువ

టిక్ టాక్‌లో వీడియోలు చేస్తున్న భారతీయుల్లో అధిక శాతం మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు ఉండడం గమనార్హం. దీనిబట్టి 'టిక్ టాక్' ఎంత పాపులర్ అయిందో అర్థం చేసుకోవచ్చు. యూట్యూబ్‌కి పోటీగా టిక్ టాక్ వీడియోలు చేసేవారికి కూడా, భారీ మొత్తంలో ఫాలోయర్స్ ఉంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతీ యువకులు తమ దగ్గర ఉన్న వినూత్నమైన ఆలోచనలను టిక్ టాక్ వీడియోల రూపంలో షూట్ చేసి అప్లోడ్ చేస్తున్నారు. వీరికి ఫాలోయింగ్ బాగా పెరుగుతుంది.

చైనాలో ప్రారంభమైన టిక్ టాక్

2016లో చైనాలో ఈ ప్రారంభించబడిన ఈ అప్లికేషన్ పాపులారిటీ గత సంవత్సరం Musical.ly లో విలీనమైన తర్వాత మరింత పెరిగింది. ఎలాంటి ప్రత్యేకమైన సెటప్ లేకుండా ఫోన్‌ని చేతిలో పట్టుకుని గానీ లేదా సెల్ఫీ స్టిక్ ఉపయోగించి కానీ రెడీమేడ్‌గా ఉండే డైలాగులు, పాటలకు తగ్గట్లు లిప్ సింక్ చేస్తూ చాలా వేగంగా వీడియోలు చేయగలగటం అందరినీ బాగా ఆకర్షించింది.

'టిక్ టాక్' టీషర్ట్స్

టిక్ టాక్ ఎంత ఫేమస్ అయ్యిందంటే టిక్ టాక్ పేరుతో టీషర్ట్స్ కూడా వచ్చాయి. టిక్ టాక్ లోగోతో టీషర్ట్స్ కూడా మార్కెట్లోకి వచ్చాయి. ఈ టీషర్ట్స్‌ను యువకులను బాగా అట్రాక్ట్ చేస్తున్నాయి.

లైక్స్ కోసం ప్రమాదకర స్టంట్స్

అయితే, టిక్‌టాక్‌లో కొంతమంది యూత్ తమ వీడియోలకు ఎక్కువగ లైక్స్ రావాలని ప్రమాదకరమైన స్టంట్స్ చేస్తున్నారు. ఇటీవల ఓ వ్యక్తి ట్రాక్టర్ కింద పడి చనిపోయాడు కూడా. మరి కొంత మంది ప్రమాద అంచుల వరకు వెళ్లి వచ్చారు కూడా. ఈ టిక్ టాక్ వీడియోల కోసం యూత్ తమ ప్రాణలను సైతం లేక్క చేయకుండా లైక్స్ కోసం వీడియోలు చేస్తున్నారు. అందుకే ఇలాంటి విషయాల్లో మాత్రం అప్రమత్తంగా ఉండాలి.

అడల్ట్ కంటెంట్‌తో...

'టిక్ టాక్'లో కొంతమంది అడల్ట్ కంటెంట్‌ని కూడా అప్‌లోడ్ చేస్తున్నారు. కొందరు యువతులు... రకరకాల ఫోజులతో చెలరేగిపోతుండడం, మరికొంత అసభ్యకరమైన పదాలు వాడడం, మరికొంతమంది వికృతచేష్టలు, పిచ్చి పనులు చేస్తూ కూడా ఆ వీడియోలను టిక్‌టాక్‌లో పోస్ట్ చేస్తూ పెడదోవ పట్టిస్తున్నారు. ఇలాంటివి అప్‌లోడ్ చేసుకునే సమయంలో జాగ్రత్త అవసరం.



- కె.రాజ్
8977442962

ఈ పాటలకి ....వీరే డాక్టర్లు



చూపుల్తో గుచ్చి గుచ్చి చంపకే – నేత్ర వైద్యుడు
మౌనంగానే మనసు పాడిన ప్రేమగానమును వింటినే- Cardiologist
అందంగాలేనా..అసలేం బాలేనా – Cosmetologist
గాలివానలో, వాననీటిలో పడవ ప్రయాణం– ENDOCRINOLOGIST
మాటరాని మౌనమిది – ENT
ఈనాటి ఈ బంధమేనాటిదో – ORTHOPEDIC
చీమకుట్టిందా...చిరచిరలాడిందా – SKIN
చట్టానికి, న్యాయానికి జరిగిన సంగ్రామంలో – PULMANOLOGIST
చినుకు చినుకు పడుతూఉంటే – UROLOGIST
ఇది తీయని, వెన్నెల రేయి – Diabetologist
ఆకలుండదు...దాహముండదు – GASTEROENTEROLOGIST
సిరిమల్లె పువ్వల్లె నవ్వు – DENTIST
జగమేమాయ బతుకేమాయ – PSYCHIATRIST
ఏమోఏమో ఇది.నాకేదోఏదో అయినదీ – GENERAL PHYSICIAN

ఫన్.కాం

గ్రహం మారితే...



మీ బరువు భూమి మీద 100 కేజీలైతే మార్స్ మీద 38 కేజీలు, అదే చంద్రుడి మీదైతే 16.6 kg మాత్రమే...అంటే లావుగా ఉండడం ప్రాబ్లెమ్ కాదు, మీరు ఉండకూడని గ్రహం మీద ఉండడమే ప్రాబ్లెమ్. కాబట్టి మీరు ఆహార నియమాలు మార్చుకోవలసిన పనే లేదు.. గ్రహం మారితే సరిపోతుంది....come on ....lets go

నాస్టాల్జియా



ఫైన్ బిస్కెట్...

హైదరాబాదీలందరికీ ఫైన్ బిస్కెట్ అంటే మహాప్రీతి. ఉస్మానియా బిస్కెట్‌కే పరిమితం కాకుండా అప్పుడప్పుడు ఫైన్ బిస్కెట్ కూడా ట్రై చేయండి. మీ చాయ్‌కి మంచి రుచి తోడవుతుంది. ఫైన్ బిస్కెట్ ను అలా తుంచి తింటూంటే... ఆ అనుభవాన్ని మాటల్లో వర్ణించలేం.

ఫైన్ బిస్కెట్ ముక్కను అలా టీ కప్పులో ముంచగానే పొరలుపొరలుగా వస్తూ.. దాన్ని ముంచిన చాయ్ సిప్ చేయగానే అద్భుతమైన రుచిని అందిస్తుంది. ఇక ఫైన్ బిస్కెట్ పై అంటుకుని ఉండే చక్కెర దోరగా వేగిన పొరతో కరకరలాడుతూ నోట్లో వేసుకోగానే అలా కరిగిపోతూ మరింత రుచిని అందిస్తుంది. ఎన్ని మాటలు చెప్పుకున్నా ఒక్క ఫైన్ బిస్కెట్స్ తింటే... ఆ అనుభూతి ముందు ఈ మాటలన్నీ దిగదుడుపే. హైదరాబాద్‌లో ఉండే వాళ్ళు వెంటనే ఓ సారి రుచి చూడండి. ఇతర ప్రాంతాల నుండి వచ్చే వారైతే ఈసారి హైదరాబాద్ వస్తే మాత్రం కచ్చితంగా రుచి చూస్తారు కదూ!

- ఎన్.కె

గాబరా పనులు వద్దు

మనం ప్రతిరోజూ ఉదయాన్నే లేవగానే మొహం కడుక్కుని, తలస్నానాలు చేసి, తొందర తొందరగా ఆఫీసులకు వెళ్లిపోతాం. ఒక్కోసారైతే ఇవేమీ పట్టించుకోకుండా గాబరాగాబరాగా పనుల్లోకి పరుగులు తీస్తాం. దీనివల్ల మన ఆరోగ్యానికి ప్రమాదమే కాకుండా, మనం చేస్తున్న పనులలో సామర్థ్యాన్ని కూడా కోల్పోతున్నాం. కాబట్టి మన ఆలోచనలను, పనిచేసే విధినిర్వహణలలో అప్పుడప్పుడూ కొన్ని మార్పులు చేసుకుంటే చాలా మంచిది. అవేవో ఒకసారి చూద్దాం....



దినచర్యల్లో కొన్ని మార్పుల వల్ల మన సామాజిక ద కృథం పెరగడమే గాక ప్రతి ఒక్క విషయంలో చురుకుగా పాల్గొంటామని సూచిస్తున్నారు నిపుణులు. దీనికితోడు మనం పనిచేసే వాతావరణం, పరసరాలను బట్టి మనం చేసే పనులలో కూడా మార్పు వుంటుందని నిపుణులు చెబుతున్నారు. మనం పని చేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలను పాటిస్తే.. మన సామర్థ్యాన్ని మరింతగా పెంచుకోవచ్చని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

నిబంధనలు పెట్టుకుంటే

మనం ఆఫీసులలో చాలావరకు 8 నుండి 10 గంటలవరకు సమయాన్ని కేటాయిస్తుంటాం. ఆ సమయాలలో చేసే పనిని ఇంకా తక్కువ సమయంలో పూర్తి చేసుకోవాలని నిబంధన పెట్టుకుంటే... అప్పుడు మనలో వున్న సామర్థ్యం మరింతగా పెరుగుతుందంటున్నారు. ఇలా చేయడం ద్వారా మనం మన పనిగంటల్ని ఇంకా తక్కువ చేసుకోవచ్చు.



విశ్రాంతి లభిస్తుంది

మనకు అప్పగించిన పనిని తక్కువ సమయంలో పూర్తి చేసుకోవడం ద్వారా మనకు మిగిలిన సమయం ఆదా అవుతుంది. దాంతో కొంచెం విశ్రాంతి కూడా లభిస్తుంది. దీనివల్ల మెదడు కొంచెం రిలీఫ్ అయి, మనలో వున్న సామర్థ్యాన్ని పెంపొదిస్తుంది.

మెదడు చురుకౌతుంది

ఉదయాన్నే లేవగానే అరగంటసేపు వ్యాయామం చేసుకుంటే మెదడు చురుకుదనం పెరుగుతుందని సలహా ఇస్తున్నారు నిపుణులు. దీంతో మనం కూడా మనం చేసే కార్యాకాలపాలలో చురుకుగా పాల్గొనడమే కాకుండా ఏకాగ్రతగా నిర్వహించుకోవచ్చు.

పరిశోధించి చెబుతున్నారు

అలాగే ఉదయాన్నే లేచి మనం ఇష్టారాజ్యంగా, అదేపనిగా వార్తలు చదవడం కూడా మంచిది కాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే మెదడు కూడా మన శరీరంలో ఒక భాగమే. అది కూడా నిరంతరం పనిచేస్తూ వుంటుంది. దానికంటూ విశ్రాంతి కావాలి. ఉదయాన్నే లేవగానే న్యూస్ చదవడం వల్ల ఆ ప్రభావం మన మానసిక స్థితిపై ప్రభావం పడొచ్చంటున్నారు. మెదడుకు ఎక్కువ స్ట్రెస్ ఇవ్వకుండా రిలీఫ్ కోసం కాస్త వ్యాయామం చేసుకోవాలని, ఆ తర్వాతే మిగిలిన విషయాల గురించి ఆలోచిస్తే మంచిదని నిపుణులు తమ పరిశోధనల ద్వారా వెల్లడిస్తున్నారు.

స్మార్ట్ మీడియాతో కష్టాలు

ఒకవైపు వీడియో చూస్తుంటాం. మరో వైపు వాట్సాప్ మెసేజ్ టోనర్ వినిపిస్తుంది. వెంటనే ట్విట్టర్‌లో కూత... మరుక్షణంలో ఫేస్‌బుక్ నోటిఫికేషన్. ఇవి చాలదన్నట్టు స్కైప్‌లో కాల్... ఈ మధ్య కాలంలో ఇంతగా బిజీ అయిపోయాం. సోషల్ మీడియా స్మార్ట్ అయ్యాక చాలామందికి ఇలా మల్టీ టాలెంట్ చూపక తప్పట్లేదు. కానీ మల్టిపుల్ సోషల్ మీడియా యాక్టివిటీస్‌తో మల్టిపుల్ కష్టాలు తప్పవంటున్నారు నిపుణులు. లిప్తపాటులో సామాజిక



మాధ్యమాలన్నీ చుట్టేయటం అలవాటైతే డిప్రెషన్‌లోకి వెళ్లిపోవడం ఖాయమని హెచ్చరిస్తున్నారు. ఇతరులతో పోలిస్తే యంగ్ ఏజ్‌లో ఉన్నవారిలో ఈ రిస్క్ మూడింతలు ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. అమెరికాలోని పిట్స్‌బర్గ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఈ స్టడీ నిర్వహించారు. అందులో బాగంగా 19–32 ఏండ్ల మధ్య ఉన్న 17,50 మందిని ప్రశ్నించారు. ఏడు నుంచి పదకొండు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వాడుతున్నవారు. యాంగ్జైటీకిలోనై డిప్రెషనలోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందట. ఒకటి లేదా రెండు యాప్‌లతో దోస్తే చేస్తే ఎలాంటి ప్రమాదమూ లేదంటున్నారు. అయితే మరీ ఎక్కువ సమయం వాటితోనే గడిపినా డిప్రెషన్ తప్పదని సెలవిస్తున్నారు.



ప్రియరాగం

కనుల కొలనులో
కలల తామరలు
వేడి నిట్టూర్పుల పరిమళ శ్వాసలో
వెన్నెల స్పర్శల తన్మయోపశమనం
మలయమారుత యవనాశ్వం
తీగల మేనిపై దౌడుతీస్తున్న ప్రియరాగమై
ఊహల మధువు పొదువుకున్న
సోయగాల ఆశలు విరిసిన
పుడమి పూల జల్లై మురియగ
మెరుపులీనే తళుకు పెదవులపై
మధుర భావాల మరుల ఝురులతో
రేతిరి పరదాలో రాజుకున్న అలజడి
దిక్కుల గదిలో మేలుకున్న
తీయని జ్ఞాపకమై
పక్కున నవ్విన ఉదయపు అలికిడికి
రెప్పల రెక్కలు రివ్వున చాచి
విడిచిపోయింది తలపుల గాయం!

దేగల అనితాసూరి,
హైదరాబాద్, 9247500819.

మీరూ రాయొచ్చు

హాయ్ ఫ్రెండ్స్. ఈ పేజీకి మీరేదైనా రాయాలను కుంటున్నారా.. అయితే ఆలస్యం దేనికి? కలం పట్టండి. ముఖ్యమైన ఈవెంట్స్, సక్సెస్ స్టోరీలు, కవితలు, జోకులు ఇలా యూత్‌కు సంబంధించి సమాచారం ఏదైనా సరే మాకు పంపండి.

మా అడ్రస్ : జోష్ పేజీ, నవ తెలంగాణ తెలుగు దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నం. 21/1, ఆజామాబాద్, ఆర్.టి.సి కళ్యాణ మండపం వీధి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ – 500020. e-mail : navatelangana.josh @gmail.com



ఆత్మవిశ్వాసానికి పరీక్ష



- రికార్డు విజయంపైనే టీమిండియా గురి
- నేడు కివీస్‌తో చివరి వన్డే

ఉదయం 7.30 ని.ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



వెల్లింగ్టన్

న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా టీమిండియా తొలి మూడు వన్డేల్లో భారీ విజయాలను నమోదు చేసుకుంది. విరాట్‌కు విశ్రాంతి, గాయం కారణంగా ధోనీ టీమిండియాకు దూరం కావడంతో నాల్గో వన్డేలో ఘోర పరాజయాన్ని చవిచూసింది. భారీస్కోర్‌లను కివీస్‌పై అలవోకగా ఛేదించిన జట్టు ఒక్కసారిగా మూడంకెల స్కోర్‌కు చేరుకోలేకపోయింది. దీంతో భారత్ జట్టు నిలకడపై మళ్లీ అనుమానాలు మొదలయ్యాయి. అయితే న్యూజిలాండ్‌తో ఆదివారం జరిగే ఐదో వన్డేలో గెలిచి 52 ఏళ్ల రికార్డును సమం చేయాలని టీమిండియా భావిస్తోంది. నేటి మ్యాచ్‌లో భారత్ మరో భారీ విజయాన్ని నమోదు చేస్తుందో లేక 2008లో 3-1 రికార్డును సమం చేస్తుందో చూడాలి.

ఈ తరుణంలో నేటి చివరి వన్డేమ్యాచ్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది. మునుపటి మ్యాచ్‌లాగే టాప్ ఆర్డర్ చేతులెత్తేసి మరిన్ని చెత్త రికార్డులను మూటగడతారో లేక ఈ మ్యాచ్‌ను గెలిచి ప్రపంచకప్‌కు ఫేవరేట్‌గా బరిలోకి దిగుతుందో వేచిచూడాల్సిందే.

అరంగేట్రం మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్ నిరాశపరిచాడు. దీంతో ఈ వన్డేలో అతని ప్రదర్శనపైనా ఆసక్తి నెలకొంది. ఎందుకుంటే నాల్గో వన్డేలో కేవలం తొమ్మిది పరుగులు మాత్రమే చేశాడు. ఈ నేపథ్యంలో ఐదోవన్డేలో ఖచ్చితంగా రాణించాల్సిన అవసరమెంతైనా ఉంది.

గాయం కారణంగా మూడు, నాల్గో వన్డేలకు దూరమైన ధోని ఐదో వన్డేలో ఆడే అవకాశముంది. ఇంకోవైపు రోహిత్ శర్మ సారథ్యం కూడా తన కెరీర్‌కు బాసటగా ఈ వన్డే నిలవనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి టీ20ల్లోనూ సత్తా చాటాలని అభిమానులు అశపడుతున్నారు.

టీమిండియా జట్టు : రోహిత్ శర్మ(కెప్టెన్), శిఖర్ ధావన్, అంబటి రాయుడు, కేదర్ జాదవ్, ధోనీ(కీపర్), దినేష్ కార్తీక్, హార్థిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, మహ్మద్ షమి, సిరాజ్, జడేజా, ఖలీల్ అహ్మద్.

న్యూజిలాండ్ జట్టు : విలియమ్సన్(కెప్టెన్), గుప్టిల్, మాన్రో, టేలర్, లూథమ్(కీపర్), నికోల్స్, నీషమ్, సాంట్నర్, అస్టిల్, ఫెర్గుస్సన్, బౌల్ట్, గ్రాంథోమ్, టిమ్ సౌథీ, హెన్రీ.

మంధాన ' 1

- బౌలింగ్‌లో గోస్వామికి నాల్గోస్థానం
- ఐసిసి వన్డే ర్యాంకులు విడుదల



ముంబయి: అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి(ఐసిసి) తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో మహిళల జట్టు ఓపెనర్ స్మృతి మంధాన టాప్ ర్యాంక్‌లో నిలిచింది. కివీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో మంధాన బ్యాటింగ్‌లో రాణించిన సంగతి తెలిసిందే. దీంతో మూడు స్థానాలు ఎగబాకి అగ్రస్థానానికి చేరుకుంది. తొలివన్డేలో 105, రెండో వన్డేలో 90 పరుగులు చేసి సిరీస్ గెలుపులో కీలక పాత్ర పోషించింది. ఇక బౌలింగ్ విభాగంలో స్పిన్నర్లు పూనమ్ యాదవ్, దీప్తిశర్మ ఐదు స్థానాలు మెరుగు పరుచుకుని ఎనిమిది, తొమ్మిది స్థానాల్లో నిలిచారు. ఏక్తా బిస్త్ 13 స్థానాన్ని, ఝులన్ గోస్వామి నాలుగో స్థానంలో నిలిచింది. టాప్-5 మంది బౌలర్లలో నిలిచిన ఏకైక టీమిండియా బౌలర్ ఝులన్ ఒక్కటే కావడం విశేషం.

విశాఖలో టీ20 మ్యాచ్‌కు ఏర్పాట్లు

- ఫిబ్రవరి 24 భారత్- ఆస్ట్రేలియా మధ్య పోరు
- ఫిబ్రవరి 4 నుంచి ఆన్‌లైన్‌లో విక్రయాలకు సన్నాహాలు

నవతెలంగాణ- గ్రేటర్ విశాఖ బ్యూరో

భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరగనున్న టీ 20 మ్యాచ్‌కు విశాఖ ఆతిథ్యమివ్వనుంది. ఫిబ్రవరి 24న జరిగే ఈ మ్యాచ్‌కు పోతినమల్లయ్యపాలెంలోని ఎసిఎ-విడిసిఎ స్టేడియం వేదిక కానుంది. స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగే టీ20, వన్డే సిరీసకు సంబంధించిన అధికారిక షెడ్యూల్‌ను భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) ఇప్పటికే విడుదల చేసింది. తొలి టీ20 మ్యాచ్‌ను విశాఖలో ఆడనుండగా రెండో టి20 మ్యాచ్‌ను బెంగళూరుకు కేటాయిస్తున్నట్లు బిసిసిఐ ప్రకటించింది. విశాఖకు కేటాయించిన టీ20 మ్యాచ్ నిర్వహణకు నిర్వాహకులు కసరత్తు మొదలు పెట్టారు.



విశాఖ ఎసిఎ-విడిసిఎ మైదానంలో ఇటీవల నాలుగు రోజులు పాటు రంజీ మ్యాచ్‌లు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పిచ్‌ను టి20కు మార్చే పనిలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. టి20లో బ్యాటింగ్‌కు అనుకూలంగా ఈ పిచ్‌ను తయారు చేయనున్నారు. విశాఖలో ఇప్పటికే రెండు అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు నిర్వహించిన అనుభవం ఇక్కడ ఎసిఎకు ఉంది. గతేడాది అక్టోబరు 24న భారత్, వెస్టిండీస్ మధ్య జరిగిన వన్డే మ్యాచ్‌కు ఆతిథ్యమిచ్చిన విశాఖకు ఈ ఏడాది ప్రారంభంలోనే ఫిబ్రవరి 24న ఆస్ట్రేలియా, భారత్ మధ్య ఇంటర్నేషనల్ టీ20 మ్యాచ్ నిర్వహణకు అవకాశం రావడం విశేషం. ఈ మ్యాచ్‌కు వేదికగా నిలుస్తున్న ఏసీఏ-వీడీసీఏ స్టేడియానికి ఇప్పటివరకు రెండు టీ20 మ్యాచ్‌లు కేటాయించారు. 2012 సెప్టెంబరు 8న భారత్, న్యూజిలాండ్ మధ్య జరగాల్సిన టీ20 మ్యాచ్ భారీ వర్షం కారణంగా రద్దయ్యింది. 2016 ఫిబ్రవరి 14న శ్రీలంకతో జరిగిన టీ20 మ్యాచ్‌లో భారత్ తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో సుమారు మూడేళ్ల తర్వాత మరోసారి అంతర్జాతీయ 20 మ్యాచ్ విశాఖలో జరగడంతో ఈ మ్యాచ్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇవీ టిక్కెట్ల ధరలు

ఫిబ్రవరి 24న భారత్- ఆస్ట్రేలియా జట్ల మధ్య జరగనున్న తొలి టీ20 మ్యాచ్‌కు కావాల్సిన టిక్కెట్ల ధరలను రూ.500, రూ.1200, రూ.1600, రూ.2వేలు, రూ.4వేలుగా టిక్కెట్లను అందుబాటులో ఉంచుతున్నారు. వీటిని ఫిబ్రవరి 4 నుంచి www.eventsnow.com ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ఫిబ్రవరి 15 నుంచి ఆఫ్‌లైన్‌లో కూడా విశాఖ కేంద్రంగా 10 కౌంటర్లలో టిక్కెట్లును అందుబాటులో ఉంచనున్నారు.

కష్టాల్లో లంక

కరుణరత్నేకు తప్పిన ముప్పు
ఆసీస్ 534/5 డిక్లేర్డ్



కాన్‌బెర్రా : రెండో టెస్టులో ఆస్ట్రేలియా పరుగుల వరద పారించింది. ఓవర్‌నైట్ స్కోరు నాలుగు వికెట్ల నష్టానికి 384 పరుగులతో శనివారం బ్యాటింగ్ ప్రారంభించిన ఆసీస్ ఐదు వికెట్ల నష్టానికి 534 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. బర్న్స్ 180, హెడ్ 161 పరుగుల వద్ద ఔట్‌కాగా.. పీటర్సన్ (114 నాటౌట్) సెంచరీలతో కదం తొక్కాడు. లంక బౌలర్లు ఫెర్నాండో మూడు, రజిత, కరుణరత్నే చెరో వికెట్ దక్కాయి.

అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన శ్రీలంక రెండోరోజు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. కరుణరత్నే 46(రిటైర్డ్‌హర్ట్), తిరుమన్నే 41, మెండీస్ 6, కెప్టెన్ చండీమాల్ 15 పరుగుల వద్ద ఔటయ్యారు. పెరీరా (11), డిసిల్వ(1) క్రీజ్‌లో ఉన్నారు. కమిన్స్, స్టార్క్, లియాన్‌లకు తలా ఒక వికెట్ దక్కాయి.


కరుణరత్నేకు గాయం

శ్రీలంకకు చెందిన కరుణరత్నేకు ప్రమాదం తప్పింది. కమిన్స్ వేసిన 31.4వ బంతి బ్యాటింగ్ చేస్తున్న కరుణరత్నే తల వెనుకభాగంలో బలంగా తగిలింది. దీంతో అతనిని వెంటనే ఆసుపత్రికి తరలించగా ప్రమాదం లేదని డాక్టర్లు తేల్చారు. దీంతో ఇరుజట్ల ఆటగాళ్లు ఊపిరి పీల్చుకున్నారు. అతను రెండో టెస్ట్‌లో కొనసాగేది లేనిది ఆదివారం తెలియనుంది.

ఆరంభ శూరత్వం...

లక్ష్యానికి దూరంగా...
స్మార్ట్ సిటీలు, అమృత్, పీఎం ఆవాస్ యోజన
- వీటిపై కేంద్ర సాయం 7-20శాతమే
- కాగితాలపై..గొప్ప గొప్ప ప్రణాళికలు, ప్రకటనలు

పట్టణాలు, నగరాల అభివృద్ధి కోసం 2015లో మోడీ సర్కార్ మూడు భారీ పథకాల్ని ప్రవేశపెట్టింది. స్మార్ట్ నగరాలు, అటల్ మిషన్ : పట్టణాల పునరుజ్జీవనం, పరివర్తన (అమృత్), పీఎం ఆవాస్ యోజన(హౌసింగ్ స్కీం)...అనే ఈ మూడు పథకాల్ని ఘనమైన ప్రచారంతో ప్రారంభించి దేశ ప్రజల్లో ఎన్నో ఆశల్ని కల్పించారు. ఐదేండ్లు గడిచాయి...వీటిపై రాష్ట్రాలకు కేంద్రం అందించిన నిధులు, సాయం...7-20శాతంగా ఉందని ఒక అధ్యయనం తేల్చింది.



న్యూఢిల్లీ : పట్టణాల అభివృద్ధిపై మోడీ సర్కార్ ప్రకటించిన పథకాలు, పట్టణ పేద ప్రజలకు ప్రకటించిన గృహ పథకం...ఫలితాలు తెలుసుకుంటే సగటు పౌరుడి గుండె చెరువవుతుంది. మొత్తం మూడు పథకాల్లో 2019-20, 2021-22నాటికి మూడోవంతు పనులు కూడా పూర్తికావటం లేదు. పథకాల అమలుతీరు ఇలా ఉంటే, అర్బన్ పట్టణాల్లో నిత్యం పెరుగుతున్న జనాభా పరిస్థితి ఏంగాను? పట్టణాల్లో పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుంటే, 2031నాటికి అర్బన్ ప్రాంత జనాభా 41శాతానికి చేరుకుంటుంది. ఇప్పుడున్న దానికి రెట్టింపు...అనగా...60కోట్ల జనాభాతో అర్బన్ ప్రాంతాలు కిటకిటలాడుతాయి. అర్బన్ ప్రాంతాలతో గ్రామాల్ని అనుసంధానం, సంఘటితం చేయాల్సిన అవసరమెంతో ఉందనీ, జీడీపీలో 60శాతం ఇక్కడ్నుంచే వస్తుందనీ కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కమిటీ 2014-15 నివేదక తేల్చింది. నగరాల్లో గృహ నిర్మాణాలు, తాగునీరు, మురుగునీటి వ్యవస్థ, పారిశుద్ధ్యం, ఇతర ప్రణాళికలు పక్కాగా అమలుజేయాలని కేంద్ర ప్రభుత్వమే తీర్మానించింది. దేశంలోని పెద్ద పెద్ద గ్రామాల్లో జనాభా కూడా నిత్యం పెరుగుతోంది. 'ఇండియా స్పెండ్' చేసిన అధ్యయనం ప్రకారం 19 కోట్ల జనాభా పెద్ద పెద్ద గ్రామాల్లో నివసిస్తోంది. ఇది బంగ్లాదేశ్, శ్రీలంక జనాభా కంటే ఎక్కువ. ఇప్పుడు ఈ జనాభా అంతా కూడా సరైన జీవన ప్రమాణాలు లేని పరిస్థితుల్లో రోజులు వెళ్లదీస్తోంది.

స్మార్ట్ సిటిస్..7శాతం పనులయ్యాయి

ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో పట్టణాల అభివృద్ధి పథకాలపై బడ్జెట్‌లో కేటాయించిన నిధులు కేవలం 1.7శాతం. 2017-18లో బడ్జెట్‌లో 1.9శాతం నిధుల్ని కేటాయించారు. ఉదాహరణకు స్మార్ట్ సిటీ పథకాన్నే తీసుకుంటే, రూ.48వేల కోట్లు వ్యయం చేస్తున్నామని 2015లో చెప్పింది. ఈ నాలుగున్నరేండ్లలో బడ్జెట్ కేటాయింపులు రూ.16,604కోట్లు మాత్రమే. ఇందులో కేవలం రూ.3,560కోట్లు నిధులు వ్యయం అయ్యాయి. కేవలం 7శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. కాంట్రాక్ట్ పనుల తీరు ఇలా ఉంటే 2022నాటికి దేశంలోని 100నగరాలు స్మార్ట్ సిటీస్‌గా మారుతాయా?

'అమృత్' పథకం

'అటల్ మిషన్ ఫర్ రీజెన్‌నేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫార్మేషన్'కు సంక్షిప్తమే 'అమృత్'. జవహరలాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెవ్యూవల్ మిషన్‌కు పేరుమార్చి మోడీ సర్కార్ తీసుకొచ్చిన పాత కొత్త పథకం 'అమృత్'. ఈ పథకం కోసం రాష్ట్రాలకు కేంద్రం సాయంగా రూ.50వేల కోట్లు ఇస్తామని ప్రకటించారు. ఈ ఐదేండ్లకాలంలో ఇప్పటివరకూ కేంద్రం నుంచి వచ్చిన నిధులు రూ.13,447కోట్లు. ఇందులో వినియోగమైన నిధులు రూ.9,877కోట్లు. అంటే కేవలం 19శాతం. తాగునీటి వసతి కోసం 600 ప్రాజెక్టులను ఆమోదించగా, ఇందులో పూర్తయినవి 42 ప్రాజెక్టులు. ఖర్చు చేసింది రూ.112కోట్లు. మురుగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ కోసం 318 ప్రాజెక్టులకు ఓకే చెప్పగా, నాలుగు ప్రాజెక్టులు పూర్తిచేశారు. రూ.12కోట్లు ఖర్చుచేశారు. పట్టణాల్లో డ్రైనేజ్ నిర్వహణ కోసం 71 కాంట్రాక్ట్‌లను ఆమోదించగా, కేవలం 11 ప్రాజెక్టులు మాత్రమే పూర్తయ్యాయి. రూ.4కోట్లు వ్యయం చేశారు. ఇదీ ఐదేండ్లుగా 'అమృత్' పథకం అమలైన తీరు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన

పట్టణాల్లో లక్ష కోట్ల రూపాయల్ని ఖర్చు చేసి 'గృహ నిర్మాణ' పథకాన్ని అమలుజేస్తున్నామని కేంద్రం ఘనంగా ప్రకటించింది. డిసెంబరు, 2018కల్లా కోటీ 20 లక్షలమందికి గృహ వసతి కల్పిస్తామని చెప్పింది. ఈ ఐదేండ్ల కాలంలో మోడీ సర్కార్ పథకానికి కేటాయించిన నిధులు రూ.33,652కోట్లు. వాస్తవ వ్యయం రూ.20వేల కోట్లు. క్షేత్రస్థాయిలో 10 శాతం మాత్రమే ఇండ్ల నిర్మాణం పూర్తయింది. ఈ పథకం అమలులో పారదర్శకతపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఎత్తున లీకేజ్ చోటుచేసుకుంటున్నదని ఫిర్యాదులు అందాయి.

హాస్టల్‌లో విద్యార్థిని మృతి

- ప్రయివేటు కాలేజీలో ఘటన
- యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళన

నవతెలంగాణ-సూర్యాపేట

ప్రయివేటు కాలేజీలో చదువుతున్న ఓ ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం జరిగింది. విద్యార్థి మృతికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యులు, విద్యార్థులు ఆందోళనకు దిగారు.

ఆత్మకూరు (ఎస్) మండలం ఏపూర్ గ్రామానికి చెందిన షేక్ షమీనా (16) జిల్లా కేంద్రంలోని శ్రీనిధి జూనియర్ కళాశాలలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే కళాశాలకు చెందిన హాస్టల్‌లో ఉంటోంది. ఈ క్రమంలో షమీనా అనారోగ్యానికి గురి కావడంతో కళాశాల సిబ్బంది తల్లి ఫాతిమాకు ఫోన్‌లో సమాచారం అందించారు. తాము అందుబాటులో లేమనీ, అమ్మాయిని ఆస్పత్రికి తీసుకువెళ్లాలనీ కళాశాల సిబ్బందికి తల్లి చెప్పింది. కానీ కళాశాల సిబ్బంది ఆస్పత్రిలో చూపించకపోవడంతో షమీనా మృతి చెందిందని బంధువులు ఆరోపిస్తున్నారు. కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తమ కూతురు చనిపోయిందని కుటుంబ సభ్యులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. మృతురాలి తల్లి ఫాతిమా ఫిర్యాదు మేరకు ఎస్ఐ భిక్షపతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.